జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | బుధవారం 17 జూన్ 2026 | సంపుటి: 19 | సంచిక: 101 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , జ్యేష్ఠ మాసము , తిథి: తదియ - 21:41:34 వరకు నక్షత్రంపునర్వసు - 13:38:20 వరకు కరణంతైతిల - 11:14:50 వరకు, గర - 21:41:34 వరకు పక్షంశుక్ల యోగంధ్రువ - 20:51:10 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## నీట్ రీ ఎగ్జామ్‌తో అప్రమత్తం

### టెలిగ్రామ్ యాప్‌పై కేంద్రం ఆంక్షలు

న్యూఢిల్లీ,జూన్16(ప్రజాజ్యోతి): నీట్ 2026 రీ-ఎగ్జామినేషన్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షను సురక్షితంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు టెలిగ్రామ్ యాప్ యాక్సెస్‌పై తాత్కాలిక ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. ఐటీ చట్టం సెక్షన్ 69ం కింద ఈ చర్యలు తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

మిగతా 2లో..

## ఆర్థిక సంక్షోభంలో కూరుకున్న తమిళనాడు

### రాష్ట్ర ఆర్థిక భారం రూ.13.18 లక్షల కోట్లకు చేరిక

### శ్వేతపత్రం విడుదల చేసిన సిఎం విజయ్

చెన్నై,జూన్16(ప్రజాజ్యోతి): తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సమగ్ర శ్వేతపత్రాన్ని మంగళవారం నాడు విడుదల చేసింది. డీఎంకే ప్రభుత్వ హయాంలో రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని, ఖజానా ఖాళీ అయిందని ఆ శ్వేతపత్రంలో పేర్కొంది. రాష్ట్ర మొత్తం ఆర్థిక భారం రూ.13.18 లక్షల కోట్లకు

మిగతా 2లో..




# హార్మూజ్ ఇక టోల్ ఫ్రీ ఏరియా

- నౌకలు స్వేచ్ఛగా వెళ్లేందుకు అనుమతి
- శుక్రవారం నాటికి పూర్తిగా తెరుచుకుంటుంది
- ఇరాన్‌పై కుదిరిన ఒప్పందాన్ని త్వరలో వెల్లడిస్తా
- జి7 సదస్సులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన
- ట్రంప్‌తో ప్రధాని మోడీ కరచాలనం
- జి7 సదస్సులో ఆత్మయీయ పలకరింపు




ప్యారిస్,జూన్16(ప్రజాజ్యోతి): ఫ్రాన్స్‌లో జీ 7 సదస్సు వేదికగా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. హార్మూజ్ శాశ్వతంగా టోల్ రహితంగా ఉంటుందని వెల్లడించారు. సమ్మిట్‌ను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగం చేశారు. ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి శుక్రవారం నాటికి పూర్తిగా తెరుచుకుంటుందని.. ఇకపై అది శాశ్వతంగా టోల్ ఫ్రీగా అందుబాటులో ఉంటుందని ప్రకటించారు. అలాగే ఇరాన్‌తో కుదిరిన అవగాహన ఒప్పందం పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తానని.. దీనిపై ప్రత్యేకంగా మీడియా సమావేశం కూడా నిర్వహిస్తానని తెలిపారు. ఇరాన్‌తో కుదిరిన ఈ ఒప్పందాన్ని అమెరికా కాంగ్రెస్ పరిశీలనకు పంపనున్నట్లు ట్రంప్ చెప్పారు. ఈ ఒప్పందంలో ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయబోదని స్పష్టంగా పేర్కొన్నామని వెల్లడించారు. ఇరాన్‌తో చర్చల

మిగతా 2లో..

## ఒప్పందంపై అనుమానాలు చక్కర్లు

- ఇరాన్‌కు 300 మిలియన్ డాలర్ల పరిహారం అంటూ వార్తలు
- అలాంటిదేమీ లేదని ట్రూత్‌లో వెల్లడించిన ట్రంప్
- అణ్వాయుధాలపై ఖచ్చితమైన ఒప్పందం కోసం పట్టు

న్యూయార్క్,జూన్16(ప్రజాజ్యోతి): అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరినప్పటికీ ఇంకా అనుమానాలు తొలగడం లేదు. అయితే అణ్వాయుధాలను కలిగి ఉండబోమని ఇరాన్ అంగీకరించినట్లు సోమవారం డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇక తమ శాంతి ఒప్పందంలో భాగంగా ఇరాన్‌కు 300 మిలియన్ల డాలర్ల ఇవ్వనున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. ట్రంప్ తన ట్రుత్ సోషల్‌లో ఈ మేరకు స్పందించారు. ఇరాన్‌తో కుదిరే డీల్‌లో.. అణ్వస్త్రాలను డెవలప్ చేయబోమని ఆ దేశం అంగీకరించనున్నట్లు ట్రంప్ చెప్పారు. ఇరాన్, అమెరికా మధ్య ఎంవోయూ కుదిరినట్లు వార్తలు వెలుబడుతున్న విషయం తెలిసిందే. జెనీవాలో శుక్రవారం అధికారికంగా రెండు దేశాల మధ్య సంతకాలు జరిగే అవకాశం

మిగతా 2లో..

## తెలంగాణ అభివృద్ధిపై ఎవరి పాఠాలు

# అవసరం లేదు

### తెలంగాణ అభివృద్ధి పట్ల మా చిత్తశుద్ధి మాకుంది

### హైదరాబాద్ మెట్రోకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం

### మేం అడ్డుకుంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవు

### అన్ని విధాలుగా అనేక కార్యక్రమాలు చేపట్టాం

### రేవంత్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ,జూన్16(ప్రజాజ్యోతి): తెలంగాణ అభివృద్ధిపై తమకెవరూ పాఠాలు చెప్పాల్సిన పనిలేదని, ఎవరి కోసమో తాము తెలంగాణ అభివృద్ధికి పాటుపడడం లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా మిగతా మెట్రో రైలు ప్రాజెక్టుల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర ప్రభుత్వం సహకారమందిస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. సాంకేతిక, ఆర్థిక విషయాలపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే ప్రాజెక్టులు సాకారమవుతాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విమర్శల నేపథ్యంలో దిల్లీలో కిషన్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. తాను వద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవని చెప్పారు. మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి అనేక మార్పులను రాష్ట్రానికి కేంద్రం సూచించిందన్నారు. ప్రాజెక్టులను దొడ్డిదారిన ఆపే సంస్కృతి భాజపాకు లేదని.. కాంగ్రెస్‌కే ఉండొచ్చని వ్యాఖ్యానించారు. ఎవరి కోసమూ ప్రాజెక్టులను అడ్డుకోబోమన్నారు. తెలంగాణ అభివృద్ధి పట్ల మాకు చిత్తశుద్ధి ఉంది. గతంలో మెట్రో ఫేజ్-1కు కేంద్రం రూ.1,250 కోట్లు మంజూరు

మిగతా 2లో..




## అవినీతి అనకొండ నరహరి

- భారీగా ఆస్తులు గుర్తించిన ఏసీబీ
- ఇంట్లో రూ.1.54కోట్ల నగదు స్వాధీనం



హైదరాబాద్,జూన్16(ప్రజాజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిని ఏసీబీ అరెస్ట్ చేసింది. నరహరి ఇంటితో పాటు మరో 9 చోట్ల తనిఖీలు నిర్వహించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఈ సోదాల్లో భారీగా అక్రమాస్తులను గుర్తించినట్లు తెలిపారు. నరహరి ఇంట్లో రూ.1.54కోట్ల నగదు, రూ.5.04 కోట్ల విలువ చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంకు ఖాతాలో రూ.2.29 కోట్లు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. 1.3 కిలోల బంగారం, 8 కిలోల వెండి ఆభరణాలు, భార్య పేరున రెండు బ్యాంకు లాకర్లు, కారు ఉన్నట్లు అధికారులు తేల్చారు. రంగారెడ్డి జిల్లాల్లో 5 ఓపెన్ ఎ÷-లాట్లు, మహేశ్వరంలో 1.24 ఎకరాల వ్యవసాయ భూమి, పుప్పాలగూడలో ఓ అపార్ట్‌మెంట్ ఉన్నట్లు గుర్తించారు. నార్సింగిలోని అపార్ట్‌మెంట్‌లో రెండు ఎ÷-లాట్లు, రాజేంద్రనగర్‌లో మరో ఎ÷-లాట్, గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో జీప్లస్ 3 భవనం, ఛత్రినాకలో మూడంతస్తుల భవనం ఉన్నట్లు ఏసీబీ తేల్చింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ ఆస్తుల విలువ రూ.13.05 కోట్లు అని.. బహిరంగ మార్కెట్‌లో రూ.150 కోట్లకు పైనే ఉంటుందని అధికారులు వెల్లడించారు.



## సన్నరకం వరి విత్తనాలు

# సిద్ధం చేయండి

### రైతు వేదికల వద్ద అందుబాటులో ఉంచండి

- సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించండి
- వ్యవసాయంలో కూడా ఏఐ, టెక్నాలజీ వినయోగం పెరగాలి
- వ్యవసాయ వర్సిటీ నోడల్ ఏజెన్సీగా సాంకేతిక సహకారం
- వ్యవసాయరంగంపై ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్

హైదరాబాద్,జూన్16(ప్రజాజ్యోతి): ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. నిర్దేశించిన వరిరకాల విత్తనాలను రైతు వేదికలో అందుబాటులో ఉంచాలని మార్గనిర్దేశం చేశారు. సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలని ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 7 రకాల సన్న వడ్లను సబ్సిడీపైన ఇవ్వాలని మార్గనిర్దేశర చేశారు. భద్రాద్రి కొత్తగూడం దమ్మపేట

మిగతా 12లో..

## ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్

- నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్
- రేపటి భవిష్యత్ కోసం నా మానసపుత్రిక
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్వీట్

హైదరాబాద్,జూన్16(ప్రజాజ్యోతి): రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ స్కూల్‌ను బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో తన ఎక్స్ ఖాతా వేదికగా సిఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ' 'భారతదేశ భవిష్యత్తు తరగతి గదుల్లో

మిగతా 12లో..

## పారదర్శకంగా యూరియా పంపిణీ

### ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇంటినుంచే బుకింగ్

### ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులకు లబ్ది

### క్యూ లైన్లు కట్టాల్సిన దుస్థితి రాకుండా నిర్ణయం

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కామారెడ్డి,జూన్16(ప్రజాజ్యోతి): రైతులకు పారదర్శకంగా యూరియా పంపిణీ చేస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో మంత్రి మాట్లాడుతూ.. క్యూ లైన్లు అవసరం లేకుండా ఇంటి నుంచే యూరియా బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని రైతులకు కల్పిస్తామన్నారు. ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులు బుకింగ్ చేసుకున్నారని వివరించారు. మొత్తం13.22 లక్షల యూరియా బస్తాల బుకింగ్ చేసుకుంటే.. 84.6 శాతం పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలో 90.22 లక్షల యూరియా బస్తాల భారీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

మిగతా 2లో..

## చిన్న కాంట్రాక్టర్లకు 'ప్రజా ప్రభుత్వం' అండ

### దశలవారీగా పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తాం

### ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ

### 18న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమం



హైదరాబాద్,జూన్16(ప్రజాజ్యోతి): రాష్ట్రంలోని చిన్న సివిల్ కాంట్రాక్టర్ల సమస్యల పట్ల ప్రజా ప్రభుత్వం అత్యంత మానవీయ కోణంలో స్పందిస్తోందని, వారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం ప్రజాభవన్ లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, సివిల్ కాంట్రాక్టర్లు డిప్యూటీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు రావాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేయగా, ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. చిన్న కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకునే ఆర్థిక శాఖ ప్రతినెలా

మిగతా 2లో..

## రాష్ట్రవ్యాప్తంగా ఈగిల్ ఫోర్స్ దాడులు

- గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా
- 19మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 14మందికి గంజాయి పాజిటివ్‌గా గుర్తింపు

హైదరాబాద్,జూన్16(ప్రజాజ్యోతి): తెలంగాణలోని వివిధ కమిషనరేట్ల పరిధిలో గంజాయి, డ్రగ్స్ వినియోగంపై భారీగా ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో మంగళవారం ఈగల్ ఫోర్స్ పలు ప్రాంతాల్లో

మిగతా 2లో..

# కేసీఆర్ హయాంలో స్కీంలు.. కాంగ్రెస్‌లో స్కామ్‌లు



### కరోనాలో కూడా కెసిఆర్ రైతుబంధు ఏనాడూ ఆపలేదు

### రేవంత్ ముమ్మాటికీ ఎగవేతల రేవంత్ అంటాను

### కేసులు పెట్టినా భయపడేది లేదన్న హరీష్ రావు

కరీంనగర్,జూన్ 16(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక కేసీఆర్ హయాంలో స్కీంలు చేపడితే కాంగ్రెస్ పాలనలో రేవంత్ సర్కారు స్కాంలకు పాల్పడుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. ఎగవేతల రేవంత్ అంటే తనపై తిమ్మాపూర్ స్టేషన్ లో కేసు పెట్టినారని, ఇటీవల నోటీసులు ఇచ్చారని, ఆయన ఎగవేతల రేవంత్ అని మరోసారి అన్నారు. రైతు బంధు రూ.19వేల కోట్లు ఎగబెట్టారని అన్నారు. కేసీఆర్ హాయాంలో కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఏనాడు ఆపలేదని గుర్తు చేశారు. కరీంనగర్ జిల్లా అల్గునూర్ లో మానకొండూర్ నియోజకవర్గ స్థాయి డిజిటల్

మిగతా 2లో..

## రాజకీయాలకు అతీతంగా ఉద్యమకారుల గుర్తింపు

హైదరాబాద్,జూన్16(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారులను రాజకీయాలకు అతీతంగా గుర్తిస్తామని అందుకోసం ఏర్పాటైన

మిగతా 2లో..



# సంపాదకీయం

## ఎరువులు, విత్తనాలపై భరోసా ఏదీ?

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నైరుతి ప్రవేశించినా ఇప్పటికీ ఆశించిన వర్షాలు పడడం లేదు. రైతులు ఖరీఫ్‌కు సన్నద్ధం అవుతున్నా, అప్పుడే తొందరపడవద్దని, విత్తనాలు వేసుకోవద్దని వ్యవసాయాధికారులు హెచ్చరి స్తున్నారు. మరోవైపు సన్నరకాలను, డిమాండ్ ఉన్న వంగడాలనే వేయాలని తెలంగాణ ప్రభుత్వం తాజాగా సూచించింది. నిజానికి ఏ పంటలు వేయాలో రైతులకు సూచించి, అందుకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలను సరఫరా చేసే విధానం అవంబించి ఉంటే ఇవాళ వ్యవసాయ సంక్షోభం ఉండేది కాదు. ఏ భూములు ఏ పంటలకు అనువో ఇన్నేళ్లయినా గుర్తించి, రైతులను వ్యవసాయానికి అనుగుణంగా సన్నదం చేయడంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. మరోవైపు ఎల్‌నినో భయ పెడుతున్న వేళ రైతులకు తగిన సూచనలు, సలహాలు చేయడం లేదు. ప్రణాళికలు సిద్దం చేయడం లేదు. అందుకే ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఏటా రైతులు బలవుతున్నారు. నీటి లభ్యత, భూముల వివరాల ఆధారంగా పంటలు పండించే పద్దతి కానరావడం లేదు. రైతులు కూడా తమకు తెలిసిన వరిని పండిస్తున్నారు. డిమాండ్ ఉన్న పంటలు పండించి, ఆర్థికంగా ఎదగడం లేదు. కాగా ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే తక్కువ నమోదవుతుందని ఐఎండి. అంచనా వేసింది. ఎల్‌నినో రాష్ట్రంపై ప్రభావం చూపుతుందని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు వెల్లడించాయి. అందుకు తగ్గ ప్రణాళికలతో సన్నద్ధం కావాలని ఆదేశించినా., అదేమిటో రైతులకు బోధపడడం లేదు. రాష్ట్రంలో అత్యధికంగా వ్యవసాయం సాగేది ఖరీఫ్‌లోనే. నిరుడు పంటల సరళిలో మార్పులు చోటు చేసుకున్నప్పటికీ మొత్తంగా విస్తీర్ణ పరంగా సాధారణ సాగు నమోదైంది. అయితే వర్షాభావం, అకాల, భారీ వర్షాలు, తుపాన్లతో పంట నష్టాలు సంభవించి అన్నదాతలను ఆర్థికంగా నష్టపరిచాయి. కీలక సమయంలో వర్షాల్లేక కొన్ని ప్రాంతాల్లో పంట నష్టం వాటిల్లింది. ఖరీఫ్‌లో డ్రై స్పెల్ వందల మండలాలల్లో తిష్ట వేసినా ప్రభుత్వం కేవలం పెద్దగా పట్టించుకోలేదు. ఎపిలో రబీలో దుర్భిక్ష పరిస్థితులు విస్తరించగా 51మండలాల్లో కరువును ప్రకటించి చేతులు దులుపుకుంది. ప్రకటించిన మండలాల్లో కూడా రైతులకు ఎలాంటి ప్రత్యేక సహాయమూ చేయలేదు. ఇంకో వైపు ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో రైతులకు ఏ పంటకూ ధర రాక, ధర ఇప్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టక రైతులు నష్టాలను చవిచూశారు. కేంద్రం కూడా ఒక పద్దతి ప్రకటించడం లేదు. ఎల్‌నినోతో ఏ పంటలు వేసుకోవాలో, దేనికి మద్దతు ఇస్తరో తెలియడం లేదు. తెలంగాణలో మక్కజొన్న, జొన్న పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. వాటికి గిట్టుబాటు ధరలు లేక తల్లడిల్లారు. పంటలు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. ఖరీఫ్ ముంచుకొస్తున్నా, నేటికీ సక్రమంగా ధాన్యం సేకరణ జరగలేదు. ఇకపోతే ఈఖరీఫ్‌లో సేద్యానికి రైతులకు అత్యవసరంగా కావాల్సినవి నాణ్యమైన విత్తనాలు,ఎరువులు, క్రిమిసంహారక మందులు, పెట్టుబడులు. రైతులకు అవసరమైన మొత్తం విత్తనాల్లో ప్రభుత్వం రాయితీపై అందించేవి 30 శాతమే. అవీ కొన్ని పంటలకే పరిమితం. ఎపిలో వేరుశనగ విత్తనాల పంపిణీ ఏర్పాట్లు ఆలస్యమయ్యాయి. వరి, కందులు, ఇతర అపరాలూ అంతే. పచ్చిరొట్ట పంట విత్తనాలిస్తున్నామంటున్నా బహిరంగ మార్కెట్ ధరలే రాయితీ విత్తనాలకూ నిర్ణయించారు. రాయితీ విత్తనాల పంపిణీ యావత్తూ అదే తీరు. సీజన్ ప్రారంభా నికి ముందు నుంచీ కేంద్రం ఆదేశాలతో యూరియా, డిఏపి వాడకాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లని, కార్డులని, పైలెట్ ప్రాజెక్టులని ప్రహసనం లేవనెత్తి రైతుల్లో, ముఖ్యంగా కౌలు రైతుల్లో గుబులు రేపింది. నిరుడు ప్రభుత్వ ముందుచూపు లేక యూరియా దొరక్క రైతులు ఇబ్బంది పడగా, ఆ పరిస్థితులే ఇం కా కొనసాగుతున్నాయి. నకిలీ, కల్తీ, అనుమతుల్లేని పత్తి విత్తనాల బెడద ఉండనే ఉంది. కేంద్రం పెంచిన డీజిల్, పెట్రోలు ధరలు, ఎరువుల ధరలు రైతాంగాన్ని కుంగదీస్తున్నాయి. తొలకరి సంకేతాలతో రైతన్నలు సాగుకు సిద్ధమయ్యేందుకు కావాల్సిన పెట్టుబడులు సమకూర్చడంపై ప్రభుత్వంలో నెలకొన్న స్తబ్దత ఆందోళన కలిగిస్తుంది. ఎపిలో కౌలు రైతులకు రెండేళ్లల్లో ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఈసారైనా ఇస్తారో లేదో తెలీదు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల ఊసే లేదు. నిరుడు అక్టోబర్‌లో మొంథా తుపాన్ రాగా నేటికీ రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదు. పంటల బీమా సొమ్ము లేదు. కరువు మండలాల్లో రైతులకు పరిహారం లేదు. రెండేళ్లల్లో రైతులకు సున్నా వడ్డీ రూపాయి కూడా విడుదల చేయలేదు. వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలు పుస్తకాలకే పరిమితం అయ్యింది. ప్రాజెక్టుల కింద నీటి విడుదలకు షెడ్యూల్ ఇచ్చినా ఎల్‌నినో, వర్షాభావాలను పరిగణనలోకి తీసుకోవాలి. సేద్యం సజావుగా సాగాలంటే రైతుల అవసరాలన్నింటినీ తీర్చేందుకు ప్రభుత్వంలో చిత్తశుద్ధి, ముందుచూపు, సన్నద్ధత అవసరం. ఇకపోతే తెలంగాణలో ప్రభుత్వం తీరు సక్రమంగా కనిపించడం లేదు. దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్‌లోనూ డిమాండ్ ఉన్న 8 రకాల మేలైన వరి వంగడాలనే సాగు చేసేలా రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు, శాస్త్రవేత్తలు సూచించారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సబ్‌కమిటీ ఎనిమిది రకాల వంగడాలను సాగు చేయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు మంత్రులకు సూచించారు. ఈ వంగడాలకు మార్కెట్‌లో ఉన్న డిమాండ్ వల్ల ప్రభుత్వ మద్దతు ధర కంటే చాలా ఎక్కువ ధర లభించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, యూరోపలలో ఈ బియ్యానికి విపరీతమైన ఆదరణ ఉందని, వీటికి విత్తనాల కొరత కూడా లేదని వివరించారు. అంతర్జాతీయ మార్కెట్ ధరల్లో వచ్చే ఒడిదొడుకుల నుంచి రైతులకు రక్షణ లభించాలన్నా ఈ 8 రకాల సాగు ఒక్కటే మార్గమని తెలిపారు. రాష్ట్రంలో సాగవుతున్న అన్నిరకాల సన్న బియ్యానికి మార్కెట్‌లో ఆదరణ లభించడం లేదని, కొన్నిరకాల ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తున్నప్పుడు నూకలు ఎక్కువగా వస్తున్నాయని పౌర సరఫరాల శాఖ అధికారులు మంత్రులకు వివరించారు. డిమాండ్ లేని రకాల సాగును క్రమంగా తగ్గించి, ఎగుమతులకు ఉపయోగపడే నిర్దిష్ట రకాలనే ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. అయితే ఇది క్షేత్రస్థాయిలో రైతులకు చేరాలి. వారికి సక్రమంగా విత్తనాలు సరఫరాచేసి, అవే పంటలు పండించేలా ప్రోత్సహించేందుకు నడుం బిగించాలి. అప్పుడే సత్ఫలితాలు సాధించగలం.

## కేసీఆర్ హయాంలో స్కీంలు.. కాంగ్రెస్‌లో స్కామ్‌లు



మొదటిపేజీ తరువాయి..

సభ్యత్వ నమోదు తో పాటు సర్ పై విస్తృత స్థాయి సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన హరీష్ రావుకు అల్గునూర్ లో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పని కేసీఆర్ ప్రభుత్వంలో రైతు బంధు, రైతు భీమా, కళ్యాణ లక్ష్మీ లాంటి స్కీంలను కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తే సివిల్ సప్లైలో, సింగరేణిలో, హామ్ రోడ్లలో, పిల్లలకు అన్నం పెట్టే గుడ్లలో, బట్టలలో స్కాంలు రేవంత్ సర్కాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఉపాధి కూలీలకు రూ.12వేలు ఇవ్వడం లేదని, మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న రేవంత్ కుటుంబం కోటీశ్వరులు అవుతున్నారని విమర్శించారు. జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ సంక్షేమ మంత్రులకు తెలియకుండా స్కాంలు జరుగుతున్నాయని, జిల్లా పరువు పోతుందని, రూ.2వేల కోట్ల స్కాం జరిగినా వారికి తెలియలేదని, ఇందులో ఎనుమల వారిదే రాజ్యం నడుస్తోందన్నారు. పతకాల అమలుకు ఖజానా లేదంటున్న రేవంత్ ఫుట్ బాల్ ఆటకి, అందాల పోటీలకు, వాస్తు పేరుతో సచివాలయ పనులకు, పలుచోట్ల క్యాంపు ఆఫీసులకు వందల కోట్లు ఖర్చు చేస్తున్నాడని, ఆయనకు రైతులు, మహిళల పట్ల, పేదల పట్ల మనస్సు లేదని విమర్శించారు. మన సొమ్మును ఇతర రాష్టాల్లో ప్రకటనలకు, ఎన్నికలకు, ఢిల్లీకి పంపిస్తున్నాడని ఆరోపించారు. కమిషన్లు రావని పేదల పథకాలు అమలు చేయడం లేదని, కమిషన్లు వచ్చే పనులను రేవంత్ చేపడుతున్నాడని విమర్శించారు. ఓట్లు పెట్టి దేవుణ్ణి మోసం చేసిన ఎగువేతల రేవంత్ రెడ్డి విద్యార్థులను, నిరుద్యోగులను, రైతులను. మోసం చేస్తున్నాడని అన్నారు. రైతు భీమా ప్రీమియం గడువు పూర్తయి నాలుగు నెలలు అయిందని, రైతులు చనిపోతే ఆ కుటుంభాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డిస్కం పేరుతో రైతులకు విద్యుత్తు కోతను తీసుకురానున్నారని ఆరోపించారు. రిజర్వాయర్లు, మెయిన్ కెనాల్స్ పూర్తి చేసి వేల ఎకరాలకు నీరిచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వముదేనని, పిల్ల కాలువలు పూర్తి చేస్తే మరిన్ని ఎకరాలకు నీరు అందించవచ్చున్నారు. అడుగడుగునా రైతులను వేధిస్తున కాంగ్రెస్ కి ఎవరైనా ఓటు వేస్తారా అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టి వేధిస్తున్న కాంగ్రెస్ ఓటమి అంచున ఉందన్నారు. వడ్లుకొనే తెలివిలేని రేవంత్ బీఆర్ఎస్ ని మొలకెత్తనివ్వనని అంటున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ పరిస్థితి ఆయనకు అర్థమైందని, ఆయన పని అయిపోయినందునే అధికారులు ఆయన మాట వినడం లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ బాగుండాలంటే బీఆర్ఎస్ మళ్లీ గెలిచి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమంలో మానకొండూర్ నియోజకవర్గ ప్రజలు మనస్ఫూర్తిగా ఉద్యమం చేసినారని, 2001లో అన్నీ జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను గెలుపొందిన నియోజకవర్గములో కరుడుగట్టిన కార్యకర్తలున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల నాణ్యమైన కరెంటు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వంలో పదకొండు గంటలకు తగ్గిందని, రైతు డిస్కంను ప్రవేశపెట్టి ఆరు ఏడు గంటలకే కుదించనున్నారని తెలిపారు. రైతు డిస్కం పేరిట సోలార్, విండ్ పవర్ ఇచ్చేలా చూస్తున్నారని, రాత్రి పూట కరెంటు ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. రైతుల ఉసురు తీసేందుకు రైతు డిస్కంలను తీసుకురానున్నారని ఆరోపించారు. ఇలాంటి రేవంత్ కి రైతులు ఎవరైనా ఓటు వేస్తారా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రైతులు సైతం కేసీఆర్ ని గుర్తు చేస్తున్నారని, రేవంత్ కి ఓటు వేసేందుకు సిద్దంగా లేరని అన్నారు. రీఎంబర్స్ మెంట్ ని నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల్లో సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని హరీష్ రావు ఆరోపించారు. బలహీన వర్గాల పిల్లలంటే రేవంత్ కి ఇష్టం లేదన్నారు. ఇప్పటి వరకు సీఎం, మంత్రులు రీ ఎంబర్స్ మెంట్ విషయం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నత విద్యకు 30లక్షల మంది విద్యార్థులు దూరమై ఒక తరం వెనుకబడే ప్రమాదం ఉందన్నారు. కాంట్రాక్టర్లకు డబ్బులు ఇస్తున్న రేవంత్ సర్కారు పేద విద్యార్థులకు ఇవ్వడానికి మనస్సు రావడం లేదని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పిన రేవంత్ కేవలం 16వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని, నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రాన్ని సస్యశ్యామం చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, 23 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందంచినట్లు తెలిపారు. ప్రాజెక్టులు, ప్రధాన కాలువలు పూర్తి చేసినట్లు, పిల్ల కాలువలు అక్కడక్కడా పూర్తి చేస్తే మరిన్ని ఎకరాలకు నీరు అందించవచ్చున్నారు. ప్రతీ 20 ఏళ్లకోసారి ఓటరు జాబితా సవరణ (సర్) ని ఎన్నికల కమిషన్ చేపడుతుందని, దీనిపై బీఆర్ఎస్ కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. విచారణ సమయంలో అధికారుల వెంట బీఆర్ఎస్ బూత్ ఇంచార్జీలు ఉండాలని సూచించారు. రివిజన్ సమయంలో ఇతర పార్టీల వారి పేర్లను తొలగించే ప్రమాదం ఉందని, జాగ్రత్తగా గమనించాలని తెలిపారు. ఈ సమావేశమంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణా రావు, ఇంచార్జీ రవీంధర్ రావు, కార్పోరేటర్ కాల్వ మల్లేశం, నాయకులు రవీందర్ సింగ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, చల్ల హరిశంకర్, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, రావుల రమేష్, సిద్దం వేణు, శేఖర్ గౌడ్, స్వామిరెడ్డి, ఏకానందం, నాయిని వెంకట రెడ్డి, రవీంధర్ రెడ్డి, వెంకన్న, మహిపాల్, రెడ్డి, పొన్నం అనిల్ గౌడ్, గడ్డం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధిపై ఎవరి పాఠాలు అవసరం లేదు




మొదటిపేజీ తరువాయి..

చేసింది. అనాలోచితంగా, దుందుడుకు ధోరణిలో సీఎం మాట్లాడటం సమంజసం కాదు. నాతో పాటు ప్రధాని మోదీ, కేంద్రానికి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదు. మేం రేవంత్‌రెడ్డికి కాదు.. తెలంగాణ ప్రజలకు జవాబుదారీ. రాష్ట్ర అభివృద్ధి కోసం 12 ఏళ్లుగా పనిచేశాం.. ఇప్పుడూ పనిచేస్తాం. ఇచ్చిన హామీలను తు.చ. తప్పకుండా అమలు చేస్తున్నాం. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదన్నారు. తెలంగాణ బిడ్డగా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశాను. దిల్లీకి వచ్చి రెండుసార్లు ధర్నా చేశాం. బిల్లు ఆమోదం పొందిన తర్వాతే ఏపీ భవన్‌లో ఆమరణ దీక్ష విరమించా. రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్, నేడు రేవంత్‌రెడ్డికి లేఖలు రాశా. రేవంత్ కోరితే కాకుండా.. కేంద్ర ప్రభుత్వమే బాధ్యతగా తీసుకుని రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టింది.

ఎంఎంటీఎస్ ఫేజ్-2కు నాడు కేసీఆర్ సహకరించలేదు. అయినప్పటికీ ప్రధాని చేతులమీదుగా ప్రారంభించాం. తెలంగాణకు రాదనుకున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సాధించాం. రాష్ట్రాల్లో ఏ పార్టీకి చెందిన ప్రభుత్వాలు ఉన్నా అందరికీ కేంద్రం సహకారం అందిస్తోంది. మోదీ ఇస్తుంటే కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారనడం దిగజారుడు రాజకీయాలని మండిపడ్డారు. 50 ఏళ్ల వడ్డీ లేకుండా రాష్ట్రానికి ఇటీవల సాస్కీ రుణాలను కేంద్రం మంజూరు చేసింది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు ఏడీబీ రుణానికి కేంద్రం ఎన్వోసీ ఇచ్చింది. ఎన్‌సీడీసీ ద్వారా పదేళ్లుగా తెలంగాణకు రూ.లక్ష కోట్లు మంజూరు చేశాం. ధాన్యం కొనుగోళ్లకు రూ.37వేల కోట్లు మంజూరు చేసి.. ఇప్పటికే రూ.34వేల కోట్లు అందించాం అని కిషన్‌రెడ్డి వివరించారు.తెలంగాణ అభివృద్ధిపై తమకు చిత్తశుద్ధి ఉందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మెట్రో అంశంలో బీజేపీపై బురదజల్లుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన మండిపడ్డారు. మెట్రో రైలు ప్రాజెక్ట్ ఆపాలని తానేందుకు చెబుతానంటూ ఈ సందర్భంగా అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణలో కేంద్రం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. ఒక లక్షా 75 వేల కోట్ల రూపాయలతో రహదారులను అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధి మా బాధ్యత' అని కిషన్ రెడ్డి పునరుద్ఘాటించారు. తనపై సీఎం రేవంత్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ అనాలోచితంగా మాట్లాడుతున్నారన్న ఆయన.. తమకు రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ ఏమీ అవసరం లేదన్నారు. అభివృద్ధి అంశంలో తమకు పాఠాలు నేర్పాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ నేతలకు సూచించారు.

## పారదర్శకంగా యూరియా పంపిణీ

మొదటిపేజీ తరువాయి..

రైతుల సూచనలతో ఫర్టిలైజర్ యాప్‌లో నిరంతర మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. స్మార్ట్ ఫోన్ లేని రైతులకు టోల్ ఫ్రీ ద్వారా యూరియా బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ టోల్ ఫ్రీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ యాప్ వినియోగంలో నిజామాబాద్ జిల్లా రైతులు రాష్ట్రంలో ముందంజలో ఉన్నారని ప్రశంసించారు. యూరియా బ్లాక్ మార్కెటింగ్, అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకే ఈ డిజిటల్ విధానం అమల్లోకి తీసుకొచ్చినట్లు వివరించారు. నిజమైన రైతులకు మాత్రమే ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం ఉన్నా యూరియా కొరత రానివ్వమని రైతులకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల భరోసా కల్పించారు. పెద్ద రైతులు ఆందోళన చెంద వద్దని.. అందరికీ సమానంగా ఎరువుల పంపిణీ చేస్తామన్నారు. అధిక యూరియా వినియోగం భూసారానికి హానికరం అని రైతులను ఆయన హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తక్కువ వర్షాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రైతులకు స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలంటూ రైతులకు మంత్రి తుమ్మల సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరికి బదులు ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటల వైపు వెళ్లాలని రైతులకు స్పష్టం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతాంగానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా కల్పించారు.

## ఒప్పందంపై అనుమానాలు చక్కర్లు

మొదటిపేజీ తరువాయి..

ఉన్నది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదటి రోజు నుంచి స్పష్టంగా ఉన్నారని, ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండబోదని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఓ వీడియో సందేశంలో పేర్కొన్నారు. అణ్వాయుధ సేకరణ కోసం ఇరాన్‌కు అనుమతి ఇవ్వబోమని ఇజ్రాయల్ ప్రధాని బెంజిమన్ నెతన్యహూ కూడా స్పష్టం చేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండవద్దు అని దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నానని, దీన్ని జీవిత మిషన్‌గా భావించానని అన్నారు. డీల్ కుదిరినా, కుదరకపోయినా, ఇరాన్ వద్ద న్యూక్లియర్ వెపన్ ఉండబోదన్నారు. ఇజ్రాయెల్ ప్రధానిగా తాను ఉన్నంత కాలం ఇలా జరగబోదన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో సంక్షోభానికి తెరపడింది. అయితే, ఈ ఒప్పందం ట్రంప్ యంత్రాంగంలో విభేదాలను బయటపెట్టింది. అణ్వాయుధాలు విడిచిపెట్టాలన్న నిర్ణయానికి ఇరాన్ కట్టుబడి ఉంటుందా అనే విషయంపై కొందరు సీనియర్ అధికారులు అనుమానాలు వ్యక్తంచేసినట్లు అమెరికా మీడియాలో కథనాలు వస్తున్నాయి.

## చిన్న కాంట్రాక్టర్లకు 'ప్రజా ప్రభుత్వం' అండ

మొదటిపేజీ తరువాయి..

నిరంతరాయంగా బిల్లులను చెల్లిస్తోందని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క వారికి గుర్తుచేశారు. పెండింగ్ బకాయిల క్లియరెన్స్ కోసం ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తోందని ఆయన వివరించారు. రాష్ట్రంలో చిన్న కాంట్రాక్టర్లకు దశలవారీగా పెండింగ్ బిల్లులన్నింటినీ పూర్తిగా చెల్లించి చిన్న కాంట్రాక్టర్లను ఆదుకుంటామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు.

అంతకుముందు మధ్యాహ్నం కాంట్రాక్టర్ల ప్రతినిధులు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో చర్చలు జరిపారు. అనంతరం ప్రజాభవన్‌కు చేరుకుని, మంత్రి కోమటిరెడ్డితో జరిగిన చర్చల సారాంశాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వివరించారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన సానుకూల హామీతో తాము ఎంతో సంతృప్తి చెందామని, ఈ నెల 18న చేపట్టదలచిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని వాయిదా వేసుకుంటున్నట్లు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ రవీందర్ రెడ్డి ప్రకటించారు. తమ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా అండగా నిలిచిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు అసోసియేషన్ తరఫున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు వి. సత్యమూర్తి, మాజీ జాతీయ అధ్యక్షులు ఎస్.ఎన్. రెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు డి.వి.ఎన్. రెడ్డి, సుగుణాకర్ రావు, భాస్కర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, ప్రభాకర్, శ్యామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## హర్మూజ్ ఇక టోల్ ఫ్రీ ఏరియా

మొదటిపేజీ తరువాయి..

తొలి దశ విజయవంతంగా పూర్తైందని.. రెండో దశ చర్చలు మరింత వేగంగా పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్ ఒప్పందానికి సంబంధించిన పూర్తి పాఠ్యాన్ని అధికారిక కార్యక్రమంలో విడుదల చేస్తానని వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య ఇటీవల కుదిరిన శాంతి ఒప్పందం ప్రపంచ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి పునఃప్రారంభం ప్రపంచ ఇంధన మార్కెట్లకు ఊరటనివ్వనుంది. ఇదిలా ఉండగా.. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ కీలక ప్రకటన చేసింది. అమెరికాతో ఒప్పందం అనంతరం ఇరాన్‌కు చెందిన చమురు ట్యాంకర్లు, ఇతర వాణిజ్య నౌకలు మళ్లీ సముద్ర మార్గంలో ప్రయాణాలు ప్రారంభించాయని వెల్లడించింది. అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధనం సడలింపుకు ఇది సంకేతమని పేర్కొంది. ప్రస్తుతం మూడు ఇరానియన్ చమురు ట్యాంకర్లు ఉత్తర హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తుండగా.. మరో రెండు నౌకలు అవసరమైన సరుకులు, పశువుల మేతతో దక్షిణ ఇరాన్ నౌకాశ్రయాల వైపు వెళ్తున్నాయని ఇరాన్ మీడియా తెలిపింది. ఏప్రిల్ 13 నుంచి అమల్లో ఉన్న అమెరికా నౌకాదళ ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ నౌకల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. అయితే తాజా ఒప్పందంతో ఆ దిగ్బంధనాన్ని ఎత్తివేసే పక్రియ అమలులోకి వచ్చిందని ఇరాన్ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిణామం ప్రపంచ చమురు సరఫరా వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

జీ7 సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కలుసుకున్నారు. దాదాపు 16 నెలల తర్వాత ప్రత్యక్షంగా కలుసుకున్న వీరిద్దరూ ఆత్మీయంగా పలకరించుకోవడం అంతర్జాతీయ వేదికపై ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జీ7 సదస్సు ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశంలో మోదీ, ట్రంప్ ఒకరితో ఒకరు కరచాలనం చేసుకుని కాసేపు మాట్లాడుకున్నారు. గతేడాది ఫిబ్రవరి తర్వాత వీరిద్దరూ కలుసుకోవడం ఇదే మొదటిసారి. సదస్సులో వీరిద్దరూ పక్కపక్కనే కూర్చున్నారు.

బుధవారం ఈ ఇరువురు నేతలు సమావేశం కాబోతున్నారు. భారత్-అమెరికా సంబంధాలు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, భద్రతా అంశాలు, ప్రాంతీయ పరిణామాలపై ఇద్దరు నేతలు చర్చించబోతున్నట్లు సమాచారం.జీ7 సదస్సుకు హాజరైన మోదీ ప్రపంచ నాయకులతో వరుసగా సమావేశాలు నిర్వహించనున్నారు.

## నీట్ రీ ఎగ్జామ్‌తో అప్రమత్తం

మొదటిపేజీ తరువాయి..

జూన్ 22 వరకు భారతదేశంలో టెలిగ్రామ్ యాప్ యాక్సెస్‌పై నియంత్రణ ఉండనుంది. ఈనెల 21న దేశవ్యాప్తంగా నీట్ 2026 రీ-ఎగ్జామ్ నిర్వహించనున్న నేపథ్యంలో, పరీక్ష భద్రతను దృష్టిలో ఉంచుకుని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సిఫార్సు మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.అలాగే, టెలిగ్రామ్‌లో ఈనెల 30 వరకు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను పూర్తిగా నిలిపివేయాలని ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. పరీక్ష పూర్తయిన తర్వాత పాత టైమ్‌స్టాంప్‌లతో నకిలీ 'పేపర్ లీక్' ఆధారాలు సృష్టిస్తున్న ముఠాలను అడ్డుకోవడానికే మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌పై నిషేధం విధించినట్లు తెలుస్తోంది. పేపర్ లీక్ పేరుతో విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న నకిలీ టెలిగ్రామ్ ఛానళ్లపై ఇప్పటికే సైబర్ క్రైమ్ విభాగాలు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అహ్మదాబాద్‌లో 8 టెలిగ్రామ్ ఛానళ్లను నడుపుతూ రూ.1.5 కోట్ల మోసాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాను సైబర్ క్రైమ్ బ్రాంచ్ అరెస్ట్ చేసింది. జూన్ 21న జరగనున్న రీ-ఎగ్జామ్‌కు ముందు ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలపై ఎన్‌టిఏ స్పందించింది. అవన్నీ తప్పుడు ప్రచారాలేనని స్పష్టం చేస్తూ, విద్యార్థులు అధికారిక సమాచారం కోసం వెబ్‌సైట్ ను మాత్రమే అనుసరించాలని సూచించింది. ఎవరైనా మోసాలకు పాల్పడితే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి ఫిర్యాదు చేయాలని కేంద్ర ప్రభుత్వం కోరింది.

## ఆర్థిక సంక్షోభంలో కూరుకున్న తమిళనాడు

మొదటిపేజీ తరువాయి..

చేరిందని తెలిపింది. ప్రత్యక్ష రుణభారం దాదాపు రూ.10 లక్షల కోట్లుగా పేర్కొంది. ఎంకే స్టాలిన్ సారథ్యంలోని గత డీఎంకే ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రాష్ట్ర రుణ భారం దాదాపు రెట్టింపయిందని, రాష్ట్రంలో పుట్టే ప్రతి చిన్నారిపై రూ.1.28 లక్షల అప్పుభారం పడుతోందని ఆ నివేదిక పేర్కొంది. రాష్ట్ర ఆర్థిక లోటు 78,324 కోట్లుగా నమోదైనట్లు తెలిపింది. ప్రభుత్వానికి వచ్చే ప్రతి రూపాయిలో 22.8 పైసలు అప్పులపై వడ్డీ చెల్లింపులకే పోతోందని శ్వేతపత్రం తెలిపింది. జీఎస్‌టీ ఆదాయ వృద్ధి కేవలం 5.45 శాతంగా ఉందని, ఆదాయానికి, అప్పులకు పొంతనే ఉండటం లేదని పేర్కొంది.

## రాజకీయాలకు అతీతంగా ఉద్యమకారుల గుర్తింపు

మొదటిపేజీ తరువాయి..

కమిటీ స్పష్టం చేసింది. మంగళవారం తెలంగాణ అమరవీరుల స్మారక అమరజ్యోతిని ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సందర్శించింది. ఈ కమిటీ చైర్మన్ కె. కేశవరావు నేతృత్వంలో ఈ అమరజ్యోతి వేదికగా సమావేశమైంది. జూన్ 23వ తేదీ నుంచి ఉద్యమకారుల గుర్తింపుపై దశలవారీగా సంప్రదింపులు జరుపుతామని కమిటీ వెల్లడించింది. అందుకోసం విద్యార్థి జేఏసీ, కళాకారులు, రచయితలతో



సమావేశాలు నిర్వహిస్తామని తెలిపింది. అలాగే ప్రజా సంఘాలు, అడ్వకేట్లు, డాక్టర్ల అభిప్రాయాలను కూడా తీసుకుంటామని కమిటీ పేర్కొంది. 2001-2014 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారితో చర్చలు జరుపుతామని వివరించింది. ఈ ఉద్యమకారుల గుర్తింపుపై విస్తృత స్థాయిలో సూచనల సేకరిస్తామంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో అభిప్రాయాల స్వీకరణ జరపనున్నట్లు పేర్కొంది. ఉద్యమకారుల కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా కమిటీ ప్రకటించింది. ఉద్యమకారుల గుర్తింపు పక్రియను పారదర్శకంగా చేపట్టనున్నట్లు తెలిపింది. తెలంగాణ ఉద్యమ చరిత్రకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించింది. ఈ కమిటీ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఈగిల్ ఫోర్స్ దాడులు

మొదటిపేజీ తరువాయి..

ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా 19 మందిని ఈగల్ ఫోర్స్ అదుపులోకి తీసుకుంది. వారికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. 14 మందికి గంజాయి పాజిటివ్, మరో వ్యక్తికి గంజాయితోపాటు డ్రగ్స్ పాజిటివ్ వచ్చింది. పట్టుబడిన వారందరూ డ్రగ్స్ వినియోగించినట్లు విచారణలో అంగీకరించారని ఈగల్ ఫోర్స్ వెల్లడించింది. వీరందరిని డీ అడిక్షన్ సెంటర్లకు తరలించామని పేర్కొంది. వీరి తల్లిదండ్రులకు సమాచారం అందించామని తెలిపింది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లతో పాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఈగల్ ఫోర్స్ ఈ దాడులు చేసింది. ఈగల్ పోర్స్15 బృందాలను ఏర్పాటు చేసి వారి సమన్వయంతో ఈ ఆపరేషన్ నిర్వహించారు. విచారణలో గంజాయి, డ్రగ్స్ తీసుకున్న వారి నుంచి ఈగల్ ఫోర్స్ పలు కీలక విషయాలు రాబట్టింది. గోవాలోని వగటోర్ బీచ్ ప్రాంతాన్ని ఒక ముఠా కేంద్రంగా తీసుకుని కొకైన్, ఎండీఎంఏ, ఎల్‌ఎస్‌డీ, హ్యాష్ ఆయిల్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించింది. వాటిని బెంగళూరు, గోవా నుంచి హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నట్లు కనుక్కొంది. సినీ పరిశ్రమలోని పలువురికి వీటిని విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. సాంకేతిక విశ్లేషణ ద్వారా మొత్తం 44 మంది వినియోగదారులను ఈగల్ ఫోర్స్ గుర్తించింది. డ్రగ్స్ వినియోగదారులు హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకతోపాటు గోవాలో ఉన్నట్లు విచారణలో బహిర్గతమైందని ఈగల్ టీం తెలిపింది. డ్రగ్స్ కొనుగోలు కోసం వినియోగదారులు చక్రపాణి, హర్షిత్ రెడ్డిల ఖాతాలకు రూ.3.13 లక్షలకుపైగా నగదు బదిలీ అయినట్లు గుర్తించింది. 2019లో వీరిద్దరు ఎన్‌డీపీఎస్ కేసులో అరెస్టయినట్లు ఈగల్ టీం వెల్లడించింది.

## ఆదర్శ పాఠశాల సందర్శించిన ఎమ్మెల్యే రామ రావు పెటేల్

ప్రిన్సిపాల్ ఎత్రాజ్ రాజు





**కుంటాల జూన్ 16 (ప్రజాజ్యోతి) :** ఆదర్శ పాఠశాలలో సమస్యలు అతి త్వరలో తీరుస్తామని ముధోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ అన్నారు, మండల కేంద్రమైన కుంటాల స్థానిక పీఎం శ్రీ ఆదర్శ తెలంగాణ మోడల్ స్కూల్ ఉజూనియర్ కళాశాలను అయన మంగళవారం సందర్శించరు,ఆదర్శ పాఠశాలలో ఉన్నటువంటి సమస్యలు, విద్యుత్ తీగలు కిందకి వలి ప్రమాదకరంగ ఉన్నయని. మెన్ రోడ్డు నుండి బాలికల వసతి గృహం వరకు సిసి రోడ్డు నిర్మించలని వర్ష కలంలో విద్యార్తులు రోడ్డు లేక ఇబ్బందులకు గురవుతున్నరని,ప్రిన్సిపాల్ ఎత్రాజ్ రాజు ఎమ్మెల్యే కు వివరించారు, సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రామారావు పటేల్ అతి త్వరలో నిధులు మంజూరు చేసి విద్యుత్తు మరియు సిసి రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు అదేవిధంగా ఆదర్శ పాఠశాలలో ని పారిశుధ్యం, తరగతి గదులను, వంటశాలను సందర్శించారు వర్షాకాలంలో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలనిఆయన సూచించారు ఈ కార్యక్రమంలోకుంటాల సర్పంచ్ జక్కుల గజేందర్, మాజీ ఎంపీపీ అప్కా గజ్జరాం, వార్డు సభ్యులు మాధవరావు, తాటి శివ, ఉపాధ్యాయులు కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## సర్కార్ బడిలో జోరుగా అడ్మిషన్లు

- సర్కారు బడిలో ఫుల్ అడ్మిషన్లు
- బాధ్యత గల సర్పంచ్‌గా సర్కారు బడిలో గ్రామ పిల్లలను చేర్పించిన కళ్యాణి సచిన్ కుమార్ జాదవ్
- పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ



**మామడ జూన్ 17 (ప్రజా జ్యోతి) :** మామడ మండలంలోని బందల ఖానాపూర్ గ్రామానికి తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడి (ప్రభుత్వ పాఠశాల)లో అడ్మిషన్ల కొరకు మంగళవారం తమ పిల్లలకు అడ్మిషన్ తీసుకొని బడిలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కళ్యాణి సచిన్ కుమార్ జాదవ్ మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు, ఉత్తమ బోధన అందిస్తుండడంతో మండలంలోని అన్ని గ్రామాల పాఠశాలల్లో అడ్మిషన్లు జోరుగా పెరుగుతున్నాయని, ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ బడీడు పిల్లలను, డ్రాపౌట్ పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించారు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కళ్యాణి సచిన్ కుమార్ జాదవ్ , పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిత్ర , ఉప సర్పంచ్ పద్మ ముత్యం , ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థిని విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు, అనంతరం పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఇందులో గ్రామ ఆశ వర్కర్లు సమత ,వార్డు సభ్యులు దేవరావు,మరియు నీల భాయ్, స్వప్న తో పాటు గ్రామ ప్రజలు విద్యార్థులు తల్లిదండ్రులు ఉన్నారు.

## మోడీ 12 ఏళ్ల ప్రధానమంత్రి పదవీకాలం సందర్భంగా మొక్కలు నాటిన బీజేపీ నేతలు



**మంచిర్యాల, 16, జూన్(ప్రజాజ్యోతి) :** భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రికార్డు స్థాయిలో 12 సంవత్సరాలుగా ప్రధానమంత్రిగా కొనసాగుతున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. హాజీపూర్ మాజీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి ఆధ్వర్యంలో రాపల్లి గుడి వద్ద "మా పే నామ్ ఏక్ పెడ్" (తల్లి పేరు మీద ఒక మొక్క) కార్యక్రమం కింద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ సీనియర్ నాయకులు మున్నా రాజా సిసోడియా, కాసెట్టి నాగేశ్వరరావు, తులా మధుసూదన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా కొనసాగిన రికార్డును అధిగమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ పరిపాలనను విజయవంతంగా కొనసాగిస్తున్నారని తెలిపారు. మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాలలో ముందుకు సాగుతోందని, ప్రజా సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. దేశంలోని ప్రతి వ్యక్తికి సంక్షేమ ఫలాలు అందే విధంగా అనేక ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ చెప్పిన విధంగా ప్రపంచవ్యాప్తంగా భూతాపం పెరుగుతోందని, భూగర్భ జలాలు క్రమంగా తగ్గిపోతున్నాయని, దేశంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయని, అడవుల విస్తీర్ణం తగ్గిపోతున్న పరిస్థితుల్లో ప్రతి వ్యక్తి తమ తల్లి పేరు మీద ఒక మొక్క నాటాలని ఇచ్చిన పిలుపుతో దేశవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున మొక్కలు నాటే ఉద్యమాన్ని స్వీకరించారని తెలిపారు. ప్రజలందరూ విధిగా తమ తల్లిదండ్రుల పేర్లపై వివిధ కార్యక్రమాలలో భాగంగా మొక్కలు విరివిగా నాటాలని, తద్వారా ప్రకృతి సమతుల్యత ఏర్పడుతుందని పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ అంటే కేవలం రాజకీయాలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రజా సంక్షేమం, దేశ భద్రత, అంతర్గత భద్రత, పర్యావరణ పరిరక్షణ, సుపరిపాలన, స్వచ్ఛ భారత్, విద్య మరియు ఆరోగ్య రంగాల అభివృద్ధి పట్ల స్పష్టమైన దృక్పథంతో దృఢ సంకల్పంతో పనిచేస్తోందని తెలిపారు. ప్రతి భారతీయ జనతా పార్టీ కార్యకర్త తమ పరిధిలోని ప్రాంతాల్లో ఎటువంటి ఆదేశాల కోసం ఎదురు చూడకుండా ఖచ్చితంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలను కూడా అందులో భాగస్వాములను చేసి పర్యావరణ పరిరక్షణతో పాటు అడవుల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం కేవలం మొక్కుబడిగా కాకుండా ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ఉద్యమంగా ఈ వర్షాకాలంలో పెద్ద ఎత్తున నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మున్నా రాజా సిసోడియా, సీనియర్ బీజేపీ నాయకులు కాసెట్టి నాగేశ్వరరావు, తులా మధుసూదన్ రావు, బొలిశెట్టి తిరుపతి, హాజీపూర్ మాజీ మండల ప్రధాన కార్యదర్శి మడిపల్లి సత్యం, కమలాకర్ లగిశెట్టి, దాస్య నాయక్, గందే శ్రీనివాస్, మల్లేష్, శ్రీధర్, ఆలయ పూజారి, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను బోధించాలి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా









**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 16, (ప్రజాజ్యోతి) :** గ్రామీణ ప్రాంతాల ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. నర్సాపూర్ (జి) మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో గల మందుల గది, ఇంజక్షన్ గది, ఓపి విభాగం, ఇన్ పేషంట్, ఔట్ పేషెంట్, విభాగాలు, పలు వార్డులు పరిశీలించారు. ఆసుపత్రికి సంబంధించిన మందులు, ఓపీ, తదితర రిజిస్టర్లను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సమయపాలన పాటిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ, వైద్య సేవలు అందించాలని తెలిపారు. అనంతరం కేజీబీవీ వసతి గృహాన్ని పరిశీలించారు. అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ వసతి గృహంలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని అన్నారు. ప్రతిరోజు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు, దుప్పట్లను పంపిణీ చేశారు. మోతాక్ పల్లి గ్రామం సుద్ద వాగులో ఇసుక రీచ్ ను పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లో ఇసుక అక్రమ రవాణా జరగకూడదన్నారు. నిత్యం ప్రత్యేక నిఘా ఉంచి ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. వాహనాలను జప్తు చేయాలని ఆదేశించారు. కేవలం మన ఇసుక వాహనం యాప్ ద్వారానే ఇసుక అమ్మకాలు జరగాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడే విధంగా ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో డిఈవో భోజన్న, తహసిల్దార్లు శ్రీకాంత్, ఎంపీడీవో పుష్పలత, ఆసుపత్రి వైద్యాధికారి ప్రమోద్ చంద్ర రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ

- సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు, మాదకద్రవ్యాలపై గ్రామస్థులకు అవగాహన
- ప్రతి గ్రామం -- ప్రతి పౌరుడు నేర నివారణలో భాగస్వామి కావాలి
- గంజాయి, గుడుంబా వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి - జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల









**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 16, (ప్రజాజ్యోతి) :** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో నర్సాపూర్ (జి) మండలం కుస్లీ గ్రామంలో నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల పాల్గొన్నారు.ఈ కార్యక్ర మంలో భాగంగా అనుమతులు లేకుండా నడుపుతున్న 43 ద్విచక్ర వాహనాలను,8 ఆటోలను స్వాధీనం చేసుకొని, సంబంధిత నిబంధనల ప్రకారం జరిమా నాలు విధించడమైనది. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడిన ఎస్పీ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, సందేశాలు, సోషల్ మీడియా లింకులు, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద సంఘటనలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా యువత గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గుడుంబా, తెల్లకల్లు వంటి మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాలు కుటుంబాలు, సమాజాన్ని నాశనం చేస్తాయని తెలిపారు.గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, ప్రతి పౌరుడు నేర నివారణలో భాగస్వామి కావాలని జిల్లా ఎస్పీ తెలిపారు. నిర్మల్ జిల్లా ఏర్పడ్డాక మొట్ట మొదటి సారిగా ఒక ఎస్పీ,తమ గ్రామానికి వచ్చినందుకు కుస్లీ వాసులు చాలా ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తో పాటు, నిర్మల్ రూరల్ ఇన్స్పెక్టర్ కృష్ణ, ఎస్ఐలు గణేష్, శ్రీకాంత్, రవీందర్, లింబాద్రి, పోలీసు, సిబ్బంది, సర్పంచ్,ప్రజా ప్రతినిధులు,పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి

- మంత్రి డా. వివేక్ వెంకటస్వామి
- హమాలీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి





**మంచిర్యాల, 16, జూన్(ప్రజాజ్యోతి) :** హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక హమాలీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు దిశగా వెంటనే చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రి డా. వివేక్ వెంకటస్వామి అధికారులను కోరారు. బోర్డు ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, యూనియన్ నాయకులు, నిపుణులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హమాలీ సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, కార్మికుల సంక్షేమం, కనీస వేతనాలు, గుర్తింపు కార్డులు, బీమా, సామాజిక భద్రత వంటి అంశాలను కలిగి ఉన్న సమగ్ర వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. హమాలీ కార్మికులకు ప్రస్తుతం రూ.2 లక్షల ప్రమాద మరణ బీమా సౌకర్యం అందుబాటులో ఉందని మంత్రి తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని చెప్పారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. హమాలీ కార్మికులందరూ తప్పనిసరిగా నమోదు చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందాలని మంత్రి పిలుపునిచ్చారు. హమాలీలకు గుర్తింపు, భద్రత, సామాజిక రక్షణ కల్పించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. కష్టపడి పనిచేస్తూ కుటుంబాలను పోషిస్తున్న హమాలీ కార్మికులకు సొంత ఇంటి కల నెరవేరేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి హమాలీ కార్మికుడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నిరుపేద కార్మిక కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం అందించడంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు .అదేవిధంగా, హమాలీ కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా జీవన్ భీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ పథకం ద్వారా అర్హులైన కార్మికులకు రూ.5 లక్షల వరకు బీమా రక్షణ లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యుడు ప్రొఫెసర్ కోదండరాం, హమాలీ వర్కర్స్ ప్రతినిధి వెంకట్ రెడ్డి, కనగంటి రవన్న, శ్రీనివాస్ రెడ్డి, కలీం తదితరులు పాల్గొన్నారు.

## శెట్పల్లిలో ఉచిత వైద్య శిబిరం





**జైపూర్, జూన్ 16 ప్రజా జ్యోతి :** జైపూర్ మండలంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఆధ్వర్యంలో శెట్పల్లి గ్రామ పంచాయతీ భవనంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్లాంట్ ప్రభావిత గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని, వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎస్టీపీపీ ఈడీ సీహెచ్ చిరంజీవి తెలిపారు. గ్రామ ప్రజలు ఇటువంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. శిబిరంలో వైద్యులు గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వృద్ధులు, మహిళలు కలిపి 20 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డా.లోక్‌నాథ్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో భాగంగా ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

## సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు రూ.30 లక్షల ప్రమాద బీమా కల్పించిన ప్రభుత్వానికి పాలాభిషేకం



**మంచిర్యాల, 16, జూన్(ప్రజాజ్యోతి) :** సింగరేణి విశ్రాంత ఉద్యోగులు, కోల్ మైన్స్ పెన్షనర్లకు రూ.30 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డా. వివేక్ వెంకటస్వామి, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, డైరెక్టర్ (పా) చిత్రపటాలకు సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు మంగళవారం పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నిరంతర పోరాట ఫలితంగానే 130 సంవత్సరాల సింగరేణి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అతి తక్కువ కోల్ మైన్స్ పెన్షన్ పొందుతున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు ఈ బీమా సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. 70 సంవత్సరాల లోపు ఉన్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు రూ.30 లక్షల ప్రమాద బీమాతో పాటు సహజ మరణానికి కూడా రూ.10 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబాలకు ఇది ఎంతో భరోసా, ఆర్థిక ఆసరాగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కృతజ్ఞతగా పాలాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా విశ్రాంత ఉద్యోగులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించడంలో సహకరిస్తున్న ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ మరియు ఇతర బ్యాంకుల యాజమాన్యాలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి పుదారి నర్సయ్య, ఉపాధ్యక్షులు ఏ.గంగయ్య, పుప్పిరెడ్డి రాంరెడ్డి, మేడ రాజలింగు, బూర్ల జ్ఞాని, ఆర్గనైజింగ్ కార్యదర్శి కాటం లక్ష్మణ్, అవదూత శంకరయ్య, సలహాదారులు సత్యనారాయణరావు, అంజన్న, దేవులపల్లి రామస్వామి, గజెల్లి సుదర్శన్, నాయకులు ఎండీ హుస్సేన్, ఎంఎస్ అలీ బేగ్, గురువయ్య, సంగెం రాంచందర్, కొత్తపల్లి రాంబ్రహ్మం, పి.రాజు, మామిడిపల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాయిబాట కార్యక్రమంలో కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు









- అన్నలు లేరని అనుకుంటున్నారేమో.. వాళ్లంతా మా పార్టీలోనే ఉన్నారు
- సింగరేణి కార్మికులతో మాట్లాడుతామంటే అడ్డుకుంటున్నారు
- కార్మికులతో మాట్లాడటాన్ని అడ్డుకుంటే కోర్టుకు పోతాం
- సింగరేణి కార్మికుల హక్కుల కోసం టీఆర్ఎస్ హెచ్ఎంఎస్ నిరంతరం పోరాటం చేస్తాయి
- బీజేపీ తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్ చట్టాలు కార్మికుల హక్కులను కాలరాసేవే
- సింగరేణిలో మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగితే ఊరుకోం
- సింగరేణి ఎన్నికల్లో టీఆర్ఎస్ అనుబంధ సంస్థ హెచ్ఎంఎస్‌ను గెలిపించండి

**మంచిర్యాల , 16, జూన్(ప్రజాజ్యోతి) :** సింగరేణి కార్మికుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని, కార్మికుల కనీస అవసరాలు కూడా తీర్చకుండా యాజమాన్యం మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో "బాయిబాట" కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆర్‌కే-7 మైన్, వర్క్‌షాప్ తదితర ప్రాంతాలను సందర్శించి కార్మికులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు . ఈ సందర్భంగా టిఆర్ఎస్ చీఫ్ కవిత సంచలన వాఖ్యలు చేశారు . రాష్ట్రంలో తాము కొత్త రాజకీయ శక్తిగా ఆవిర్భవించామని, కార్మికుల సమస్యలు తెలుసుకునేందుకే "బాయిబాట" కార్యక్రమం ద్వారా మీ ముందుకు వచ్చామని చెప్పారు. సింగరేణితో తనకు 20 ఏళ్ల అనుబంధం ఉందని, కార్మికుల కోసం ఎప్పటికీ పనిచేస్తూనే ఉంటానని తెలిపారు. సింగరేణి బాగుంటేనే అందరూ బాగుంటారని, అండర్ గ్రౌండ్ మైనింగ్ ఉంటేనే ఉద్యోగ భద్రత, ఉపాధి అవకాశాలు ఉంటాయని అన్నారు. ప్రస్తుతం అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను తగ్గించి ఓపెన్ కాస్ట్ మైనింగ్‌ను పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. అదే విధంగా సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్ర జరుగుతోందని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రైవేట్ సంస్థలను రాకుండా అడ్డుకున్నామని, కానీ ఇప్పుడు రెండు బ్లాకులను ఎండీవో ద్వారా ప్రైవేట్ సంస్థలకు అప్పగించారని తెలిపారు. ఈ విధానాన్ని మరింత విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, సింగరేణిని ప్రైవేటీకరణ కాకుండా ఢిల్లీతో పాటు రాష్ట్ర ప్రభుత్వంతో కూడా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఆర్‌కే-7 గని ప్రాంతానికి వెళ్తున్న సమయంలో మహిళా ఉద్యోగులు కనిపించా రని, ఆనాడు మహిళలకు అవకాశాలు కల్పించాలని పార్లమెంట్‌లో పోరాటం చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం మహిళా ఉద్యోగులకు తగిన సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. కార్మికులకు చిన్న సమస్య వచ్చినా నిధులు లేవని చెబుతున్నారని, కానీ కాంట్రాక్టర్లకు మాత్రం నిధులు విడుదల చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులే యంత్రాలను మరమ్మతులు చేసుకుంటూ వాడుకోవాల్సిన పరిస్థితి తీసుకొచ్చారని విమర్శించారు. కార్మికులకు సరైన భద్రత లేదని, కనీసం మంచి తాగునీరు కూడా అందించడం లేదన్నారు. ఇతర ప్రాంతాల్లో అత్యాధునిక టెక్నాలజీ వినియోగిస్తుండగా సింగరేణిలో మాత్రం పాత టెక్నాలజీనే ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. మైన్‌లోకి వెళ్లే కార్మికులకు సరైన గాలి కూడా అందించడం లేదని ఆరోపించారు. "గాలి, నీళ్లు ఇవ్వాల్సిన బాధ్యత సింగరేణిదే. మంచి నీళ్లు కూడా ఇవ్వకపోవడం మానవ హక్కుల ఉల్లంఘనే" అని కవిత అన్నారు. బీజేపీ ప్రభుత్వం 27 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని, అవి కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని విమర్శించారు. పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు వాటిని అమలు చేయొద్దని అసెంబ్లీలో తీర్మానాలు చేశాయని, తెలంగాణలో కూడా అలాంటి తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మిక హక్కులు దెబ్బతింటాయని, యూనియన్లు బలహీనపడతాయని, సమస్యలు వచ్చినప్పుడు కార్మికులు ఎవరిని ఆశ్రయించాలో తెలియని పరిస్థితి వస్తుందని అన్నారు. ప్రజలకు కార్పొరేట్ స్థాయి ఉచిత విద్య, వైద్యం అందించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు అన్ని రంగాల్లో సమాన హక్కులు కల్పించాలని కోరారు. గతంలో "అన్నలు" ఉండటం వల్ల అధికారులు కార్మికుల విషయంలో కొంత పద్ధతిగా వ్యవహరించేవారని, ఇప్పుడు వాళ్లు లేరని భావించి కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. "అన్నలు లేరని అనుకుంటున్నారేమో.. వాళ్లంతా ఇప్పుడు మా పార్టీలోనే ఉన్నారు. కార్మికులపై మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగితే ఊరుకునేది లేదు. కార్మికులను వేధించే అధికారులపై కేసులు పెడతాం" అని హెచ్చరించారు. సింగరేణిలో కార్మికులతో మాట్లాడే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, తాము కార్మికులను కలవడానికి వెళ్తే అడ్డుకుంటున్నారని ఆరోపించారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి, ఇతర నాయకులు సమావేశాలు నిర్వహించలేదా? మమ్మల్ని ఆపితే ఊరుకునేది లేదు. కోర్టుకు వెళ్లి కేసులు వేస్తాం" అని హెచ్చరించారు. డిపెండెంట్ ఉద్యోగాలు, మెడికల్ బోర్డు, క్వార్టర్ల కేటాయింపు, అలియాస్ పేర్ల అంశాల్లో కూడా కార్మికులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు.

సింగరేణి ఎన్నికల్లో హెచ్‌ఎంఎస్‌కు మద్దతు ఇచ్చి గెలిపించాలని కార్మికులను కోరారు. హెచ్ఎంఎస్ అధ్యక్షులు రియాజ్ అహ్మద్ కార్మికుల కోసం నిరంతరం పోరాటం చేసే నాయకుడని కొనియాడారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా పలు ప్రాంతాల్లో టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ అధ్యక్షులు రియాజ్ అహ్మద్, మాజీ మంత్రి బొడ జనార్ధన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బడిబాటలో భాగంగా ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

మహబూబ్‌నగర్, జూన్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ) బడిబాట కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి కొత్తగా ఒకటవ తరగతిలో చేరిన విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించి వారికి విద్యాభ్యాసానికి



శుభారంభం కల్పించారు. జిల్లా విద్యాశాఖ అధికారి, పీఎస్ వెంకటేశ్వర కాలనీ, పీఎస్ బోయపల్లి పాఠశాలలను సందర్శించి, కొత్తగా నమోదైన విద్యార్థుల చేత సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని విద్యా ప్రయాణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎంవో సుధాకర్ రెడ్డి, మహబూబ్‌నగర్ అర్బన్ ఎంఈఓ లక్ష్మణ్ సింగ్, పీఎస్ బోయపల్లి ప్రధానోపాధ్యాయులు హరినాథ్, పీఎస్ వెంకటేశ్వర కాలనీ ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, ప్రతి బాలబాలికను పాఠశాలలో చేర్పించి విద్యాభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు.

## వంద శాతం వరి ధాన్యం కొనుగోలుతో రాష్ట్రానికి ఆదర్శంగా గద్వాల:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

గద్వాల జూన్ 16(ప్రజా జ్యోతి ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించి,వంద శాతం కొనుగోలు పూర్తి చేయడం ద్వారా రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో నిలిచిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ,అదనపు కలెక్టర్లు,సంబంధిత శాఖల అధికారులు కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని పేర్కొన్నారు.జిల్లాలో మొత్తం 76 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రబీ సీజన్‌లో దొడ్డు రకం వరి 731 హెక్టార్లలో సాగు చేయగా 5,487 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చినట్లు అంచనా



వేశామన్నారు.అలాగే సన్న రకం వరి 30,576 హెక్టార్లలో సాగు చేయగా 2,29,323 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదైనట్లు వెల్లడించారు.కొనుగోలు కేంద్రాలకు మొత్తం 50,725 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని,దీని విలువ రూ.121.18 కోట్లు ఉంటుందని తెలిపారు.రైతులకు సంబంధించిన చెల్లింపులను ఇప్పటికే పూర్తి చేసినట్లు చెప్పారు.ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లు,తేమ కొలిచే మీటర్లు,ఎలక్ట్రానిక్ తూకాలు,ప్యాడీ క్లీనర్లు తదితర సౌకర్యాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.తరుగు,తాలు పేరిట రైతులకు నష్టం కలగకుండా మిల్లర్లు,వ్యాపారులపై అవసరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు.అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం ప్రత్యేక నిర్ణయంతో కొనుగోలు చేసిందని,రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.కొనుగోలు ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి,నిరంతరం సమన్వయం చేశామని తెలిపారు.వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను శాతం శాతం పూర్తి చేయడంలో కృషి చేసిన అధికార యంత్రాంగానికి, సహకరించిన రైతులకు మరియు సంబంధిత ప్రతి ఒక్కరికీ జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## మాంటేశ్వరి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలనీ జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం

అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) జూన్ 16: మాంటేశ్వరి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాజు కోరారు మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో



అల్లంపూరు మాంటేశ్వరి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాఠశాల నిర్వహించుకోవడానికి అనుమతి తీసుకుని అనధికారికంగా వసతి గృహం నడుపుతూ లక్షల రూపాయల ఫీజులు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అక్రమంగా వసూలు చేస్తున్నారని విమర్శించారు.పాఠశాలలో స్టేషనరీ పేరుతో దందా చేస్తున్నారని అన్నారు వసతి గృహంలో గతంలో ఇద్దరు కార్మికులు చనిపోయారని గుర్తు చేశారు ఆంధ్రకు చెందిన యాజమాన్యం తెలంగాణలో పాఠశాల పెట్టి స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా ఆంధ్రకు చెందిన వారికే అవకాశాలు కల్పిస్తున్నారని విమర్శించారు అడ్డగోలుగా పెంచిన ఫీజులను తక్షణమే తగ్గించాలని స్థానిక విద్యార్థులుచదువుకోవడానికి పాఠశాలలో సీట్లు కేటాయించాలని కార్మికులకు పని గంటలు తగ్గించి పీఎఫ్ ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు వినతిపత్రం ఇచ్చిన వారిలో యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వామనపల్లి రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి టీచరా... మజాకా..!

నాగర్ కర్నూల్ జూన్ 16 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణ కేంద్రానికి చెందిన 9వ సెంటర్ అంగన్వాడి టీచర్ డోకూరు కవిత యోగ దినోత్సవం పురస్కరించుకొని.. మంగళవారం అచ్చంపేట పట్టణ కేంద్రంలోని ఓ స్విమ్మింగ్ పూల్ లో



నీటి లోపల యోగాసనాలు వేసి, అంగన్వాడీ టీచర్ మజాకా అన్న చందసంగ...యోగా డేను నిర్వహించుకున్న ఘటన అచ్చంపేటలో చోటుచేసుకుంది. ఇదిలా ఉండగా నీటి పై యోగాసనాలు వేస్తూ... నీటిపై గంటల తరబడి యోగాసనాలు వేస్తూ, పట్టణ ప్రజల మన్ననాలు పొందుతున్నది. అదే విధంగా ప్రతి సంవత్సరం యోగ డే దినాన్ని పురస్కరించుకొని ఆసనాలు వేస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలిచింది. దీంతో నల్లమల్ల లోని కవులు మేధావులు సీనియర్ సిటిజన్స్ డోకూరు కవితకు అభినందనలు తెలిపారు

## విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి

- గణితం, సైన్స్, ఇంగ్లీష్‌లో ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకూడదు
- పాఠశాలలను సందర్శించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, జూన్ 16 (ప్రజాజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో గణితం, సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, హరిజనవాడ ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించి విద్యా కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో జరుగుతున్న నూతన విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియను సమీక్షించిన కలెక్టర్, విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన కొత్త పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను తనిఖీ చేశారు. అనంతరం కొందరు విద్యార్థులకు స్వయంగా పాఠ్యపుస్తకాలను అందజేశారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం 702 మంది విద్యార్థులు ఉన్నారని, పాఠశాల పునఃప్రారంభం అనంతరం ఇప్పటివరకు 65 మంది కొత్తగా చేరారని ప్రధానోపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య వెయ్యి దాటే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గణితం, సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో విద్యార్థుల ఫలితాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో ఈ సబ్జెక్టుల్లో ఒక్క విద్యార్థి



కూడా ఫెయిల్ కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలల్లో చేరే విద్యార్థులకు ప్రవేశ సమయంలోనే అపార్ ఐడీలు రూపొందించాలని, యూ–డైస్ పోర్టల్‌లో విద్యార్థుల వివరాలను సకాలంలో నమోదు చేసి నవీకరించాలని సూచించారు. అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడలు లేదా ఇతర మౌలిక వసతులు అవసరమైతే జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా ప్రతిపాదనలు పంపించాలని, వాటికి అవసరమైన పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే విద్యార్థుల డ్రాప్‌బాక్స్‌లో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ఎలాంటి పెండింగ్‌లు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డీఈవో యాదయ్య, ప్రిన్సిపల్స్ ఉమాదేవి, చంద్రశేఖర్, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో అభివృద్ధి పనులు నాణ్యతతో, గడువులోపు పూర్తి చేయాలి

- నర్సరీల నిర్వహణ మెరుగుపర్చాలి: అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశం

వనపర్తి, జూన్ 16 (ప్రజాజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను



నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వనపర్తి మండలంలోని నాగమ్మ తండా గ్రామపంచాయతీని ఆమె సందర్శించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ భవనం, వీవో భవనాల పనులను తనిఖీ చేసి, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా పనులను వేగవంతం చేయాలని ఏఈ (పీఆర్)కు సూచించారు. పనుల నిర్వహణలో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అనంతరం గ్రామ నర్సరీని పరిశీలించిన అదనపు కలెక్టర్, నర్సరీ నిర్వహణను మరింత మెరుగుపరచాలని సూచించారు. మొక్కల సంరక్షణ, పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత ఫీల్డ్ ఆఫీసర్, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో నర్సరీల పాత్ర కీలకమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ), ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి, ఏఈ (పీఆర్) తదితర అధికారులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు కూడా హాజరయ్యారు.

## అత్యంత అరుదైన హై-రిస్క్ బీటింగ్ హార్ట్ బైపాస్ శస్త్రచికిత్స విజయవంతం

- మహబూబ్‌నగర్‌కు చెందిన 53 ఏళ్ల రోగికి యశోదా ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితి నుంచి ఉపశమనం

మహబూబ్‌నగర్, జూన్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ) మహబూబ్‌నగర్ జిల్లా ముండారి తండాకు చెందిన 53 ఏళ్ల ముడావత్ రాజు నాయక్‌కు హైదరాబాద్ మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యంత క్లిష్టమైన హై-రిస్క్ బీటింగ్ హార్ట్ బైపాస్ శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనుల్లో తీవ్రమైన అడ్డంకులు ఏర్పడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి ఈ శస్త్రచికిత్స ద్వారా కొత్త జీవితం లభించినట్లు వైద్యులు తెలిపారు. వైద్యుల వివరాల ప్రకారం, రోగి తీవ్రమైన ఛాతినొప్పి, చెమటలు పట్టడం, తల తిరగడం వంటి లక్షణాలతో ఆసుపత్రికి చేరుకున్నాడు. పరీక్షల్లో కరోనరీ ఆర్టరీ డిసీజ్, అక్యూట్ కొరోనరీ సిండ్రోమ్, యాంటీరియర్ వాల్ మయోకార్డియల్ ఇన్‌ఫార్షన్, తీవ్రమైన వెంట్రిక్యులర్ సిస్టోలిక్ డిస్‌ఫంక్షన్, ట్రిపుల్ వెసెల్ డిసీజ్‌తో పాటు మధుమేహం, రక్తపోటు సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. రోగి పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉండటంతో యశోదా ఆసుపత్రి కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్ అండ్ వాస్కులర్ సర్జన్ డా. వెంగల్ రెడ్డి నాయకత్వంలో ఆఫ్–పంప్ కరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్టింగ్ శస్త్రచికిత్స నిర్వహించారు. గుండెను ఆపకుండా బీటింగ్ హార్ట్‌పైనే నాలుగు కరోనరీ బైపాస్ గ్రాఫ్ట్‌లను అమర్చడం ఈ శస్త్రచికిత్స ప్రత్యేకతగా వైద్యులు పేర్కొన్నారు. అలాగే దెబ్బతిన్న కరోనరీ ధమనిలో ఎండార్టెరెక్టమీ నిర్వహించి, అత్యంత ప్రమాదకరమైన గుండె పరిస్థితిని సమర్థవంతంగా అధిగమించినట్లు తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం రోగికి ఐసీయూలో ప్రత్యేక పర్యవేక్షణ, వెంటిలేటర్ సపోర్ట్, ఆక్సిజన్, యాంటీబయాటిక్స్, గుండె మందులు, ఛాతి ఫిజియోథెరపీ తదితర చికిత్సలు అందించడంతో ఆరోగ్యం మెరుగుపడిందని వెల్లడించారు. ఈ సందర్భంగా వైద్య బృందం మాట్లాడుతూ, గుండె సంబంధిత లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదిస్తే ప్రాణాపాయ పరిస్థితులను నివారించ




వచ్చన్నారు. ఆధునిక సాంకేతికత, నిపుణులైన వైద్యుల సహకారంతో క్లిష్టమైన గుండె శస్త్రచికిత్సలు కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

## పోలీసుల పక్షపాత వైఖరికి నిరసనగా రెండో రోజు విధుల బహిష్కరణ

20న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను బహిష్కరిస్తామని ఉమ్మడి జిల్లా న్యాయవాదుల హెచ్చరిక

మహబూబ్‌నగర్, జూన్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ) మహబూబ్‌నగర్ బార్ అసోసియేషన్ సభ్యుడు వి. నరేందర్ నాయక్‌పై నమోదైన అక్రమ కౌంటర్ ఎఫ్‌ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించు




కోవాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి జిల్లా మహబూబ్‌నగర్ న్యాయవాదులు వరుసగా రెండో రోజు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. ఆనంద్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం నిర్వహించిన న్యాయవాదుల సర్వసభ్య సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ అసోసియేషన్ సభ్యుడు వి. నరేందర్ నాయక్‌పై రూరల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అక్రమంగా కౌంటర్ కేసు నమోదు చేయడం తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. ఇది ముమ్మాటికీ "న్యాయవాదులపై పోలీసుల దాడి"గా పేర్కొన్నారు. ఈ చర్యను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు రెండో రోజు కూడా విధులను బహిష్కరించారని తెలిపారు. నరేందర్ నాయక్ తన మిత్రుడి తరపున వెళ్లిన సమయంలో బద్రు నాయక్ భౌతిక దాడికి పాల్పడ్డాడని, తాను న్యాయవాదినని చెప్పినా దాడి ఆపలేదని పేర్కొన్నారు. ఘటన అనంతరం 100 డయల్ కు ఫోన్ చేసినా పోలీసుల నుంచి స్పందన రాలేదని, అదే రోజు రాత్రి బద్రు నాయక్‌పై ఎఫ్‌ఐఆర్ నం.325/2026 నమోదు అయినట్లు తెలిపారు. అయితే రెండు రోజుల తరువాత రాజీకి అంగీకరించడం లేదనే కారణంతో బద్రు నాయక్ భార్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్‌ఐఆర్ నం.330/2026 కింద నరేందర్ నాయక్‌పై కౌంటర్ కేసు నమోదు చేశారని ఆరోపించారు. బాధితుడైన న్యాయవాదిని భయభ్రాంతులకు గురిచేయడానికే పోలీసులు ఈ చర్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు నరేందర్ నాయక్‌పై నమోదైన కౌంటర్ కేసును వెంటనే రద్దు చేయాలని, ఈ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అలాగే తప్పుడు కేసు నమోదు చేసిన సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌పై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన కొనసాగుతుందని, ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కూడా బహిష్కరిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా న్యాయవాదులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. ఆనంద్‌రావు, వైస్ చైర్మన్ వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి డబ్బుల నర్సింహారెడ్డి, సీనియర్ న్యాయవాదులు చంద్రమౌళి, బెక్కం జనార్దన్, అనంతరెడ్డి, అనిల్‌కుమార్, గడ్డం గోపాల్, నాగేందర్, మనోహర్, నరేందర్ గౌడ్, టి. కృష్ణ, రాజీవ్‌కుమార్, సత్యశీల్, రవికుమార్, శ్రీశైలం తదితరులతో పాటు మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) జూన్ 16: ఈనెల 20 నుండి 22 వరకు జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు బి నరసింహ జిల్లా కార్యదర్శి జి.రాజు కోరారు మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా అల్లంపూరు పట్టణ కేంద్రంలో జెండా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాలుగోవ మహాసభలు మహబూబ్నగర్ పట్టణంలోజరుగుతున్నాయని తెలిపారు మొదటి రోజు వేలాది మందితో భారీ బహిరంగ సభ జరుగుతుందని దీనికి ముఖ్య అతిథిగా త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ వస్తున్నారని తెలిపారు. రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ 17 18 తేదీలలో బైక్ జాత నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయన్న, వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు చిన్న సుంకన్న,తిక్కన్న, పుల్లన్న,స్వాములు, గరీబ్ భాషా తదితరులు పాల్గొన్నారు.



## ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం వేయాలి:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు అందించాలి
- నిర్లక్ష్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు
- ఎస్ఐఆర్,కస్తూర్బా పాఠశాలల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

రాజోలి జూన్ 16(ప్రజా జ్యోతి): ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని,వినియోగదారులకు నిబంధనల ప్రకారం ఇసుక సరఫరా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాజోలి మండల కేంద్రంలో పర్యటించిన కలెక్టర్ సమీపంలోని తుమ్మిళ్ల ఇసుక ర్యాంపును ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఇసుక ర్యాంపులో జరుగుతున్న కార్యకలాపాలపై అధికారులను అడిగి తెలుసుకుని,సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు.మైనింగ్,పోలీసు,రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అక్రమ రవాణాను అరికట్టాలని ఆదేశించారు. ర్యాంపు రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.అంతకుముందు రాజోలిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్,సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను



పరిశీలించారు.రంజిత్ కుమార్,కిష్టమ్మ అనే ఇద్దరు ఉద్యోగులు చాలా రోజులుగా హాజరు నమోదు చేయకపోవడాన్ని తీవ్రంగా పరిగణించి వారికి



షోకాజ్ నోటీసులు జారీ చేయాలని వైద్య,ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.ఆసుపత్రిలో రోగుల సంఖ్య తక్కువగా ఉండడంపై ఆందోళన వ్యక్తం చేసిన కలెక్టర్,ప్రభుత్వం అందిస్తున్న వైద్య సదుపాయాలను ప్రజలు వినియోగించుకునేలా సిబ్బంది పనితీరును మెరుగుపరచుకోవాలని సూచించారు.వివిధ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.నెల రోజుల్లో పనితీరులో మార్పు లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్,ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు.బీఎల్ఓలకు తగిన శిక్షణ ఇచ్చి ఈ నెల 26 నుంచి ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయాలని సూచించారు.భూభారతి,సాదాబైనామా తదితర దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు.మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులు, అధికారులతో మాట్లాడారు.రాజోలి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్,విద్యార్థుల హాజరుపై ఆరా తీశారు.పాఠశాలలు ప్రారంభమై రెండు రోజులు గడిచినా విద్యార్థులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు.తల్లిదండ్రులతో సంప్రదించి విద్యార్థులను పాఠశాలకు రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.విద్యార్థుల కోసం వంట ఏర్పాట్లు చేయకపోవడాన్ని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యాలయంలో డ్రైనేజీ సమస్య పరిష్కారంతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణం,ప్రహరీ గోడ నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గంగిరెడ్డి, ఉపసర్పంచ్ సంధ్యారెడ్డి పలు స్థానిక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా,వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ పర్యటనలో తహసీల్దార్ రామ్మోహన్, ఎంపీడీవో సయ్యద్ ఖాన్,మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ చంద్రమౌళి,ఎస్సై గోకారి తదితరులు పాల్గొన్నారు.

## బడిబాట కార్యక్రమంలో విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించిన సర్పంచ్ శిరీష

మల్దకల్ జూన్ 16(ప్రజా జ్యోతి): గద్వాల నియోజకవర్గంలోని మల్దకల్ మండల పరిధి పెద్దపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులతో గ్రామ సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి అక్షరాభ్యాసం చేయించి,వారి పేర్లను పాఠశాల రిజిస్టర్‌లో నమోదు చేశారు. కార్యక్రమానికి ముందు సరస్వతి పూజ నిర్వహించారు.అనంతరం కొత్తగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ శిరీష మాట్లాడుతూ,ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉచితంగా



అందించేందుకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం,పాఠశాల యూనిఫాంలు తదితర సౌకర్యాలు కల్పిస్తోందన్నారు.గ్రామంలోని ప్రతి చిన్నారి ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు శిరీష,జయలక్ష్మి , అంగన్‌వాడీ టీచర్లు ప్రశాంతి,పాఠశాల చైర్మన్ సువర్ణతో పాటు గ్రామ ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అంగన్ వాడీ కేంద్రాలకు ప్రీ-ప్రైమరీ అనుసంధానం చేయాలి

చిన్నంబావి, జూన్ 15 (ప్రజాజ్యోతి) ప్రీ–ప్రైమరీ పాఠశాలలను అంగన్ వాడీ కేంద్రాలకు అనుసంధానం చేయాలని డిమాండ్ చేస్తూ చిన్నంబావి మండలం వెలగొండ గ్రామంలో అంగన్ వాడీ టీచర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం గ్రామంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు.



అంగన్వాడీ కేంద్రాల ద్వారానే ప్రీ–ప్రైమరీ విద్యను అమలు చేస్తే చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించవచ్చని వారు పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మండల అధ్యక్షురాలు బి. గోవిందమ్మ, కోశాధికారి సుజాత, సభ్యురాళ్లు కాజా భాను, సుధారాణి, అనురాధ, కే. గోవిందమ్మతో పాటు పలువురు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## రాజీతోనే వేగంగా పరిష్కారం

మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి – సీపీ సన్‌ప్రీత్ సింగ్



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, జూన్ 16, (ప్రజా జ్యోతి):** ఈ నెల 20న నిర్వహించనున్న రెండో జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. లోక్ అదాలత్ ప్రచారానికి సంబంధించి రూపొందించిన వాల్ పోస్టర్లను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ క్రిమినల్ కంపౌండబుల్, సివిల్, ఆస్తి విభజన, కుటుంబ, వైవాహిక, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ తదితర రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. చిన్న చిన్న వివాదాలతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోవద్దని సూచించారు. పోలీసు అధికారులు రాజీకి అనువైన కేసులను గుర్తించి ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారని, ఆసక్తి ఉన్నవారు సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాలని తెలిపారు.కార్యక్రమంలో వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, అదనపు డీసీపీ ప్రభాకరరావు, ఏసీపీ సత్యనారాయణ, పరకాల ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, ఎస్ఐ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రఘునాథపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ మండల సర్పంచుల ఫోరం కమిటీ ఎన్నిక



**రఘునాథపల్లి, జూన్ 16 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ శాసనసభ్యులు డాక్టర్ తాటికొండ రాజయ్య ఆదేశాల మేరకు, బీఆర్ఎస్ మండల పార్టీ మరియు జనగామ వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్ సమక్షంలో ఈరోజు రఘునాథపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ మండల సర్పంచుల ఫోరం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు గైని శ్రీనివాస్, మండల సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులుకొర్ర స్వరూప రాజేందర్ నాయక్,పయ్యావుల రవి,ప్రధాన కార్యదర్శి బొల్లం ఉమారాణి రాజీవ్, కార్యదర్శి తూడి వెంకటేష్, కోశాధికారి ఇల్లందుల రవి, కమిటీ సభ్యులు – భూక్య శ్రీను,శాగా కవిత అశోక్,ఆరూరి సరిత మల్లేష్,ఎడమ కోమలత కనకరాజు,గౌడిశాల లలిత సోమయ్య,తోటకూర సదానందం ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు పార్టీ అధిష్ఠానం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం మరియు పార్టీ కార్యక్రమాలను గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ శాసనసభ్యులు డాక్టర్ తాటికొండ రాజయ్య కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

## ఎండలు తగ్గే వరకు విత్తనాలకు పెట్టొద్దు

– రైతులకు గందె వెంకన్న సూచన



**పరకాల, జూన్ 16, (ప్రజా జ్యోతి):** ప్రాంతంలో కొనసాగుతున్న తీవ్ర ఎండలు, అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో రైతులు ముందస్తుగా విత్తనాలు వేయ వద్దని పరకాల మండల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు సూచించారు. ప్రస్తుతం 38–39 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున నేలలో తగిన తేమ లేక విత్తనాల మొలక శాతం తగ్గే ప్రమాదం ఉందన్నారు.పత్తి, సోయాబీన్, పెసర, కంది వంటి పంటల విత్తనాలు అధిక వేడి కారణంగా దెబ్బతిని రైతులకు నష్టం కలిగే అవకాశం ఉందని తెలిపారు. మొలకలు రాకపోతే మళ్లీ విత్తనాలు కొనుగోలు చేయడం, భూమి దున్నడం వంటి అదనపు ఖర్చులు భరించాల్సి వస్తుందని పేర్కొన్నారు. కనీసం 25–30 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసి, నేలలో నాలుగు నుంచి ఐదు అంగుళాల లోతు వరకు తేమ ఏర్పడిన తర్వాతే విత్తనాలు విత్తడం మంచిదని సూచించారు. రైతులు మరో రెండు మూడు రోజులు ఓపిక పట్టి వాతావరణ పరిస్థితులను గమనించాలని, అవసరమైన విత్తన నిల్వలు డీలర్ల వద్ద సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

## మండలతోగు గుత్తికోయ గూడెంలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేసిన జిల్లా ఎస్పీ

– గుత్తికోయ గుంపులలో కనీస మౌళిక సదుపాయల కల్పనకు తనవంతుగా సహకరిస్తారని హామీ







**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజా జ్యోతి) :** ములుగు జిల్లా గోవిందరావు పేట మండలంలోని మండల తోగు గుత్తికోయగూడెంను మంగళవారం అధికారులతో కలిసి ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకాన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ గుత్తికోయ పెద్దల నుండి వారి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభం అవుతున్నందున పస్రసర్కిల్ పరిధిలోని గుత్తికోయ విద్యార్థులకు పస్ర సిఐ ఆధ్వర్యంలో స్కూలు బ్యాగ్ లు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దానితోపాటు గుత్తికోయ గుంపులు అడవులలో ఉన్నందున అటవీశాఖ పరిధిలో ఉన్నందున వాటికి పూర్తిస్థాయిలో రోడ్డు వేయలేమని, రాకపోకలకు వీలుగా ఉండేలా మట్టి రోడ్డు వేయిస్తామని హామీఇచ్చారు. అలాగే వీలైనన్ని సోలార్ లైట్‌లు కూడా పెట్టిస్తామని హామీ ఇచ్చారు.

గుత్తికోయ ప్రజలు ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం నుండి వచ్చి నందున వారికి కులం సర్టిఫికెట్ లు జారీ చేసే అంశం తమపరిధిలో లేదని, అయినప్పటికీ ప్రభుత్వం దృష్టికి,మంత్రి సీతక్క దృష్టికి తీసుకొని వెళ్తానని హామీ ఇచ్చారు.రేపు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నందున గుత్తికోయ యువత అట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇవే కాక వారికి ఎప్పుడూ ఎలాంటి సాయం కావలసి వచ్చినా స్థానిక ఎస్సై,సిఐ లను సంప్రదించాలని అన్నారు.అనంతరం విద్యార్థులకు స్కూలు బ్యాగ్ లు పంపిణీ చేసి, అనంతరం యువతకు వాలీబాల్ కిట్ పంపిణీ చేశారు.తదనంతరం మండలతోగు పాఠశాల ఆవరణలో ఎస్పీ,డీఎస్పీ మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ములుగు డీఎస్పీ రవీందర్,పస్ర సిఐ దయాకర్,తాడ్వాయి ఎస్సై జగదీష్,పస్ర ఎస్సై తాజుద్దీన్,నార్లపూర్ ఎస్సై కమలాకర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

– పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి – విద్యార్థుల యోగక్షేమాలు అడిగిన కలెక్టర్





**హనుమకొండ జిల్లా ప్రతినిధి, జూన్ 16, (ప్రజాజ్యోతి) :**
హనుమకొండ లోని ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మంగళవారం సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మమేకమయ్యారు. పాఠశాలలో విద్యా బోధన, హాజరు, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నిషన్) విధానంలో హాజరు నమోదు చేస్తున్నారా అని ఉపాధ్యా యులను ప్రశ్నించారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై ఆరా తీశారు.పూర్వ ప్రాథమిక తరగతిని సందర్శించిన కలెక్టర్, చిన్నారులు ఏమి నేర్చుకుంటున్నారో తెలుసుకున్నారు. రాగి జావా తీసుకుంటున్న విద్యార్థులతో మాట్లాడి, భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కున్నారా అని అడిగారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, వేసవి సెలవులను ఎలా గడిపారు, ఏవైనా క్రీడలను అభ్యసించారా అని ప్రశ్నించారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమైన తర్వాత ఎలా అనిపిస్తోందని విద్యార్థులను అడిగి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

పాఠశాలలో విద్యా బోధనకు ఉపయోగించే పాఠ్య సామగ్రిని జాగ్రత్తగా సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు. ఖాన్ అకాడమీ పాఠాలను క్రమం తప్పకుండా వినాలని, వాటిని విద్యాభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు, ఉపాధ్యాయులతో మాట్లాడిన కలెక్టర్, పాఠశాలలో నిర్మాణంలో ఉన్న డైనింగ్ హాల్ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట తొలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

– రూ.1.97 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం – ప్రతి వార్డు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

– తాగునీరు, పారిశుద్ధ్యం, ఇందిరమ్మ ఇళ్లు, మార్కెట్ అభివృద్ధిపై కీలక నిర్ణయాలు







**వర్ధన్నపేట, జూన్ 16, ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట పట్టణ సమగ్రాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల విస్తరణ లక్ష్యంగా మంగళవారం వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయంలో తొలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో మున్సిపాలిటీ, ఇంజినీరింగ్, శానిటేషన్ తదితర విభాగాలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.1 కోటి 97 లక్షల 77 వేల నిధులకు ఆమోదం తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డుకు సంబంధించిన సమస్యలు, అభివృద్ధి అవసరాలను కౌన్సిలర్లు వివరించగా ఎమ్మెల్యే స్వయంగా నోట్ చేసుకుని సంబంధిత అధికారులకు తక్షణ చర్యల కోసం సూచనలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వార్డు కౌన్సిలర్లతో సమన్వయం పెంచి సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని శాఖల అధికారులు కౌన్సిల్ సమావేశాలకు తప్పనిసరిగా హాజరై చర్చకు వచ్చిన అంశాలపై వెంటనే కార్యాచరణ చేపట్టాలని సూచించారు.ఇటీవల అకాల వర్షాల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.15 వేల ఆర్థిక సాయం, రేషన్ సరఫరా అందజేతపై కూడా సమావేశంలో సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయం చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అమృత్ పథకం కింద చేపట్టిన పైపులైన్ పనులను సమీక్షించిన ఎమ్మెల్యే, ఎక్కడైనా పనులు అసంపూర్తిగా ఉన్నా వెంటనే పూర్తి చేసి ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల రెండో దశ కార్యక్రమం ద్వారా మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు దశలవారీగా ఇళ్ల మంజూరుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే పట్టణంలో ఏర్పాటు చేసిన డివైడర్ల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని అవసరమైన మార్పులు చేపడతామని తెలిపారు. వర్ధన్నపేటకు మున్సిఫ్ కోర్టు మంజూరు కావడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్న ఎమ్మెల్యే, త్వరలో కోర్టు కార్యకలాపాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రజలు, న్యాయవాదులు, సిబ్బందికి అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా అవుట్‌సోర్సింగ్ విధానంలో 10 మంది సిబ్బందిని నియమించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. పట్టణ పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలోని పండ్లు, కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించినట్లు తెలిపారు. మార్కెట్ ప్రారంభమైతే రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

చివరగా మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా ప్రతి వార్డులో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సమానంగా అమలు కావాలని, ప్రజాప్రతినిధులు–అధికారులు సమన్వయంతో పనిచేస్తే వర్ధన్నపేటను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దవచ్చని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు.ఈ సమావేశంలో వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి–రాజేందర్, కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, నునావత్ కమ్లి–కీమా, మలోత్ దేవేందర్, తిరుపెల్లి వాణి–కుమారస్వామి, భూక్యా సునీత, గుజ్జ వీరన్న, చిలువేరు రమ, తుమ్మల అరుణ, తిరుపతి సురేష్, సిలువేరు కుమారస్వామి, మున్సిపల్ కమిషనర్ జోనా, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లా అటవీ ప్రాంతమైనా అక్షరాస్యతలో ముందంజ

– ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 50 సైకిళ్ల పంపిణీ – అమ్మకు అక్షరమాలతో మహిళల్లో విద్యా చైతన్యం

– సేవా కార్యక్రమాలతో సమాజంలో వెలుగులు నింపాలి – పంచాయతీరాజ్,స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క





**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** వెనుకబడిన,అటవీ ప్రాంత జిల్లాగా పేరుగాంచిన ములుగు జిల్లా విద్యా రంగంలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని, విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహకారంతో జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 50 సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి హాజరై విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..ములుగు జిల్లా నిరక్షరాస్యత అధికంగా ఉన్న వెనుకబడిన జిల్లా అయినప్పటికీ జిల్లా అధికారులు,విద్యాశాఖ సిబ్బంది,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,విద్యార్థుల సమిష్టి కృషి ఫలితంగా ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో 99.30 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో మొదటి స్థానం,ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలో రెండవ స్థానం సాధించడం గర్వ కారణమని అన్నారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తోందని,జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహకారంతో 50 సైకిళ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కరోనా కాలం నుండి ఇప్పటి వరకు మహిళలకు కుట్టు మిషన్లు,విద్యార్థులకు సైకిళ్లు తదితర సేవాకార్యక్రమాలతో సమాజానికి అండగా నిలుస్తున్న రోటరీ క్లబ్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మారుమూల గ్రామాలు, అటవీ ప్రాంతాల్లో నివసించే విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఈ సైకిళ్లు ఎంతో ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. జిల్లాలో సేవా,సహాయ కార్యక్రమాలు,విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దే కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపట్టిన అమ్మకు అక్షరమాల కార్యక్రమం రాష్ట్రంలో మహిళా అక్షరాస్యతకు కొత్త దిశా నిర్దేశం చేస్తోందన్నారు. చదువురాని 12 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులను గుర్తించామని, మొదటి విడతగా 6 లక్షల మందికి లిటరసీ పరీక్షలు నిర్వహించగా 83.33 శాతం మంది ఉత్తీర్ణత సాధించడం విశేషమన్నారు.ఇప్పుడు మరో 6 లక్షల మందిని పరీక్షలకు సిద్ధం చేస్తున్నామని భవిష్యత్తులో వారందరినీ పదవ తరగతి పరీక్షలకు కూడా సిద్ధం చేసే కార్యాచరణ చేపడుతున్నామని వెల్లడించారు.రాష్ట్రంలో నిరక్షరాస్యత లేకుండా ప్రతి మహిళను అక్షరాస్యత వైపు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే దిశగా కష్టపడి చదవాలని,విద్యను కేవలం బట్టీ పట్టే విధంగా కాకుండా ప్రతి సబ్జెక్టును లోతుగా అర్థం చేసుకుని నేర్చుకునే అలవాటు పెంపొందించు కోవాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు మాట్లాడుతూ.పదవ తరగతి ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానం లో నిలవడం సంతోష కరమని అన్నారు.ఇదే స్ఫూర్తితో రాబోయే విద్యా సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతామని తెలిపారు. విద్యార్థులకు పాఠశాలల్లో ఉపాధ్యాయులు,ఇంటి వద్ద తల్లిదండ్రులు ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తే విద్యాభ్యాసంపై మరింత దృష్టి పెట్టే అవకాశం ఉంటుందని చెప్పారు. జిల్లాలో విద్యా అభివృద్ధికి సహకరించే సంస్థలు మరింత ముందుకు రావాలని కోరుతూ, విద్యార్థులకు సైకిళ్ల పంపిణీకి ముందుకొచ్చిన రోటరీ క్లబ్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్,మార్కెట్ కమిటి చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, డిఈఓ సిద్ధార్థ రెడ్డి,డిఐఈఓ వీరేంద్ర కుమార్,రోటరీ క్లబ్ ప్రతినిధులు చంద్రమౌళి, గణేష్,ఇతర సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పరకాల బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా విజయ్‌కుమార్



**పరకాల, జూన్ 16, (ప్రజాజ్యోతి):** పరకాల మున్సిపాలిటీలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా కౌన్సిలర్ కుక్కల విజయ్ కుమార్‌ను నియమించారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ఈ విషయాన్ని ప్రకటించారు. పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పగడాల కాళీ ప్రసాద్‌రావు హాజరయ్యారు. విజయ్‌కుమార్ నాయకత్వంలో మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ మరింత సమర్థంగా పనిచేస్తుందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హేమాచలున్ని దర్శించుకున్న ప్రముఖులు



**మంగపేట జూన్ 16 ప్రజాజ్యోతి :** మండలంలో రెండవ యాదగిరిగుట్టగా ప్రసిద్ధి చెందిన మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి వారిని దేవాదాయ దర్మదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, దార్మిక అడ్వైజర్ గోవిందా హరిలు దర్శించుకున్నారు. కాగా దేవస్థానం కార్యనిర్వాణాధికారి యం.వీరస్వామి, ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ స్థల పురాణాన్ని సవివరంగా వివరించి ఆలయ చరిత్రను తెలియజేశారు. అనంతరం ఆలయ మండపంలో స్వామి వారి శేష వస్త్రాలతో సన్మానం జరిపి స్వామి వారి తీర్ధ ప్రసాదాలను అందించారు. దర్శనం అనంతరం స్వామి వారి ఆలయ సమీపంలోని చింతామణి జలధార సందర్శించి పవిత్ర చింతామణి జలాన్ని భక్తి భావంతో శిరస్సుపై చల్లుకొన్నారు.అనంతరం 2027 గోదావరి పుష్కరాలకు ఏర్పట్లాకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల భవిష్యత్తుకు తొలి అడుగు



**భీమదేవరపల్లి జూన్ 16 ప్రజా జ్యోతి :** మండలం లోని ప్రభుత్వ పాఠశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను నూతనంగా మంజూరైన ప్రీ ప్రైమరీ తరగతులను గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి , మండల విద్యాశాఖ అధికారి ఎం. సునీత మంగళవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులకు ప్రాథమిక దశ నుంచే నాణ్యమైన విద్య అందించడంలో ప్రీ ప్రైమరీ విద్య కీలకమని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రదీప్, శ్రీకాంత్, రఘు, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తాడిచర్ల ఓసిపిలో ఎన్విరాన్మెంట్ అధికారుల తనిఖీ



**మల్హర్, జూన్ 16 ప్రజాజ్యోతి :** మండల కేంద్రమైన తాడిచర్ల–1 ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనిని కేంద్ర పర్యావరణ, శీతోష్ణస్థితి మార్పుల మంత్రిత్వ శాఖ ప్రాంతీయ అధికారి డాక్టర్ ఎం.టి. కరుప్పాయ్ రెండు రోజుల పాటు క్షుణ్ణంగా పరిశీలించారు. గనిలో పర్యావరణ అనుమతి నిబంధనల అమలు, గాలి, నీటి నాణ్యత, దుమ్ము నియంత్రణ, హరితహారం మరియు వ్యర్థాల నిర్వహణ చర్యలను ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గని యాజమాన్యం పునరావాస కార్యక్రమాలు, భూసార పరిరక్షణ, సామాజిక బాధ్యత పనుల వివరాలను అధికారికి సమర్పించింది. వివిధ ప్రాంతాలను సందర్శించిన అనంతరం ఆయన తన నివేదికను కేంద్ర మంత్రిత్వ శాఖకు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీ జెన్‌కో జనరల్ మేనేజర్ పి. మోహన్ రావు గారు, ఈఈ సివిల్ తౌఫీల్ అహ్మద్ మరియు గని యాజమాన్యం నుండి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ టి. శ్రీధర్, ప్రాజెక్ట్ హెడ్ ఎ. ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కే ఎస్ ఎన్ మూర్తి, మైన్ మేనేజర్ జి శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ కే సురేష్ బాబు, ఎస్టేట్ ఆఫీసర్ రామచంద్ర మూర్తి, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ రామ్ కుమార్ ఉ అభిషేక్, సర్వే డి.జి.యం ఎమ్ సర్వోత్తమ్ ఉ శేషావతారం, ప్రాజెక్ట్ ఇంజనీర్ కే. కిషన్, హెచ్ ఆర్ డి.జి.యం రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## అజ్జిలాపురం వాసి చందు నాయక్‌కు అంతర్జాతీయ 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్' అవార్డు

### –సామాజిక సేవలకు గుర్తింపుగా పురస్కారం అందజేత

మర్రిగూడ, జూన్ 16(ప్రజాజ్యోతి ): మర్రిగూడ మండలం అజ్జిలాపురం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త మేగవత్ చందు నాయక్‌కు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్' అవార్డు లభించింది. సమాజంలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను



గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేశారు.హైదరాబాద్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ భవనంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో చందు నాయక్‌కు ఈ అంతర్జాతీయ అవార్డును సోమవారం ఘనంగా ప్రదానం చేశారు. 'స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా' ఫౌండర్ చైర్మన్ డాక్టర్ ఆకుల రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బాధ్యత గల పౌరునిగా ప్రజల హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం పోరాడుతూ, చందు నాయక్ చేస్తున్న నిరంతర సోషల్ యాక్టివిటీస్, సామాజిక సేవలను గుర్తించి ఈ అంతర్జాతీయ గౌరవం కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

**బాధ్యత మరింత పెరిగింది: మేగవత్ చందు నాయక్:**

ఈ సందర్భంగా అవార్డు గ్రహీత చందు నాయక్ మాట్లాడుతూ తనకు ఇంతటి ఉన్నతమైన గుర్తింపు దక్కేలా సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ అంతర్జాతీయ పురస్కారం తనపై సమాజం పట్ల ఉన్న బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. భవిష్యత్తులోనూ తన వంతుగా ప్రజాసేవలో ముందంజలో ఉంటానని, నిరంతరం సమాజ శ్రేయస్సు కోసమే కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా బూరుగు వెంకటేశం

రామన్నపేట జూన్ 16 (ప్రజా జ్యోతి)



రామన్నపేట మండల కేంద్రానికి చెందిన బూరుగు వెంకటేశం ను తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా నియమిస్తూ ఈ మేరకు చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమ్మోహన్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. రామన్నపేట పట్టణానికి చెందిన బూరుగు వెంకటేశం పట్టణ, మండల పద్మశాలి సంఘం ఏర్పాటు విషయంలో కీలకంగా వ్యవహరించడంతోపాటు సంఘ బలోపేతా నికి సాయశక్తుగా చేస్తున్నారు. చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కొనసా గుతున్న ఆయనను క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా నియామకం కావడంతో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు రచ్చ యాదగిరి, డీసీఎంఎస్ మాజీ జిల్లా డైరెక్టర్, రామన్నపేట కాటన్ చేనేత సహకార సంఘం అధ్యక్షులు జేల్ల వెంకటేష్, పద్మశాలి సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి కైరంకొండ నాగభూషణ్, నాయకులు రవ్వ నరసింహా, రవ్వ సత్యనారాయణ, మహేశ్వరం అశోక్, కైరంకొండ నందు, చలమల గోపాల్, హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## చిన్నారుల భవిష్యత్తుకు తొలి అడుగు.. అంగన్వాడీ బడిబాట

ఆత్మకూర్(ఎం), జూన్ 16 (ప్రజా జ్యోతి): మండల కేంద్రంలో గ్రామంలో అంగన్వాడీ బడిబాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, చిన్నారుల ఆరోగ్యం, విద్య ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, ప్రీ–స్కూల్



విద్యా కార్యక్రమాలను వినియోగించుకోవాలని సూచించారు. గ్రామంలోని పిల్లలను గుర్తించి అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ అంగన్వాడీ టీచర్ ధనమ్మ ఆయా తల్లిదండ్రులు,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# బైకులు కొట్టేయడం... పార్టులుగా అమ్మేయడం...!

### దామరచర్ల కేంద్రంగా దందా.. అడ్డుకట్ట వేసిన టూ టౌన్ పోలీసులు

### ముగ్గురు నిందితుల నుండి 2 బైకులు,1.38 లక్షల నగదు స్వాధీనం

మిర్యాలగూడ, జూన్ 16,( ప్రజాజ్యోతి ): పార్కింగ్ చేసిన బైకు కనపడితే చాలు... కొట్టేసి.. పార్టు..పార్టులుగా విడదీసి విడిభాగాలను గుట్టు చప్పుడు కాకుండా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్న అక్రమ దందా దామరచర్ల మండల కేంద్రంలోని పాత ఇనుప సామాను కొనే షాప్ అడ్డాగా కొనసాగుతుండగా... ఎట్టకేలకు మిర్యాలగూడ టూ టౌన్ పోలీసులు అక్రమ వ్యవహారానికి అడ్డుకట్ట వేసి నిందితులను కటకటాల్లోకి నెట్టారు. మంగళవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను సీఐ జెట్టి సోమనర్సయ్య వెల్లడించారు. నల్లగొండ పట్టణంలోని ఆర్జాలబావికి చెందిన కొంగరి నవీన్ కుమార్, సూర్యాపేట జిల్లా, పాలకవీడు మండలం, గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన సోమిరెడ్డి సైదిరెడ్డి లు సెంట్రింగ్ కార్మికులుగా పనిచేస్తుంటారు. వ్యసనాలకు బానిసై ఈజీగా డబ్బులు సంపాదించేందుకు బైకు దొంగలుగా మారారు. మిర్యాలగూడ, పరిసర ప్రాంతాలలో పార్కింగ్ చేసిన బైకులను దొంగిలించి దామరచర్ల మండల కేంద్రం లో





పాత ఇనుము కొనుగోలు చేసే షాపు నిర్వహిస్తున్న కంచరకుంట్ల సుమలతకు విక్రయించేవారు. దొంగ సొత్తు కావడంతో ఒక్కో బైక్ కి మూడు వేలు ఇచ్చి కొనుగోలు చేసే సుమలత వాటిని పార్టులుగా విభజించి, విడిభాగాలను అధిక ధరలకు విక్రయించేది. ఈ విధంగా సుమారు పది బైకులు మాయం చేయగా, మరో రెండు బైకులు కొట్టేసి దామర చర్లలో విక్రయించేందుకు వస్తుండగా, పట్టణంలో ఫ్లైఓవర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న టూ టౌన్ పోలీసులకు నిందితులు తారసపడ్డారు. వారిని ఆపి బండికి సంబంధించిన డాక్యుమెంట్స్ చూపించాలని కోరగా లేకపోవడంతో అనుమానించి స్టేషన్ కు తీసుకువెళ్లి తమదైన శైలిలో విచారణ చేపట్టడంతో అక్రమ దందా కథ వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. దీంతో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద రెండు బైకులు, 1.38 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించి దర్యాప్తు



చేపట్టినట్లు తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ సోమనర్సయ్య, ఏఎస్ఐ షేక్ గఫార్, హెడ్ కానిస్టేబుల్ ఆర్.స్వర్ణ నాయక్, పిసిలు బాలకృష్ణ, కె. కళ్యాణ్ ఎల్.సూర, బి మణిదీప్, సయ్యద్ సమద్, ఎండి అక్బర్ బాషా, ఎం. రామకృష్ణ, ఎస్. రాజశేఖర్, జి. లక్ష్మయ్య లను మిర్యాలగూడ డిఎస్పి కె.రాజ శేఖర్ రాజు, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ లు ప్రత్యేకంగా అభినందించారు.

## చలో కొడంగల్ కు ఉద్యమకారులు తరలిరావాలి

### డాక్టర్ చీమ శ్రీనివాస్ పిలుపు

కోదాడ టౌన్, జూన్ 16 (ప్రజా జ్యోతి): ఈనెల 28న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న కొడంగల్ కృతజ్ఞత అభినందన యాత్రను విజయవంతం చేయాలని ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ పిలుపు





నిచ్చారు. కోదాడ పట్టణంలోని స్థానిక పబ్లిక్ క్లబ్ ఆవరణలో ఫోరం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు గుండెపంగు రమేష్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ ఉద్యమకారులను ఆదుకునేందుకు కేకే కమిటీని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. తొందరలోనే ఉద్యమకారులందరికీ న్యాయం చేసే దిశగా ఈ కమిటీ ప్రణాళికలు రచిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఉద్యమకారుల గుర్తింపునకు చొరవ చూపిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపేందుకే ఈ అభినందన యాత్ర చేపడుతున్నామని, దీనికి ప్రతి ఒక్క ఉద్యమకారుడు తరలిరావాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆవుల రామారావు, భూపాల్, జోగు అంజన్న,పుల్లూరి. అచ్చయ్య,తుపాకుల భాస్కర్, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి మజహర్, కోదాడ నియోజకవర్గ ఉద్యమకారుల ఫోరం నాయకులు ఏనుగుల యల్లేశ్వర రావు, మట్టపల్లి శ్రీనివాస్ గౌడ్, మునగాల మండల అధ్యక్షులు పోలంపల్లి వెంకటేశ్వర్లు, అనంతగిరి మండల అధ్యక్షులు సైదులు నాయక్, అడ్వకేట్ దావీదు, బొమ్మకంటి వీరబాబు, తోటపల్లి నాగరాజు, ఎస్.కె భాజన్,రామకృష్ణ, యాదగిరి, సత్యనారాయణ,కోమటి రెడ్డి.మోహనరెడ్డి,బోయినపల్లి. సత్యనారాయణ,బిట్టు. నరసయ్య, వెంకటనారాయణ, మండవ. నాగేశ్వరావు ,కన్నెబోయిన, ఏడుకొండలు,మోహన్రావు, ఏడుకొండలు, సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## అడ్లూరు చెరువు అలుగు మరమ్మతు పనుల ప్రారంభం

ఆలేరు జూన్ 16 ప్రజా జ్యోతి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని షారాజిపేట గ్రామంలో అడ్లూరు చెరువు అలుగు మరమ్మతు పనులను గ్రామ సర్పంచ్ కంతి మధు మంగళవారం ప్రారంభించారు. ఈ





సందర్భంగా మాట్లాడుతూ ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో 47.50 లక్షల అంచనా వ్యయంతో కూడిన ప్రాజెక్టును దాదాపు 31, 78,014 నాతో షెడ్యూల్ కులాల కేటగిరి రిజర్వేషన్ కింద మంజూరు కావడంతో పనులు ప్రారంభించమన్నారు. తొందరగా పనులు చేయాలని సూచన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీధర్, వార్డు సభ్యులు బండ శ్రీను, కంత బిక్షపతి, గ్రామ శాఖ అధ్యక్షుడు చిలుకు నాగరాజు, మదర్ డైరీ డైరెక్టర్ బత్తుల నరేందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిలుకు కిష్టయ్య, మాజీ ఉపసర్పంచ్ కిష్టయ్య, పార్టీ నాయకులు ఆంజనేయులు ,మల్లయ్య ,స్వామి, ప్రభాకర్, శ్రీశైలం శ్రీనివాస్, యూత్ నాయకులు, సంతోష్, శ్రీను ,మధు ,అనిల్, గణేష్, నర్సింగ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

### కొత్త మోటర్ ప్రారంభించిన చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్

ఆలేరు, జూన్ 16 ప్రజా జ్యోతి: 11వ వార్డులో గత కొంతకాలంగా నెలకొన్న తాగునీటి సమస్యకు మున్సిపల్ పాలకవర్గం శాశ్వత పరిష్కారం



చూపింది. వార్డులో నీటి కొరత తీవ్రంగా ఉందని 11వ వార్డు కౌన్సిలర్ జూకంటి సంపత్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆమె వెంటనే స్పందించి నవజీవన్ బీడీ కంపెనీ ఎదురుగా ఉన్న ఖాళీ బోర్ వద్ద కొత్త మోటర్ ఏర్పాటు చేయించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మంగళవారం చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ కొత్త మోటర్‌ను ప్రారంభించారు. దీంతో వార్డులో తాగునీటి సరఫరా మెరుగుపడడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వేసవి కాలంలో నీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఈ చర్య ఉపశమనాన్ని కలిగించిందని వార్డు వాసులు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు మున్సిపాలిటీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జూకంటి సంపత్, మాజీ కౌన్సిలర్ జూకంటి శ్రీకాంత్, జూకంటి రమేష్, మున్సిపల్ సిబ్బంది రాజు, సురేందర్, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు. కొత్త మోటర్ ఏర్పాటు ద్వారా నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని ప్రజలు అభిప్రాయపడ్డారు.

## కోదాడ యువ రచయిత కొండ్లే రవికుమార్‌కు బాలిక చైతన్యశ్రీ బిరుదు ప్రధానం

కోదాడ టౌన్, జూన్ 16 (ప్రజా జ్యోతి):



కోదాడ పట్టణానికి చెందిన యువ రచయిత, తెలుగు ఎన్నారై రేడియో వ్యాఖ్యాత కొండ్లే రవికుమార్ (దోస్త్ రవీందర్) అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. ఈనెల 12న ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ, ఉషోదయ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలో ఆన్‌లైన్ కవితల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రవికుమార్ రాసిన కవిత అందరి ప్రశంసలు అందుకుంది. ఈ నేపథ్యంలో సంస్థ ప్రతినిధులు ఆయనకు బాలిక చైతన్యశ్రీ బిరుదును, ప్రశంసా పత్రాన్ని ప్రదానం చేశారు.ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ యు.వి. రత్నం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత వాతావరణం ఉన్న కోదాడలో ఉంటూ, ఎన్నారై రేడియోలో కవితా లోకం కార్యక్రమ వ్యాఖ్యాతగా అనేక జనహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్న రవికుమార్‌కు ఈ పురస్కారం దక్కడం సంతోషకరమన్నారు.

# ఆరోగ్యవంతమైన ఓటరు జాబితా కోసం చేసే ప్రయత్నమే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్

ఆలేరు జూన్ 16 ప్రజా జ్యోతి: ఆరోగ్యవంతమైన ఓటరు జాబితా కోసం చేసే ప్రయత్నమే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని తహశీల్దార్ వి. ఆంజనేయులు అన్నారు. ఎస్ ఐ ఆర్ శిక్షణలో భాగంగా మంగళవారం బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన ఆలేరు మండలంలోని బూత్ లెవెల్ ఆఫీసర్ల ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం చేపట్టే ఒక విధమైన ప్రక్రియ ఎస్ ఆర్ అని, దీని ద్వారా అర్హులైన భారత పౌరులందరూ ఓటర్ల జాబితా (ER)లో చేర్చబడతారని మరియు అనర్హులైన ఓటర్లు



ఎవరూ ఓటర్ల జాబితాలో చేర్చబడరని నిర్ధారించుకుంటారని అన్నారు. ఈ ఎస్ ఐ ఆర్ ద్వారా ఓటర్ల జాబితా ప్యూరిఫికేషన్ జరుగుతుందని, డెత్, డబుల్ ఉన్న ఓటర్ల ను గుర్తించి సరిచేయడం జరుగుతుందని, తద్వారా సరియైన ఓటర్ల జాబితా తయారవుతుందని తెలిపారు. ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు సంబందించిన షెడ్యూల్ వెలువడిందని, బిఎల్వోఓ లు అందరూ ఈ నెల 25 నుండి ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారములు ఇస్తారని, ఓటర్లు ఆ ఫారాలను నింపి తిరిగి బి ఎల్ ఓ లకు ఇవ్వాలని, ఫారాలను నింపే విషయంలో బి ఎల్ ఓ లు సహకరిస్తారని అన్నారు.ఈ విషయంలో రాజకీయపక్షాలకు కూడా అవగాహన కల్పించామని, ఓటర్లందరూ సహకరించాలని కోరారు.



ఈ కార్యక్రమంలో ఎన్నికల శిక్షణాధికారులు హరనాథ్ రెడ్డి, దూడల వెంకటేష్, తిరుపతి రెడ్డి చితరంజన్, ఆర్ ఐ లు పూర్ణచందర్ రావు, భద్రయ్య, ఏ ఎస్ ఓ మహేష్, కార్యాలయ సిబ్బంది రాజేష్, శ్రీకాంత్, భాస్కర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడిలో తన పిల్లలను చేర్పించిన యువ సర్పంచ్: మల్లెల సాయిచరణ్



**సిరికొండ ( ప్రజా జ్యోతి )జూన్ 16**

సిరికొండ గ్రామ యువ సర్పంచ్ మల్లెల సాయిచరణ్ పలువురికి ఆదర్శంగా నిలిచారు ఆయన ఇద్దరు కుమారులను స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లోకార్పొరేట్ తరహాలో చిన్నపిల్లలకు ప్రీ ప్రైమరీ స్కూల్లో పెద్ద పిల్లలకు ఇంగ్లీష్ మీడియం లో విద్యా బోధన జరుగుతుందని అన్నారు ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ తరహాలో అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య బోధన జరుగుతుందని చెప్పారు గ్రామ ప్రజలందరూ తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలోని చేర్పించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు

## ముషీర్‌నగర్ గ్రామంలో సిసిరోడ్డు పనులు ప్రారంభం



**సిరికొండ (ప్రజా జ్యోతి)జూన్ 16**

సిరికొండ మండలంలో ముషీర్ నగర్ గ్రామంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి చొరవతో ఉపాధి హామీ నిధులు మంజూరు కావడంతో సిసి రోడ్డు పనులు ప్రారంభం చేసుకోవడం జరిగిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు ఎమ్మెల్యే మా గ్రామానికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ పీపావత్ లస్కర్ నాయక్, ఉప సర్పంచ్ ధోని మోహన్, గ్రామ యువకులు సురేష్, సుశాంత్, శంకర్, రాజేందర్, జగన్ గ్రామస్తులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

**బీర్కూర్, జూన్ 16 (ప్రజాజ్యోతి):**

విద్యార్థుల్లో విద్యా ప్రగతికి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ అరిగే ధర్మతేజ, మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) వెంకన్న సూచించారు. మంగళవారం బీర్కూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యా రంగంలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పద్మ, ఉపసర్పంచ్ పరమేష్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శివరాం, యమా రాములు, మేకల విఠల్‌తో పాటు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పాఠ్యపుస్తకాలు అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.



## మొబైల్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకొని యూరియా పొందాలి

### - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి ప్రతినిధి జూన్ 16. (ప్రజాజ్యోతి)**

రైతులు మొబైల్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకొని యూరియా ఎరువులను పొందాలని జిల్లా కలెక్టర్ సూచించారు. లింగం పేట మండలంలోని పోతాయిపల్లి గ్రామంలో యూరియా బస్తాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. యూరియా పంపిణీలో పారదర్శకత, సౌలభ్యం కోసం అమలు చేస్తున్న మొబైల్ యాప్ ద్వారా రైతులు ముందస్తుగా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. దీంతో రద్దీ తగ్గడంతో పాటు రైతులు నిర్ణీత సమయంలో ఎరువులు పొందగలరని తెలిపారు. మొబైల్ యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించి స్లాట్ బుకింగ్ ప్రక్రియను సులభతరం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించి పంటల దిగుబడిని పెంచుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, ఎంఎస్‌వో, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, ఏఈ (ఆర్‌డబ్ల్యూఎస్), విద్యుత్ శాఖ అధికారులు, ఎంఈవో, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాజకీయ లబ్ధి కోసమే విపక్షాల రాద్ధాంతం

### - నందిపేట్ మండల కాంగ్రెస్ నాయకుల ధ్వజం

**(నందిపేట్ ప్రజా జ్యోతి):**

యూరియా కొరత పేరుతో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చేస్తున్న ఆందోళనలు రైతుల ప్రయోజనాల కోసం కాకుండా రాజకీయ లబ్ధి కోసమేనని నందిపేట్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంద మహిపాల్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'యూరియా యాప్' ద్వారా ఎరువుల పంపిణీ పారదర్శకంగా జరుగుతోందని, ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను రైతులు నమ్మవద్దని కోరారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జలయజ్ఞం కింద చేపట్టిన ఎత్తిపోతల పథకాలు, గుత్ప లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఉమ్మడి మండలాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని తెలిపారు. భూభారతి కార్యక్రమం ద్వారా



సదాబైనామా భూములకు పట్టాలు అందించి రైతులకు అండగా నిలుస్తామని చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయ అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, కృత్రిమ కొరతపై విపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని కాంగ్రెస్ నాయకులు సూచించారు. అనవసర వదంతులను విశ్వసించి ఆందోళన చెందవద్దని, ఎరువుల కొరతపై తప్పుడు ప్రచారాలతో రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో



పీఏసీఎస్ చైర్మన్ మీసాల సుదర్శన్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎర్రం లింగం, సీనియర్ నాయకుడు పిప్పర సాయారెడ్డి, సర్పంచులు మీసాల లక్ష్మీనారాయణ, చిన్నయ్య, ఆర్మూర్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎడ్డిగారి నిఖిల్, పెంట ఇంద్రుడు, దమ్మాయి శ్రీను, కాంతం చిన్నయ్య, గాదె శ్రీను, మల్కా గంగారెడ్డి, నసీర్, మన్నె సాగర్ తదితరులు పాల్గొన్నారు.

### బోధన్ మారుతి మందిరంలో

# బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు

**ప్రజా జ్యోతి. బోధన్ జూన్ 16**

భారతీయ జనతా పార్టీ బోధన్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశ చరిత్రలో అత్యధిక రోజులు పరిపాలించిన సందర్భంగా భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుతూ బోధన్ పట్టణంలోని పెద్ద హనుమాన్ మందిర్ లో వేద పండితులు ప్రవీణ్ మహారాజ్ వేద మంత్రోచ్చరణల నడుమ ప్రధాని మోదీ పేరు మీద ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ బోధన్ పట్టణ అధ్యక్షులు పసుపులేటి గోపి కిషన్ మాట్లాడుతూ మాజీ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ పై ఉన్న రికార్డ్ బ్రేక్ చేసి మూడో సారి భారత ప్రధాని గా ఎన్నికైన ఘనత మోడీ కే దక్కిందన్నారు. భారత దేశాన్ని అత్యధిక రోజులు పరిపాలించిన ప్రధాని గా సుపరిపాలన అందిస్తూ వ్యవసాయ రంగంలో, ఆర్థిక రంగంలో, రక్షణ



రంగంలో, రవాణా రంగంలో అన్ని రంగాలలో ప్రగతి పథంలో ప్రపంచ దేశాలతో సరి సమానంగా పరిపాలిస్తూ అభివృద్ధి చేస్తున్న నరేంద్ర మోడీ భారత ప్రజలకి ఎన్నో సంక్షేమ పథకాలు విశ్వకర్మ యోజన, ముద్ర లోన్స్, ప్రధాని ఆవాస్ యోజన, పీఎం కిసాన్ యోజన బేటీ పాడవ్ భేటీ బచావో, వందేమాతరం రైల్స్, ప్రధాని సడక్ యోజన అనేక పథకాలతో సామాన్య ప్రజలు కూడా ఆర్థిక అభివృద్ధి చెందే విధంగా ప్రధాని మోదీ గారు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కానీ భారతదేశ సమస్యలు 370 ఆర్టికల్, అయోధ్య రామ మందిరం, త్రిబుల్ తలాక్, నల్లధనం, ఉగ్రవాదం, భారత సరిహద్దు సమస్యలు పరిష్కరించి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా నిరంతరం భారత దేశ అభివృద్ధి మరియు భారత ప్రజల సేవకుడి నిరంతరం ఎలాంటి కరప్షన్ లేకుండా పనిచేస్తున్న ఏకైక ప్రధాని నరేంద్ర మోడీ గారి లాంటి ప్రధాని భారతదేశానికి దొరకడం భారత దేశ ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొలీపాక బాలరాజు, మాజీ ఫ్లోర్ లీడర్ మాసిని వినోద్, హనుమాన్లుచారి, గుంత గంగాధర్, పేరుక వెంకటేష్, కార్యదర్శి స్వప్నిల్, శ్రీను, వినోద్, వినయ్, పడాల శ్రీను, కిరణ్ , పవన్ కళ్యాణ్, శ్రీకాంత్, రాజు, సన్నీ, కనీగంటి ఫణీంద్ర, రాము తదితరులు పాల్గొన్నారు.

## మాతాశిశు సంరక్షణకు అంకిత భావంతో కృషి చేయాలి

### - కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్, ప్రజాజ్యోతి జూన్ 16 :**

మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా వైద్యులు, సిబ్బంది అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ప్రసవాల సందర్భంగా మాతాశిశు మరణాలు చోటుచేసుకోకుండా ముందస్తుగానే క్రమం తప్పకుండా వైద్య సేవలు అందిస్తూ, నిశిత పర్యవేక్షణ జరపాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి మాతా శిశు మరణాల నిరోధక కమిటీ సమావేశం జరిగింది. ఇటీవలి కాలంలో జిల్లాలో చోటుచేసుకున్న మాతాశిశు మరణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏ ఆసుపత్రిలో సంఘటన చోటుచేసుకుంది, మరణం సంభవించడానికి దారి తీసిన పరిస్థితులు ఏమిటీ, వైద్య సేవలలో ఏమైనా లోపం జరిగిందా అని ఆరా తీస్తూ, రికార్డులను పరిశీలించారు. మాతాశిశు మరణాలు జరగకుండా ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడ సంఘటన జరిగినా లోతుగా పరిశీలన జరుపుతామని, నిర్లక్ష్యం కారణంగా మరణం సంభవించినట్టు వెల్లడి అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గర్భిణీలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరుపుతూ, అవసరమైన వైద్య చికిత్సలు



అందించాలని సూచించారు. వారు పుట్టింటికి వెళ్ళిన పక్షంలో వారి హెల్త్ రికార్డును అక్కడి అధికారులకు పంపాలని, క్షేత్రస్థాయిలో ఆశాలు, అంగన్వాడీలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, వారి ఇళ్ళను సందర్శించి ఆరోగ్య స్థితిని వాకబు చేయాలని అన్నారు. అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోంలలో తప్పనిసరిగా తగిన పరిజ్ఞానం కలిగిన నిపుణులైన వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, వైద్య పరీక్షలు, చికిత్సలు అందించే విషయంలో ఎలాంటి లోపం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా రక్త హీనత, బీ.పీ పరీక్షలు



క్రమం తప్పకుండా చేయాలని, అవసరమైన వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తూ, ఎంతో విలువైన నిండు ప్రాణాలు కాపాడాలని సూచించారు. కాన్పు సందర్భంగా అనుకోని పరిస్థితుల్లో తల్లి మరణిస్తే, బాధిత కుటుంబం చిన్నాభిన్నం అయ్యే అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ,టి.వినయ్ డీ.సీ.హెచ్.ఎస్ శ్రీనివాస్ ప్రసాద్, కమిటీ సభ్యుడు బుస్స ఆంజనేయులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, సంబంధిత వైద్యాధికారులు, వైద్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్, బీజేపీ తోడు దొంగలు: ఎమ్మెల్యే డా ఆర్ భూపతి రెడ్డి

- జిలాల్లో యూరియా కొరత లేదు..
- 28 వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాలో అందుబాటులో ఉన్నాయి.
- లక్షా 39 వేల మంది రైతులకు 3.78 లక్షల యూరియా బస్తాల పంపిణీ జరిగింది.
- 207 రైతువేదికల నుండి యూరియా పంపిణీ
- కాంగ్రెస్ పాలనలో రైతులు సంతోషంగానే ఉన్నారు
- బీజేపీ, బిఆర్ఎస్ ఏనాడు రైతుల పక్షాన లేదు
- భారస, బిజెపి లక్ష్యం ఒక్కటే కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవడం
- ఎంపీ అరవింద్ నీట్ పేపర్ లీకేజీ పై మాట్లాడాలి
- అవినీతిపరులు అని చెప్పి ఇప్పుడు పార్టీలో ఎలా చేర్చుకుంటున్నారు
- బిఆర్ఎస్ నేత బాల్క సుమన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు
- కేటీఆర్ పనికిరాడు అని కెసిఆర్ ఫామ్ హౌజ్ లో పడుకున్నారు
- ఎంపీ అరవింద్ ఏం ఆధారాలున్నాయని సీఎం, మంత్రుల పై అవినీతి ఆరోపణలు చేస్తున్నాడు
- కాంగ్రెస్ ప్రభుత్వం రైతును రాజు చేసింది

**నిజామాబాద్ రూరల్ ( ప్రజా జ్యోతి )జూన్ 16**

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు సంతోషంగానే ఉన్నారని, జిల్లాలో యూరియా కొరత లేదని బీజేపీ , బిఆర్ఎస్ నాయకులు తోడుదొంగల్లగా వ్యవహరిస్తూ.. ప్రభుత్వాన్ని బదనం చేస్తున్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. జిల్లాలో యూరియా కొరత లేదని.. సరిపడా నిల్వలు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు లక్షా 39 వేల మంది రైతులకు 3.78 లక్షల యూరియా బస్తాల పంపిణీ జరిగింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 207 రైతు వేదికల నుండి ఎకరం, రెండెకరాలు , ఆపై ఎకరాల విస్తీర్ణం ఆధారంగా విడతల వారీగా యూరియా పంపిణీ జరుగుతుందని వివరించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా, అక్రమ రవాణా నివారించేందుకు తెచ్చిన యాప్ ద్వారా పంపిణీ జరుగుతుందని చెప్పారు. యాప్ ద్వారా తలెత్తే సమస్యలను సైతం పరిష్కరిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ఈ వానాకాలం 5.30 లక్షల ఎకరాల్లో పంట పండించనున్నారని అందులో 4.38 లక్షల ఎకరాల్లో వరి, 0.55 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 0.34 లక్షల ఎకరాల్లో సోయా పంట పంపించనున్నట్లు అంచనాలు ఉన్నాయన్నారు. ఇందుకుగాను 80,857 మెట్రిక్ టన్నుల యూరియా అవసరము ఉండగా ఇప్పటి వరకు 38,766 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరిందన్నారు. అందులో 18,596 మెట్రిక్ టన్నుల యూరియా ఇప్పటికే రైతులకు చేరిందన్నారు.

**బిఆర్ఎస్, బీజేపీ తోడుదొంగలు**

ఆంక్షల పేరుతో తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన కోటా యూరియా ఇవ్వకుండా తాత్సారం చేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని నిలదీయాల్సింది పోయి అనవసరంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బిఆర్ఎస్ విమర్శించడం సరికాదన్నారు. ఈ బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు రెండు తోడుదొంగల్లగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఓ వైపు బిఆర్ఎస్ సొంత పార్టీ నుండి బయటకొచ్చిన కవిత బిఆర్ఎస్ అవినీతి బయటపెడుతుంటే.. మరోపక్క మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ నేత బాల్క సుమన్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వారి వినాశనానికి అద్దం పడుతోందని అన్నారు. ధర్నాలకు రైతులు రావడం లేదు, సింగరేణిని తగలబెట్టండి, రైళ్ల పట్టాలు కోసేయండి, మిలిటెంట్ కార్యక్రమాలు చేపట్టాలని సుమన్ మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. ఇంకోవైపు హరీశ్ రావు బీజేపీ తో టచ్ లో ఉంటున్నారని



ఆరోపించారు. అటు బీజేపీ నాయకులు కేంద్రం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను కప్పిపుచ్చి రాష్ట్ర ప్రభుత్వం పై పడుతుందన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఎంపీ అరవింద్ రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల పై అవినీతి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నీట్ పేపర్ లీకేజీ పై, నిజామాబాద్ స్మార్ట్ సిటీ, లక్కంపల్లి ఇండస్ట్రీ పై ఎంపీ అరవింద్ మాట్లాడాలని ధ్వజమెత్తారు. ఓట్లు తెలంగాణ ప్రజల నుండి తీసుకుంటూ.. గుజరాత్ పాట పాడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ, బిఆర్ఎస్ తోడుదొంగలాటను ప్రజలు గమనిస్తున్నారని వారిని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు.

**కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల అభివృద్ధి**

కాంగ్రెస్ పాలనలో ఓ వైపు విద్యాభివృద్ధి మరోవైపు సంక్షేమ పథకాల అమలు, మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా అన్ని వర్గాలను కలుపుకొని అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రజలు ఈ బీజేపీ,బిఆర్ఎస్ మాయలో పడొద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని రైతులను రాజు చేసే దిశగా పాలన సాగిస్తోందని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విధాలుగా అండగా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని అభయమిచ్చారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర గీతా పారిశ్రామిక సహకార కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ ముసుకు సాయరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్ రెడ్డి, పొలసాని శ్రీనివాస్, అగ్గు భోజన్న, హన్మండ్లు, బోర్గం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జిలుగు విత్తనాలు 50% సబ్సిడీపై రైతులకు పంపిణీ చేశాం

● మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి



కొల్చారం (ప్రజాజ్యోతి ) జూన్ 16 : మండల రైతులు సేంద్రియ సాగు వైపు మరలేలా ప్రోత్సహించడానికి, వ్యవసాయ శాఖ ద్వారా జీలుగు విత్తనాలను 50 శాతం సబ్సిడీపై రైతులకి పంపిణి చేయడం జరిగిందనీ మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి తెలిపారు. మంగళవారం అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడడం వల్ల తగ్గుతున్న భూసారాన్ని పెంచే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు.

**జీలుగు విత్తనాల ప్రయోజనాలు:**

భూసారం పెరుగుదల విత్తనాలను చల్లి, 35 నుంచి 45 రోజుల తర్వాత పూత రాకముందే నేలలో కలియ దున్నినట్లయితే, సుమారు 12 టన్నుల జీవ పదార్థం నేలలోకి చేరుతుంది. దీనివల్ల సేంద్రియ కర్బన పదార్థం పెరిగి, భూమి సారవంతమవుతుంది. జీవపదార్థం పెరగడం వల్ల నేలలో మొక్కలకు మేలు చేసే సూక్ష్మజీవులు, వానపాముల సంఖ్య పెరుగుతుంది. పంట మార్పిడి జరగడం వల్ల వరిలో వచ్చే కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు, సుడిదోమ వంటి తెగుళ్ల ఉధృతి తగ్గుతుంది. జీలుగు మొక్క గాలిలోని నత్రజనిని నేలలో నిక్షిప్తం చేయడం ద్వారా యూరియా వంటి రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది. ఈ పద్ధతి వల్ల నేల నీటిని నిల్వ చేసుకునే శక్తి పెరుగుతుందనీ మండల వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి అన్నారు.

## బాబాసాహెబ్ అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహిత

● మాల మహానాడు హత్నూర మండల అధ్యక్షులు పల్వంచ రాజీవ్ గాంధీ



హత్నూర 16 జూన్ (ప్రజాజ్యోతి) పాల్వంచ రాజీవ్ గాంధీ (మాల మహానాడు హత్నూర మండల అధ్యక్షులు) గ్రామం కొన్యాల హత్నూర మండల్ సంగారెడ్డి జిల్లా స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో ఫౌండర్ మరియు చెర్మన్ లయన్ ఐతీ ఆకుల రమేష్ ఆధ్వర్యంలో బుధవారం నాడు ఈరోజు ఐతీ. బి .ర్ . అంబేద్కర్ నేషనల్ అవార్డు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు,పాల్వంచ రాజీవ్ గాంధీ మాట్లాడుతూ మండలంలోని దళిత సామాజిక వర్గంలో ఉన్న యువత బాబాసాహెబ్ అంబేద్కర్ గారి ఆశయాలను ప్రతి ఒకరు పాటించావాల్సిన అవసరం ఉందని చెప్పారు,అంబేద్కర్ రాసిన రాజ్యాగం ని ప్రతి ఒకరు తెలుసుకోవాలని విద్య పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టాలని విద్యార్థులకు తెలియచేసారు. భవిష్యత్తు లో అంబేద్కర్ స్ఫూర్తి తో ముందుకు వెళ్తానని చెప్పారు.కార్యక్రమం లో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు తెలియచేసారు.

## స్వచ్ఛ భారత్ స్ఫూర్తిని కాపాడాలి

● పట్టణ 36 వార్డు కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్



జహీరాబాద్, జూన్ 16(ప్రజా జ్యోతి న్యూస్) జహీరాబాద్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛ భారత్ స్ఫూర్తిని కాపాడాలని 36 వార్డు కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్ అధికారు లను కోరారు. తన వార్డు పరిధిలో ఉన్న మురుగు కాలువలను మంగళవారం స్వయంగా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ తగ్గుతోందని అభిప్రాయపడ్డారు. పారిశుద్ధ్య సిబ్బంది తక్కువగా ఉండటమే అందుకు కారణంగా పేర్కొన్నారు. మురుగు కాలువలు, రహదారు లపై చెత్త పేరుకుపోవడం వల్ల అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే సిబ్బందిని పెంచితేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో సుమారు 300ల మంది పారిశుద్ధ్య కార్మికులు అవసరం ఉండగా 120 మంది ఉన్నారని అన్నారు. దీని వల్ల పరిసరాల పరిశుభ్రతపై ప్రభావం పడుతోందన్నారు. ఈ విషయమైన జిల్లా, మున్సిపల్ స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేయడంతో పాటు స్వచ్ఛ భారత్ స్ఫూర్తి కాపాడినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు.

### ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో

## సరిపోను డాక్టర్లను తక్షణమే నియమించాలి

● డాక్టర్లు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజానీకం

● సిపిఎం జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యులు మహిపాల్



జహీరాబాద్, జూన్ 16(ప్రజా జ్యోతి న్యూస్) నియోజకవర్గ జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కనీసం సరిపోను డాక్టర్లు లేక ప్రజానీకం పెద్ద ఎత్తున ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే డాక్టర్లను నియ మించాలని సిపిఎం జహిరాబాద్ ఏరియా కమిటీ సభ్యులు ఎస్.మహిపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈ సమస్య పై సూపరింటెండెంట్ తో చర్చించిన సందర్భంగా డాక్టర్లు లేకపోవడంతో గర్భవతు లుగా ఉన్న పేద మహిళలకు సిజేరియన్లు చేయలేక పేద ప్రజలు పెద్ద ఎత్తున ఇబ్బందులు పడుతున్నా రని పేదలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వం విఫలం అయిందని తక్షణమే డాక్టర్స్ అందుబాటులోకి తేకుంటే పెద్ద ఎత్తున సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని అన్నారు. ఈ సమస్య కలెక్టర్, డిసిహెచ్ దృష్టికి తీసుకెళ్ళి చర్చించాలని డాక్టర్లు వచ్చేలా చూడాలని కోరారు. కలెక్టర్, డిసిహెచ్ఎస్ దృష్టికి తీసుకెళ్తామని సూపర్డెంట్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సలీమొదీన్, తిరుపతి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ

● గ్రామీణ మహిళలకు ఆర్థిక భరోసా ● రోటరీ క్లబ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్

ములుగు, జూన్16 (ప్రజా జ్యోతి) గ్రామీణ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే రోటరీ క్లబ్ ముఖ్య ఉద్దేశం అని గజ్వేల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ములుగులో మహిళలకు3150 అసిస్టెంట్ గవర్నర్ జగదీశ్వర్ తో కలిసి కుట్టు మిషన్ల పంపిణీ చేశారు.మహిళల ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు తోడ్పాటు అందించాలన్న ఉద్దేశంతోనే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగానే ములుగు గ్రామానికి చెందిన ఆరుగురు మహిళలకు షార్ సహకారంతో క్లబ్బుకు కేటాయించిన కుట్టుమిషన్లు పంపిణీ చేసినట్లు వారు వివరించారు.రోటరీ ఇంటర్నేషనల్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామీణ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా వ్యవహరిస్తుందన్నారు.గతంలో విద్యార్థినిలకు పాఠశాలలకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉన్న వారికి సైకిల్లు, పాఠశాలల్లో బెంచీలు, మధ్యాహ్న భోజనానికి ప్లేట్లు, డ్రెస్సులు, నోటు పుస్తకాలు, గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు స్వచ్ఛమైన నీరును అందించడానికి నీటి శుద్ధి ఫిల్టర్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి సాయి రెడ్డి, పూర్వ అధ్యక్షులు, నరసింహారెడ్డి, క్లబ్ చైర్మన్ కరుణాకర్ రెడ్డి, సభ్యులు శ్రీరాములు, శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇల్లు అసలైన నిరుపేదలకు చెందాలని డిమాండ్

● ఆత్మ నిర్భార్ మహిళ యోజన సంగారెడ్డి జిల్లా కో-ఆర్డినేటర్ అయినాహస్బి పూర్ణిమ



జహీరాబాద్, జూన్ 16(ప్రజా జ్యోతి న్యూస్) సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ అయినాహస్బి పూర్ణిమ ఒక ప్రకటనలో మాట్లాడడం జరిగింది. ఆత్మ నిర్భార్ మహిళలకు అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ వారికి ఆసరాగా నిలుస్తామని ఆత్మ నిర్భార్ మహిళలందరికీ ప్రభుత్వం నుండి వచ్చే పథకాలని అందే విధంగా ప్రయత్నం చేస్తానని తెలిపారు. ప్రజల ప్రభుత్వం అని చెప్పుకుంటూ ఓటు తన్నుకొని ఈరోజు అసలు అయినా బీదవారికి ఏం దక్కిందని ప్రశ్నించడం జరిగింది. ఇల్లు లేని అసలైన నిరుపేదలు ఎవరు ఉన్నారని కొద్దిగా క్షేత్రస్థాయిలో అధికారులు క్షుణంగా పరిశీలించి అసలైన నిరుపేదలు ఎవరు ఉన్నారని పరిశీలించి వారికి మంజూరు చేయాలని ఆత్మ నిర్భార్ కమిటీ తరఫున హస్బి పూర్ణిమ డిమాండ్ చేయడం జరిగింది. ఈరోజు వరకు ఏ ఒక్క పూర్తిస్థాయిలో ఏ ఒక్క పథకం వర్తించలేదని తెలుపుతూ ఇతవు పలికారు. ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ ఇండ్లలో ఉన్నవారికి కాకుండా కొద్దిగా నిరుపేదల వైపు చూస్తూ ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న ప్రభుత్వం పథకాలు వర్తింప చేయాలని అసలు ఈరోజు ఏ ఒక మహిళ ఈరోజు వరకు సంతోషంగా లేదు ప్రతిఒక్క బీద మహిళలకి అండగా ఉంటామని చెపుతున్న నాయకులు ఈరోజు ఏమైందని అసలు పథకాలు నాయకులకేనా బీదవారిక అసలు ఎవరికి చెందాలి పేదవారు. పేద వాళ్ళకే ఉండాలి ఇప్పటికైనా పేద ప్రజలను అండగా నిలబడాలని ప్రతి ఒక్క మహిళకు అండగా ఉండి అవసరమైన ప్రతి మహిళకి పరిశీలన చేసి అధికారులను నిలదీసి ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా కార్యాచరణ చేసి ముందుకు సాగుతామని సమయం అయితే త్యాగానికైనా సిద్ధంగా ఆత్మ నిర్భార్ సభ్యులు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటారని అవసర మైతే ధర్నాలు చేసి అసలైన నిరుపేదలకు చందే విధంగా పూర్తిస్థాయిలో కార్యాచరణ ప్రకటిస్తా మనిహస్బి పూర్ణిమ మహిళలందరికీ తెలపడం జరిగింది.

## కనీస వేతనం 26 వేలు పెంచాలి

● సిఐటియూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య

గజ్వేల్ జూన్ 16 (ప్రజా జ్యోతి): కనీస వేతనం 26 వేలు పెంచాలని,లేబర్ కోడులు రద్దు చేయాలని సిఐటియు సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈనెల 21న సంగారెడ్డి పట్టణంలో నాన్ ఫర్ మెంట్ కార్మికుల రాష్ట్ర మొదటి మహాసభ విజయవంతం చెయ్యాలి. గజ్వేల్ పట్టణంలో గోడపత్రిక ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీవో నెంబర్ 6ను కార్మికుల వేతనాలను పెంచుతూ విడుదల చేయడం జరిగింది. వేతనాల పెంపుదల అశాస్త్రీయ పద్ధతిలో ఉందని డాక్టర్ ఆక్రాయిడ్ ఫార్ములా,1951 ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ పద్ధతులను అవలంబించలేదని అన్నారు.కనీస పరమైన జీవన ప్రమాణాలను పరిగణ తీసుకోలేదని విమర్శించారు.వేతనాలను సవరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో నూతన లేబర్ కోడలను అమలు చేయవద్దని కార్మికుల వ్యతిరేకంగా ఉన్న కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తెచ్చిన కార్మిక కోడులను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం కార్మికులకు ద్రోహం చేయడమేనని అన్నారు.పరిశ్రమల్లో ఇప్పటికే కనీస వేతనాలు, చటపరమైన సౌకర్యాలు అమలుకు నోచుకోవడం లేదని,కాంట్రాక్టు, నిమ్స్, న్యాప్స్, స్టాపు, ఫిక్స్ టైం, తదితర రూపాల్లో పరిశ్రమంలో కార్మికులను నియమించుకొని చట్టాలను ఉల్లంఘించి పని చేయించడం జరుగుతుందని కార్మికుల భద్రతను వదిలేశారన్నారు.పర్మినెంట్ గాని కార్మికులందరికీ కోసం సౌకర్యాలు అమలు కోసం తెలంగాణ రాష్ట్ర నాన్ ఫర్ మెంట్ వర్కర్స్ యూనియన్ పోరాటం నిర్వహిస్తుందని తెలిపారు.21న సంగారెడ్డి పట్టణంలో జరుగు రాష్ట్ర ప్రథమ మహాసభలో సిఐటియు కేంద్ర,రాష్ట్ర నాయకులు పాల్గొంటారని కార్మిక వర్గం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వేణుగోపాల్ బండ్ల స్వామి చంద్రశేఖర్ రెడ్డి రంగారెడ్డి రాజగోపాల్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



### బంగారం మెరిపిస్తామని

## మోసం చేసిన కేటుగాళ్ల అరెస్ట్

● తొగుట ఎస్సై, సిబ్బందిని అభినందించిన పోలీస్ ఉన్నతాధికారులు



తొగుట, జూన్ 16 (ప్రజాజ్యోతి): తొగుట మండలంలో ఇటీవల బంగారం మెరిపిస్తామని మాయ మాటలు చెప్పి ఎనిమిది గ్రాముల బంగారం కాజేసిన కేటుగాళ్లను తొగుట పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండు తరలించారు. తొగుట పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటరావుపేట్ గ్రామంలో మహిళ వద్ద నుండి బంగారు పుస్తెళతాడు కడిగి మెరిపిస్తామని చెప్పి మోసం చేసిన కేసును ఎంతో ప్రతిస్తాత్మకంగా తీసుకున్న తొగుట ఎస్సై వి. రవికాంత్ రావు రెండు బృందాలుగా ఏర్పడి కేసును చేదించే క్రమంలో సోమవారం సాయంత్రం మెట్టు క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనీఖి చేస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని తొగుట ఎస్సై వి. రవికాంత్ రావు అదుపులోకి తీసుకొని విచారించగా కూలీ పనులు చేసుకుంటూ జీవించే బీహార్ రాష్టం మధురాపూర్ గ్రామానికి చెందిన 49 సంవత్సరాల మహమ్మద్ రుస్తుం, నారాయణపూర్ గ్రామానికి చెందిన 41 సంవత్సరాల మహమ్మద్ గ్యాస్ అలీ ఇద్దరూ కలిసి సిద్దిపేట జిల్లా తొగుట మండలం వెంకట్రావుపేట గ్రామానికి వచ్చి గత శనివారం ఉదయం గ్రామంలోని ఒక అమ్మాయి మెడలో పుస్తెలతాడును కొత్త వాటిలాగే మెరిపిస్తామని ఆమెకు మాయ మాటలు చెప్పి ఆమె పుస్తెలతాడు తీసుకొని వారి వెంట తీసుకువచ్చిన గిన్నెలో లిక్విడ్ ను పోసి పుస్తెల తాడును అందులో ముంచి క్లీన్ చేసి కొద్దిగా బంగారాన్ని అందులో కరిగేటట్టుగా చేసి తిరిగి ఆమె తాళిబొట్టు ఆమెకు ఇచ్చేసినట్లు తాము చేసిన నేరాన్ని ఒప్పుకున్నారని విచారణ అనంతరం నిందితులను అరెస్ట్ చేసి జుడిషియల్ రిమాండ్ కి తరలించనట్లు తెలిపారు. కేసు చేధనలో ముఖ్యపాత్ర వహించిన తొగుట ఎస్సై వి. రవికాంత్ రావు, తొగుట పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ చంద్రయ్య, పిసి లు భాను, నాగరాజు, ఉమ లను పోలీస్ ఉన్నతాదికారులు అభినందించారు. ఈ సందర్భంగా తొగుట ఎస్సై మాట్లాడుతూ గ్రామలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు వచ్చి ఇలా మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసే ప్రమాదం ఉన్నందున ప్రజలు అలాంటి వ్యక్తులని నమ్మవద్దని ఎవరైనా అలా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, లేదా డయల్ 100 కాల్ కి ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.

### ప్రభుత్వ పాఠశాలల

## మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



సిద్ధిపేట రూరల్, జూన్ 16 , (ప్రజాజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 23 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు, మెదక్ విభాగ్ కన్వీనర్ సావుల ఆదిత్య డిమాండ్ చేశారు. ఏబీవీపీ సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి శాస్త్రికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం కాకుండా మెరుగైన మౌలిక వసతులు కల్పించి బలోపేతం చేయాలని కోరారు.విద్యను వ్యాపారంగా మార్చి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి తరుణ్, సోషల్ మీడియా కన్వీనర్ భాస్కర్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యమే నా ప్రాధాన్యత: ఎమ్మెల్యే పల్లా

● చేర్యాలలో రూ.11.66 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చేర్యాల జూన్ 16(ప్రజాజ్యోతి): పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం చేర్యాలలోని రేణుక గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో.. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూలిమిట్ట మండలాలకు చెందిన 55 మంది లబ్ధిదారులకు రూ.11.66 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన నియోజకవర్గంగా జనగామ నిలిచిందని తెలిపారు. డిసెంబర్ 2023 నుండి నీలిమ హాస్పిటల్ ద్వారా వేలాది మంది నిరుపేదలకు నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.ప్రజలు ఆరోగ్య సమస్యలు వస్తే ముందుగా ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించాలని సూచించారు. అవసరమైన పరిస్థితుల్లో తమ నీలిమ హాస్పిటల్ సేవలను వాడుకోవచ్చని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ,వైస్ చైర్ పర్సన్ ,కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాలుగు మండలాల బిఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

### గ్రామ ప్రజలపై అమ్మవారి

## ఆశీస్సులు మెండుగా ఉండాలి: ఎమ్మెల్యే పల్లా



చేర్యాల, జూన్ 16 (ప్రజాజ్యోతి): చేర్యాల మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మంగళవారం జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందించి, వేదాశీర్వచనం చేశారు.పూజా కార్యక్రమాల అనంతరం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. పోతిరెడ్డిపల్లి గ్రామ ప్రజలందరికీ ఆ పెద్దమ్మ తల్లి ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరారు. గ్రామమంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని, అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ నిలిచివుండాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### మరమ్మతుల కారణంగా

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొండపాక జూన్ 16 ,(ప్రజాజోతి):-కొండపాక మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్తు మరమ్మతుల కారణంగా వారం రోజులపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ సత్యం తెలిపారు. విద్యుత్ వైర్లకు తాకుతున్న కొమ్మలను తొలగించడం కోసం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఆయా గ్రామాల్లో మరమ్మత్తులు జరిగే సమయాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాల అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు అందుకు సహకరించాలని కోరారు.

## చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడి కేంద్రాలే బలమైన పునాదులు

- సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్
- పెంజర్ల అంగన్వాడిలో స్కూల్ డ్రెస్సులు, అన్న ప్రసాదం ప్రారంభించిన సర్పంచ్ ఎర్రోళ్ల జగన్





**కొత్తూర్ జూన్ 16 (ప్రజా జ్యోతి) :** చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడి కేంద్రాలే బలమైన పునాదులు అని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ అన్నారు. మంగళవారం కొత్తూరు మండలంలోని పెంజర్ల గ్రామంలో అమ్మ మాట -- అంగన్వాడి బాట కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ హాజరై విద్యార్థులకు యూని ఫాంలు పంపిణీ చేసి,అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో కలిసి అక్షరాభ్యాస చేయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ జగన్ మాట్లా డుతూ.. బాల్యంలోనే విద్యకు బలమైన పునాది వేయ డంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన తెలిపారు. పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య,ఆరోగ్య సేవలను సమగ్రంగా అందిస్తూ చిన్నారుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌస్, జడ్.పి.హెచ్.ఎస్ ప్రధానోపాధ్యాయులు రఘుపతి రెడ్డి,అంగన్వాడి టీచర్స్ మామిడి ఇంద్రమ్మ,కమ్మరి జ్యోతి, గ్రామస్తులు దేశాల జైపాల్, సహదేవ్, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడు అన్నగారికి జన్మదిన శుభాకాంక్షలు!



**కుత్బుల్లాపూర్ 16 ప్రజాజ్యోతి :** ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీ జీవితం ఆరోగ్యం, ఆనందం, ఆయురారోగ్యాలతో నిండి ఉండాలని, మీరు మరింత కాలం ప్రజలకు సేవ చేసే శక్తి, ఉత్సాహంతో ముందుకు సాగాలని కోరుకుంటున్నాము. మీ నాయకత్వం, సేవాభావం సమాజానికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాము. ప్రజల ప్రేమాభిమానాలు ఎల్లప్పుడూ మీ వెంట ఉండాలి,మీ జీవితం విజయాలతో వెలుగొందాలి, ఆరోగ్యం,ఆనందం,ఐశ్వర్యం మీ సొంతం కావాలి కోరుకుంటూ మల్లారెడ్డి నగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు.

## సిసి రోడ్లను పరిశీలించిన మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ జూన్ 16(ప్రజా జ్యోతి) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని గాజులరామారం సర్కిల్ పరిధిలో గల శ్రీరామ్ నగర్ కాలనీ ఎం ఎఫ్ ఫంక్షన్ హాల్ నుండి మంజూరైన ఎనిమిది అంతర్గత సిసి రోడ్లను స్థానిక మాజీ శాసనసభ్యులు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ బస్తీలో తిరుగుతూ మంజూరైన రోడ్లను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు కాలనీలలో తిరుగుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని వాటిలో భాగంగా 55 లక్షల రూపాయలతో మంజూరైన ఈ రోడ్లను పరిశీలించడం జరిగింది,గత బిఆర్ఎస్ హయాంలో 10 సంవత్సరాలపాటు ఎక్కడ అంతర్గత రోడ్లు మరియు డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేయలేదని పూర్తిగా నిర్వీర్యం చేసి ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని విమర్శించారు ఈ సందర్భంగా కాలనీవాసులు సిసి రోడ్లను మంజూరు చేయించిన మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్ శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు హరీష్, రాకేష్, మధు, అశ్వత్, అనురాధ, సల్మాన్, నాగరాజు, రఫీ, ఇలియాస్, దశరథ్ మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

## రెడీమిక్స్ లారీ డ్రైవర్‌కు రావలసిన వేతనం ఇప్పించిన బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి



**కుత్బుల్లాపూర్ జూన్ 16(ప్రజా జ్యోతి) :** శంషాబాద్: శంషాబాద్ ఏరియాలోని "కే ఎన్ ఆర్ రెడీమిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ" లో లారీ డ్రైవర్ గా సోను అనే డ్రైవర్ గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు డిసెంబర్ నెల రావాల్సిన వేతనం 27,000/-వేల రూపాయలు అతను ఎంత అడిగినా ఏదో ఒకటి చెప్పి అతనికి డబ్బులు ఇవ్వకుండా మాయమాటలు ఓనర్ నవీన్ రెడ్డి చెప్పి పంపించేవారు... అతనికి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే మనకు న్యాయం చేస్తారని తోటి డ్రైవర్లను అడిగి తెలుసుకుని శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి కార్యాలయం దగ్గరికి వెళ్లి అతనికి జరిగిన అన్యాయం గురించి చెప్పుకున్నారు.. వెంటనే స్పందించిన శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి హుటాహుటిన.. కేఎన్ఆర్ రెడీమిక్స్ యజమాన్యం ఓనర్ నవీన్ రెడ్డి తో మాట్లాడి డ్రైవర్ సోనుకు రావాల్సిన 27,000/- రూపాయల వేతనం మొత్తం సోను కు ఇప్పించారు..కార్మికుల పక్షాన నిలిచి సమస్య పరిష్కరించిన రవి ని సోను అతని కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు... ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, నర్సింగ్, సిపిఐ చారి, తల్వార్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## రూ.50 వేల కోట్ల అభివృద్ధి పనులతో పరిగి రూపురేఖలు మారనున్నాయి : ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి

- జాబ్ మేళా ప్రారంభం - నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రత్యేక చర్యలు

**పరిగి, జూన్ 16 (ప్రజా జ్యోతి) :** పరిగి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమాన్ని మంగళవారం పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసిన ఆయన, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు. ఎస్కేఎస్ఎస్, యంఎస్ఎన్ సంస్థల సహకారంతో నిరుద్యోగ యువతకు 45 రోజుల ఉచిత శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పరిగి నియోజకవర్గంలో రూ.50 వేల కోట్ల వ్యయంతో రీజినల్ రింగ్ రోడ్, నేషనల్ హైవే, రైల్వే లైన్ వంటి భారీ ప్రాజెక్టులు అమలవుతున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. జాఫర్‌పల్లి సమీపంలో 140 ఎకరాల్లో ఎకో అర్బన్ పార్క్, రూ.6 వేల కోట్లతో రేడియల్ రోడ్డు, రూ.3 వేల కోట్లతో నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. కొందుర్గు--పరిగి--లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు భూసేకరణకు





ప్రభుత్వం రూ.587 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలన్నీ పూర్తయితే పరిగి పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో కొత్త అవకాశాలకు కేంద్రంగా మారుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

- ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశాలు
- ఇంటర్మీడియట్ విద్యార్థులకు వసతి సదుపాయాలు
- ఎంపీసీ బైపీసీ సిఇసి ఏసీఈ గ్రూపులు అందుబాటులో
- హిందీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, పిజిటి పోస్టులు ఖాళీ
- ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ అనిలా

వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు బషీరాబాద్ మండలం విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ అనిలా ఒక ప్రకటన తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు వసతి సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఎంపీసీ, బైపిసి, సిఇసి, ఏసీఈ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.





అదేవిధంగా పాఠశాలలో హిందీ పిజిటి, ఫిజిక్స్ పిజిటి, కెమిస్ట్రీ పిజిటి, పోస్టులు ఒక్కొటి చొప్పున ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీతో, పాటుటెట్ అర్హత కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు, తల్లిదండ్రులు అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం ఆదర్శ పాఠశాల కార్యాలయాన్ని సంప్రదించాలని ప్రిన్సిపల్ అనిలా కోరారు. ఈ అప్లికేషన్ చివరి తేదీ 20.06.2026 వివరాలకు ప్రిన్సిపాల్ మేడంని సంప్రదించగలరని కోరడమైనది.

## అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు,హెల్త్ కార్డు ఇవ్వాలి



**దౌల్తాబాద్ జూన్, 16(ప్రజాజ్యోతి) :** అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు,హెల్త్ కార్డులు ఇవ్వాలని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు టి. రామచందర్, జిల్లా కార్యదర్శి ఎండి. షఫీలు కోరారు, మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని స్పీకర్ క్యాంపు కార్యాలయంలో జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలని టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మెమోరండం అందించారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా జర్నలిస్టులు బాధ్యతాయుతమైన సేవలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో

సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కు టిడబ్ల్యూజేఎఫ్ వినతిపత్రం

విలేకరుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఎలాంటి గౌరవ వేతనం లేకుండానే సామాజిక బాధ్యతతో జర్నలిజం రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టుల సేవలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు కేటాయిస్తామని ప్రభుత్వల హామీగానే మిగులుతుందన్నారు, సొంత ఇండ్లు లేక, కిరాయి భరించలేక జర్నలిస్టులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని అన్నారు,జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఆరోగ్య హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి ఆరోగ్య భద్రత కల్పించే హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. సమాజానికి సేవలందిస్తున్న జర్నలిస్టులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించడం అవసరమని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించి వెంటనే ఇండ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ టిడబ్ల్యూజేఎఫ్ నాయకులకు తెలిపారు, ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెంకట్ రామ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు హాఫీజ్ ఖాన్, పుటుక అనంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచుల సమస్యలు పరిష్కరిస్తాం

- సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్

**వికారాబాద్ ప్రతినిధి, జూన్ 16(ప్రజా జ్యోతి) :** 73వ రాజ్యాంగ సవరణను పూర్తిస్థాయిలో అమలు చేసి గ్రామపంచాయతీలకు నేరుగా నిధులు మళ్లించాలని తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం అనంతగిరి హరిత రిసార్ట్‌లో నిర్వహించిన సర్పంచుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచుల సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ, వారికి ఆరోగ్య భద్రత కార్డు అందించడంతో పాటు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, నెలకు రూ.25 వేల గౌరవ వేతనం చెల్లించాలని సూచించారు. మండల సమావేశాలకు హాజరయ్యే సర్పంచులకు రూ.1000 టిఏ ఇవ్వాలని, ప్రతి గ్రామపంచాయతీకి రూ.25 లక్షల ప్రత్యేక నిధులు నేరుగా విడుదల చేయాలని అన్నారు. ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి, లబ్ధిదారుల ఎంపిక సర్పంచుల సమక్షంలోనే జరగాలని కోరారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు సర్పంచుల ఆధ్వర్యంలోనే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం జిల్లా కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బోయిని రాములు, ప్రధాన కార్యదర్శిగా



సామాని నాగిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ప్రమీల, యాదవరెడ్డి దుబ్యా నాయక్, గౌరవ అధ్యక్షుడిగా చెంబాస్ కుమార్ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా కరణం రాధ, లక్ష్మణ్ గౌడ్, శ్రీకాంత్, మశ్చందర్ రెడ్డి, కోశాధికారిగా రవీందర్ పవార్, గౌరవ సభ్యులుగా రవీందర్ నాయక్, మానెమ్మ, కె. అశోక్, వెంకటరామ్ గౌడ్ ఎంపికయ్యారు. కొత్తగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు బోయిని రాములు మాట్లాడుతూ సర్పంచుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డికి రాష్ట్ర కార్యదర్శి మందిపాల్ వెంకట్ కి, సర్పంచ్లకు ధన్యవాదాలు తెలియజేశారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా 19న మెగా ఇంటీరియర్ డిజైన్ షో ప్రారంభం

- ఐఐఐడీ షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్ 2026
- జూన్ 19 నుంచి 21వ తేదీ వరకు..
- ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి

**శేరిలింగంపల్లి,జూన్ 16 (ప్రజాజ్యోతి):** ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైన్ రంగాలలో దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ద్వైవార్షిక ప్రదర్శన ఐఐఐడీ షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్ 2026 ను ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు ఐఐఐడీ హెచ్ఆర్సీ చైర్‌పర్సన్ ఆర్కిటెక్ట్ ఎన్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ హైదరాబాద్ రీజినల్ చాప్టర్ (ఐఐఐడీ-హెచ్ఆర్సీ) నిర్వహించబోయే ఈ మూడు రోజుల ప్రదర్శనను ముఖ్య అతిథి తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని చెప్పారు.ఎగ్జిబిటర్ డైరెక్టరీని ఆవిష్కరిస్తారన్నారు.ఈ వివరాలు తెలిపేందుకు బంజారా హిల్స్ లో ఉన్న బీ హబ్లో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మూడు రోజులు ఉదయం పది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు సందర్శకుల కోసం ఈ ప్రదర్శన తెరిచి ఉంటుంద న్నారు. ఆధునిక సమాజాన్ని,దేశ ఆర్థిక వృద్ధిని తీర్చిదిద్దడంలో డిజైన్ అత్యంత శక్తివంతమైన దానిలో ఒకటన్నారు. ప్రజలు ఎలా జీవిస్తు న్నారు, ఎలా పని చేస్తున్నారు, ఎలా నేర్చుకుంటున్నారు, ఒకరితో ఒకరు ఎలా అనుసంధానం అవుతున్నారు అనే విషయాలపై డిజైన్ ప్రభావం చూపుతుందని వివరించారు. హైదరాబాద్ నగరం సృజనాత్మ కత, వ్యవస్థాపకత, సాంకేతికత, డిజైన్‌లకు ఒక శక్తివంతమైన కేం ద్రంగా ఎదిగిందన్నారు. ఈ ప్రదర్శన ఆలోచనలు,ప్రతిభ, ఆవిష్కర ణలు, పరిశ్రమల కలయికగా నిలుస్తుందన్నారు. ఇది భవిష్యత్తు డిజైన్ రంగాన్ని తీర్చిదిద్దడానికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి





ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ (ఐఐఐడీ) ప్రెసిడెంట్ ఆర్కిటెక్ట్ జిగ్నేష్ మోడీ గౌరవ అతిథిగా హాజరు కానున్నారని చెప్పారు. ఈ ప్రదర్శనకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, దేశ, విదేశాల నుంచి ఆర్కిటెక్ట్‌లు, ఇంటీరియర్ డిజైనర్లు,బిల్డర్లు, కన్సల్టెంట్లు, ట్రేడ్ పార్ట్‌నర్‌లు, విద్యార్థులతో సహా ఆరు వేల మందికి పైగా వ్యాపార సందర్శకులు విచ్చేయనున్నట్లు తెలిపారు.ఎనభై వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జరగనున్న ఈ ప్రదర్శనలో 150 పైగా ఎగ్జిబిటర్లు, 300 పైగా ప్రముఖ బ్రాండ్‌లు పాల్గొంటున్నాయన్నారు. ఇవి నివాస, వాణిజ్య ఇంటీరియర్స్ కోసం సరికొత్త ఉత్పత్తులు, మెటీరియల్స్, టెక్నాలజీలు, సరికొత్త పరిష్కారాలను ప్రదర్శించనున్నాయన్నారు. రన్‌వే తరహాలో ప్రత్యేకంగా రూపొందించిన డిజైన్ స్ట్రీట్' ఎగ్జిబిషన్ కారిడార్, పరిశ్రమలోని ప్రముఖ నిపుణులతో నిర్వహించే నాలెడ్జ్ సెషన్స్, ఇంటర్నేషనల్ కీనోట్స్, విద్యార్థుల కోసం వర్క్‌షాప్‌లు, పోటీలు, ఇంటరాక్టివ్ లెర్నింగ్తో కూడిన ప్రత్యేక వేదిక స్థాపత్య ఉత్సవ్ ఈ ఈవెంట్‌లో ప్రధాన ఆకర్షణగా నిలవనుందని చెప్పారు. ఆర్కిటెక్చర్, ఇంటీరియర్స్, నిర్మాణ రంగానికి సంబంధించిన భవిష్యత్తును మార్చ బోతున్న సరికొత్త ట్రెండ్స్, ఆవిష్కరణలను ఈ ఈవెంట్ సమగ్రంగా పరిచయం చేయనుందన్నారు. మొదటి రోజున సాయంత్రం ఐదు గంటలకు కార్పొరేట్ మీట్ నిర్వహించబడు తుందన్నారు. ఈ సందర్భంగా ఐఐఐడీ షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్ 2026 కన్వీనర్, ఐఐఐడీ హెచ్ఆర్సీ గౌరవ కార్యదర్శి ఆర్కిటెక్ట్ రాకేష్ వాసు సీఎస్ మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ఆసక్తిగా ఎదురుచూసే డిజైన్ ఈవెంట్‌లలో ఒకటిగా నిలిచిందన్నారు. ఈ ఎడిషన్ గతం కంటే అద్భుతంగా ఉండనుందని చెప్పారు. ఇటీవల కాలంలో ఏఐ ఈ వృత్తిని, పరిశ్రమను గణనీయంగా ప్రభావితం చేసిందన్నారు. కృత్రిమ మేధ టూల్స్ పని సామర్థ్యాన్ని పెంచాయన్నారు. నిపుణుల సృజనాత్మక ఆలోచనలను ఎంతో వేగంగా, కచ్చితత్వంతో ఉపయోగపడే, పర్యావరణహిత పరిష్కారాలుగా మార్చడానికి సహాయపడుతున్నాయని వివరించారు. క్లయింట్ల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను త్వరగా అప్‌డేట్ చేయడానికి, రియల్ టైమ్‌లో రకరకాల డిజైన్ వేరియేషన్లను చూపించడానికి డిజైనర్లకు కృత్రిమ మేధ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. లైటింగ్, శానిటరీ సిస్టమ్స్ నుంచి గేట్ల కదలికల వరకు ఎన్నో సరికొత్త ఆవిష్కరణలు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు.

## నియోజకవర్గ ఇన్చార్జ్ తిరుపతి రెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి పోస్టర్ ఆవిష్కరణ



**దౌల్తాబాద్ జూన్, 16 (ప్రజాజ్యోతి):** కొడంగల్ నియోజకవర్గం లగచర్ల గ్రామంలో కొడంగల్ నియోజకవర్గ ఇన్చార్జ్ తిరుపతిరెడ్డి చేతుల మీదుగా వాల్ పోస్టర్ ఆవిష్కరణచేశారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ వేల కోట్లు వెచ్చించి కొడంగల్ నియోజకవర్గాన్ని విద్యా, ఉద్యోగ, వైద్య, రంగాలలో శరవేగంగా ముందుకు నడిపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికీ అన్ని విధాలుగా అండదండలుగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవడంలో కొడంగల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ నాయకులు ముందుండాలని గుర్తు చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతనంగా అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవం



**దౌల్తాబాద్ జూన్, 16(ప్రజాజ్యోతి) :** దౌల్తాబాద్ మండలంలోని దేవర్ ఫసల్వాద్ గ్రామంలో 61 లక్షల రూపాయలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించిన కొడంగల్ నియోజకవర్గ ఇన్చార్జ్ తిరుపతిరెడ్డి కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూరా రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి,శ్రీరామ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ కొడంగల్ మార్కెట్ చైర్మన్ అంభయ్యా గౌడ్,మండల అధ్యక్షులు వెంకట్రావు బోడి వెంకట్ రెడ్డి వీరన్న కూర వెంకటరాములు రాజశేఖర్ రెడ్డి నర్సప్ప రాజగోపాల్, మాధవరెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నేడు ఓటరు చైతన్యానికి 2K రన్..




**పరిగి, జూన్ 16 (ప్రజాజ్యోతి) :** ప్రత్యేక విస్తృత ఓటరు జాబితా పునర్విమర్శ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమంలో భాగంగా ఓటరు చైతన్యాన్ని పెంపొందించేందుకు వికారాబాద్ జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆధ్వర్యంలో నేడు ఉదయం 8 గంటలకు పరిగిలో 2కే రన్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పరిగి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి తెలిపిన వివరాల ప్రకారం, వికారాబాద్ జిల్లా ఎస్ విఇఇపి నోడల్ అధికారి సూచనల మేరకు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలు అలాగే మండల కేంద్రాల్లో ఒకేసారి 2 కే రన్ కార్యక్రమం చేపడుతున్నారు. పరిగి మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నుండి రన్ ప్రారంభం కానుందని తెలిపారు. ఓటరు నమోదు, ఓటు హక్కు ప్రాముఖ్యత, ప్రజాస్వామ్యంలో పౌరుల భాగస్వామ్యంపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి యువత, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల తోపాటు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అధికారులు కోరారు.

## రైతు నేస్తంలో యూరియా యాప్‌పై అవగాహన

కొడిమ్యాల, జూన్ 16,(ప్రజాజ్యోతి): రైతులకు వ్యవసాయ సాంకేతికతను చేరువ చేసే లక్ష్యంతో ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమం మండలంలోని కొడిమ్యాల, పూడూర్, తిర్మలాపూర్ రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు.
వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు యూరియా బుకింగ్



యాప్ వినియోగంపై రైతులకు వివరించారు. శాస్త్రవేత్తలు ప్రకృతి వ్యవసాయం, యూరియా యాప్‌పై అవగాహన కల్పించారు. రైతులు వరి కొనుగోలు, బోనస్ తదితర అంశాలపై తమ సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి.భాస్కర్, మండల వ్యవసాయ అధికారి పి.జ్యోతి, వ్యవసాయ అధికారులు, కృషి సఖులు, రైతులు పాల్గొన్నారు.

## నల్లగొండ ఆలయ ఈవోగా కిరణ్

కొడిమ్యాల, జూన్ 16,(ప్రజాజ్యోతి): మండలం నల్లగొండలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన కార్యనిర్వహణాధికారిగా డి. కిరణ్ మంగళవారం బాధ్యతలు



స్వీకరించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.

## చిన్నారుల బంగారు భవిష్యత్‌కు అంగన్వాడి బాట

కొడిమ్యాల,జూన్ 16,(ప్రజాజ్యోతి): మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం-10 లో మంగళవారం 'అమ్మ మాట.. అంగన్వాడి బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు నుంచి



ఐదేళ్లలోపు పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని అంగన్వాడి టీచర్ విజయలక్ష్మి తల్లులకు సూచించారు. ఆటపాటల ద్వారా ప్రాథమిక విద్యతో పాటు పోషకాహారం అందిస్తామని తెలిపారు. ప్రతి నెల పిల్లల ఎత్తు, బరువును నమోదు చేసి వారి ఎదుగుదలను పర్యవేక్షిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఆయా పద్మ, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం

(కోరుట్ల రూరల్, ప్రజా జ్యోతి, జూన్ 16) కోరుట్ల మండలంలోని మోహన్ రావు పేట గ్రామంలో మంగళవారం రోజున అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు అంగన్వాడి సూపర్వైజర్ చేతుల



మీదుగా ఈ అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా సర్పంచ్ సరికెల్ల లతికా నరేష్ మాట్లాడుతూ మన ఊరి అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అంగన్వాడి కేంద్రాల ద్వారా పిల్లలకు ప్రభుత్వం అందజేస్తుందని ప్రతి ఒక్కరు తమ ఇంట్లో చిన్నపిల్లల్ని అంగన్వాడి కేంద్రానికి పంపించాలని కోరారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్, ఆయాలు, పిల్లలు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పోస్టుల కోసం బోగస్ పత్రాలు

చొప్పదండి, జూన్ 16 ( ప్రజా జ్యోతి): చొప్పదండి మండల పరిధిలోని గ్రామాల్లో అంగన్వాడీ టీచర్ పోస్టుల కోసం కొందరు నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించారని ఆరోపణలు




వినవస్తున్నాయి. అంగన్వాడీ టీచర్ పోస్ట్ కోసం సంబంధిత ఏరియాలో నివాసం ఉండేవారు మాత్రమే అర్హులు. కాగా ఆ ఏరియాలో నివాసం లేకున్నా ఉన్నట్టుగా బోగస్ ధ్రువీకరణ పత్రాలు సృష్టిస్తున్నారని పలువురు ఆరోపించారు. విచారణ జరిపించి అర్హులకే టీచర్ పోస్టులు దక్కేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## 21న నీట్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

- పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి
- కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో, జూన్ 16 (ప్రజాజ్యోతి ) ఈనెల 21న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించే నీట్ పరీక్షను భద్రత నడుమ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో విద్య, వైద్య , ఆర్టీసీ, పోలీస్, ఎన్పీడీసీఎల్ శాఖల అధికారులతో నీట్ పరీక్ష నిర్వహణ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 3,001 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5:15 గంటల వరకు ఉంటుందని.. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. గతంలో కంటే ఈసారి పరీక్షకు 15 నిమిషాలు ఎక్కువ సమయం ఉంటుందన్నారు. అభ్యర్థులు పాస్ ఫోటో, గుర్తింపు కార్డు, అడ్మిట్ కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. ఆభరణాలు, షూలు ధరించి రావద్దని.. నిబంధనలు విధిగా పాటించాలని అభ్యర్థులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల నిర్వహణ, అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ట్రాన్స్ కో అధికారులను.. పరీక్ష కేంద్రం వద్ద మందులతో శిబిరం ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.పరీక్షకు రెండు రోజుల ముందే అధికారులు.. పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు బృందంగా ఏర్పడి పరీక్ష నిర్వహణను విజయవంతం చేయాలన్నారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేలా పరీక్ష కేంద్రానికి అదనంగా ఒక జిల్లా అధికారిని నియమిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదే రోజున యోగా దినోత్సవం సందర్భంగా ర్యాలీ ఉంటుంది కాబట్టి విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ చర్యలు చేపట్టాలన్నారు. ప్రశ్నాపత్రం, సమాధాన పత్రాలు రవాణాకు ప్రత్యేక బందోబస్తు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, పరీక్ష నోడల్ ఆఫీసర్, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ పంకజ్ సింగ్, డీఈఓ ప్రశాంత్, అశోక్ రెడ్డి, ఏసీపీ సతీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం చాటిన లింగంపేట సర్పంచ్

భీమారం జూన్ 16 ప్రజాజ్యోతి జగిత్యాల జిల్లా భీమారం మండలం లింగంపేట గ్రామ సర్పంచ్ వెల్మల సుప్రియ, హరీష్ రెడ్డి దంపతులు ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తమకు ఉన్న విశ్వాసాన్ని ఆచరణలో చూపిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలిచారు. తమ కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నాణ్యమైన విద్య అందుతుందనే సందేశాన్ని గ్రామ ప్రజలకు అందించారు.



ప్రస్తుతం అధిక సంఖ్యలో తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో సర్పంచ్ దంపతులు తీసుకున్న ఈ నిర్ణయం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న ఆధునిక మౌలిక వసతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం వంటి సదుపాయాలపై నమ్మకం ఉంచి తమ కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ వెల్మల సుప్రియ మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే సామర్థ్యం ప్రభుత్వ పాఠశాలలకు ఉంది. అందుకే మా కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాం" అని తెలిపారు.
గ్రామంలోని తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచుకుని తమ పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేర్పించాలని ఆమె పిలుపునిచ్చారు. సర్పంచ్ దంపతులు తీసుకున్న
ఈ నిర్ణయాన్ని గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు అభినందిస్తూ, ప్రభుత్వ విద్యాభివృద్ధికి ఇది ఒక మంచి ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## బంధనకల్ పాఠశాలలో పాఠ్య పుస్తకాల పంపిణీ -

### విద్యార్థులకు సర్పంచ్ చిగురు నరేష్ ప్రోత్సాహం

ముస్తాబాద్, జూన్ 16: ( ప్రజా జ్యోతి ): నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని బంధనకల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ఎంపీపీ ఎస్ పాఠశాలలో పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చిగురు నరేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేసి వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిగురు నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పాఠ్య పుస్తకాలను
సద్వినియోగం చేసుకొని విద్యార్థులు విద్యలో రాణించాలని సూచించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాఠశాలలో అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు.



ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఏపీసీ చైర్మన్ సద్ది మంజుల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఎంపీపీ ఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలు పవనశ్రీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ఎంపీపీ ఎస్ బంధనకల్ పాఠశాల విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరానికి అవసరమైన పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసి వారి విద్యాభ్యాసానికి శుభారంభం కల్పించారు.

## వానమ్మా.. రైతన్నను ఆదుకోవమ్మా..!

### మేఘాల కోసం ఎదురుచూపులు.. ఎండిన నేలలతో రైతన్న ఆవేదన

కొనరావుపేట, జూన్.16(ప్రజా జ్యోతి) ఆకాశం వైపు ఆశగా చూస్తూ రైతన్నలు వాన కోసం ఎదురు చూస్తున్నారు. జూన్ నెల సగం గడిచినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో సాగుకు సిద్ధం చేసిన పొలాలు ఎండిపోతుండగా, రైతుల ముఖాల్లో ఆందోళన నెలకొంది. విత్తనాలు సిద్ధం చేసుకుని, భూములను దున్ని వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు మేఘాలు కనిపించిన ప్రతిసారీ ఆశలు చిగురిస్తున్నాయి. కానీ చినుకులు కురవకపోవడంతో ఆ ఆశలు మళ్లీ నిరాశగా మారుతున్నాయి.
"వానమ్మ ఒక్కసారి రావమ్మా.. మా పొలాలకు ప్రాణం పోయమ్మా" అంటూ రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ములవాగు పరివాహక ప్రాంతాల్లో ఈ సమయానికి సాగు పనులు ఊపందుకునేవని, ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులతో పొలాలు బీడుగా మారాయని రైతులు చెబుతున్నారు.సకాలంలో వర్షాలు కురవకపోతే పంటల సాగు ఆలస్యం కావడంతో పాటు విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు పెరిగి మరింత ఆర్థిక భారం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఎండిపోయిన నేలలు, అడుగంటుతున్న చెరువులు, సాగునీటి కొరత రైతన్న కష్టాలను రెట్టింపు చేస్తున్నాయి. ఒక్క మంచి వాన పడితేనే నేలతల్లి పచ్చదనం సంతరించుకుంటుందని, రైతన్న ముఖంలో చిరునవ్వు విరుస్తుందని గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని, అన్నదాత కష్టాలకు ఫలితం దక్కాలని రైతన్నలు వేడుకుంటున్నారు.
"వానమ్మా ఒక్కసారి రావమ్మా.. అన్నదాత గుండెల్లో ఆశల దీపం వెలిగించమ్మా..!"

## గంగాధర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభానికి ముమ్మర ఏర్పాట్లు: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం.

గంగాధర జూన్ 16: (ప్రజా జ్యోతి): మండల కేంద్రంలోనీ మధుర నగర్లో నూతనంగా మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే తరగతులు నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రస్తుతానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంపై అదనపు తరగతి గదులను నిర్మించాలని నిర్ణయించారు. ఈ విషయమై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జిల్లా కలెక్టర్‌తో ఫోన్ లో మాట్లాడారు. తక్షణమే గదుల నిర్మాణ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం, డిగ్రీ కళాశాల శాశ్వత భవన నిర్మాణం కొరకు మండల పరిధిలోని మధురానగర్‌లో అనువైన స్థలాన్ని ఎమ్మెల్యే అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంగాధర ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, కళాశాల భవన నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ దమ్మని రాము,ఎమ్మార్వో అంబటి రజిత,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంత్రి మహేందర్,మధురానగర్ సర్పంచ్ వేముల భాస్కర్,కాంగ్రెస్ నాయకులు అట్ల శేఖర్ రెడ్డి,పెంచాల చందు,దాతు అంజి,మేర్గ కొండయ్య,బైరిశెట్టి సంపత్ ,గుండవేని తిరుపతి పాల్గొన్నారు.



## అనంతగిరి పాల ఉత్పత్తి దారుల సంస్థ అధ్యక్షుడిగా పల్లె మధుసూదన్ రెడ్డి ఎన్నిక

ఇల్లంతకుంట జూన్ 16(ప్రజజ్యోతి) రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి గ్రామంలోని కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో నడుస్తున్న పాల ఉత్పత్తి దారుల సంస్థ అధ్యక్షుడిగా మంగళవారం ఎన్నికలు నిర్వహించగా పల్లె మధుసూదన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు . ఈ సందర్భంగా పల్లె మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం తో సంస్థ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా నా ఎన్నికకు సహకరించి డైరెక్టర్లకు పాలఉత్పత్తి దారుల కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ఈ కార్యక్రమంలో అగ్రహారం మేనేజర్ జి రవీందర్ రూట్ సూపర్వైజర్లు సి హెచ్ వెంకట్ రాంరెడ్డి జి సతీష్ రెడ్డి పాలక వర్గ సభ్యులు పాల ఉత్పత్తి దారుల తదితరులు పాల్గొన్నారు.

## కప్పతల్లి ఆడుతున్న చిన్నారులు

ఇల్లంతకుంట జూన్ 16 (ప్రజజ్యోతి) రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూర్



గ్రామంలో మంగళవారం రోజు గ్రామంలోని కొందరు చిన్నారులు వర్షాలు సమృద్ధిగా కురవాలని కప్పతల్లి ఆట ఆడారు సమయానికి వర్షాలు పడక తమ తల్లిదండ్రులు పంటలు వేయక ఇబ్బంది పడటం చూసి చిన్నారులు కప్పతల్లి ఆటలాడి ఈ సంవత్సరం వర్షాలు సకాలంలో కురవాలని వాన దేవుణ్ణి గ్రామ ఇష్టదేవత రేణుక ఎల్లమ్మ తల్లిని వేడుకున్నారు ఈ దృశ్యాన్ని చూసిన గ్రామ రైతులు యువత చిన్నారులను అభినందించారు.

## రాచర్ల బాకూర్ పల్లెకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 30 లక్షల గోదాం మంజూరి.....

ఎల్లారెడ్డిపేట జూన్ 16( ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బాకుర్పల్లె గ్రామానికి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 30 లక్షల రూపాయల గోదామును మంజూరు చేసినట్టు గ్రామ సర్పంచి జయ మాజీ సర్పంచ్ పడిగల రవీందర్ తెలియజేశారు. ఐకెపి గోదాం మంజూరు కి సహకరించిన సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి ప్రభుత్వం విప్పు ఆది శ్రీనివాస్ కు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డికి దొమ్మాట నర్సయ్యకు గ్రామం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.




## పోలిస్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసి ఎస్పీ

ఇల్లంతకుంట జూన్ 16 (ప్రజజ్యోతి) రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ మహేష్ బి గితే (ఐపిఎస్) మంగళవారం రోజు




ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా స్టేషన్ లోని రికార్డులను, నేర చరిత్ర కలిగిన వారి వివరాలను తెలుసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి మత్తుకు యువత బానిసకావద్దని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తు పట్టుబడితే చర్యలు తప్పవన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వద్దని, ప్రతి గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట సిరిసిల్ల రూరల్ సిఐ నాగేశ్వర్ రావు, ఎస్ ఐ సిరిసిల్ల అశోక్ , సిబ్బంది ఉన్నారు.

## పది లక్షల సీసీ రోడ్డుకు భూమి పూజ .....సర్పంచ్ నాగరాజు.....

ఎల్లారెడ్డిపేట జూన్ 16( ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్ గ్రామంలోని పోచమ్మ గుడి ముందు నుండి గట్టు మల్లికార్జున స్వామి గుడి వరకు సర్పంచ్ రోడ్డుకు భూమి పూజ చేశారు. గ్రామానికి 10 లక్షల సీసీ రోడ్డు మంజూరు అయిందని మహిళా సమైక్య భవనం 10 లక్షల రూపాయలు గ్రామ అభివృద్ధికి సహకరించిన మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, సర్పంచ్ దొమ్మాటి నరసయ్య ,ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డికి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ,రవాణా శాఖ మంత్రి ప్రభాకర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు యాదవ్ ,గుమ్మడి సతీష్ ,వార్డ్ సభ్యులు పంతంగి సతీష్, ఉప్పల ఎల్లారెడ్డి ,సెక్రటరీ రమేష్, చీకట్లో శ్రీనివాస్ , రామచంద్రపురం ,మల్లారెడ్డి, చెక్కల ప్రభాకర్ ,చీకట్ల నారాయణ స్వామి, మల్లయ్య, రామస్వామి, దేవయ్య, తిరుపతి, కార్తీక్ , వెంకట్రామిరెడ్డి ,ఆగయ్య, బాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్‌బిఐలో సీపీపీ దరఖాస్తులు
# అందజేసిన విశ్రాంతి ఉద్యోగులు



**సత్తుపల్లి జూన్16(ప్రజా జ్యోతి)** ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు ప్రయోజనకరమైన కాంప్రహెన్సివ్ పెన్షన్ ప్రాజెక్టు దరఖాస్తులను మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సత్తుపల్లి బ్రాంచ్ మేనేజర్ సూర్య చంద్ర సాహుకి అందచేసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సర్వీసు పెన్షనర్ల కొరకు అనేక ప్రయోజనాలతో కూడిన పథకాన్ని అందుబాటులోకి తెచ్చిందని,వివరాలు తెలుసుకున్న టి.యస్.జి.ఆర్.ఈ.ఏ. నాయకులు తొలి విడతగా నలభై దరఖాస్తులను బ్యాంకు మేనేజర్ కు మంగళవారం అందచేసారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవరెడ్డి, ప్రకాశరావు, నాయకులు సాంబశివరెడ్డి, బూరుగు దాసు, మధుసూదన రాజు, పూర్ణచంద్రరావులు ఉన్నారు.

## స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ సాగర్‌కు ఎమ్మెల్యే అభినందన



**జా జ్యోతి)పల్లి జూన్16(ప్రసత్తు** పట్టణంలోని శ్రీ బండి శోభనాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ కోర్స్, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న సరియం సాగర్ ఏ.ఈ.టి లో 500 మార్కులకు గాను 495 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ ను కైవసం చేసుకున్నాడు. మంగళవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ర్యాంక్ సాధించిన విద్యార్థిని సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సాగర్ ను శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య భవిష్యత్తుకు ఆధారం అవుతుందని, మంచిగా చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు,సమాజానికి గొప్ప పేరు తీసుకురావాలని, ఆయనను కొనియాడారు. ఆమె వెంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మయ్య, అధ్యాపకులు మధుకర్, అనసూర్య, రాంబాబు, శ్రీహరి తదితరులు ఉన్నారు.

# ఖాతాలో డబ్బులు మాయం..!

● న్యాయం చేయండి..కళాకారుడు ఆవేదన..



**నేలకొండపల్లి, జూన్ 16 ప్రజా జ్యోతి :** కళాకారుల పింఛన్ తో జీవితం గడుపుతున్న కళాకారుడు బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు మాయమాయ్యయి. సమగ్ర విచారణ చేసి నా డబ్బులు రికవరి చేయాలని వేడుకున్నారు. బాధితుడు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని చెరువుమాధారం గ్రామానికి చెందిన ఏపూరి సత్యనారాయణ అనే కళాకారుడు ఖాతా లో నుంచి రూ.21,500 డ్రా చేశారు. ఇటీవల కళాకారుడు పెండింగ్ పింఛన్ మొత్తం రూ.90 వేలు తన ఖాతాలో జమ చేశారు. కాగా ఆ మొత్తం నుంచి రూ.69,400 లను రెండు పర్యాయాలు డ్రా చేసుకున్నానని తెలిపారు. తరువాత మంగళవారం డబ్బులు అవసరం ఉండి ఏటీయం . వద్ద కు వెళ్లితే ఖాతా జీరో బ్యాలెన్స్ చూపిస్తుందన్నారు. అనుమానం తో 'స్టేట్మెంట్ ను పరిశీలిస్తే డ్రా చేసిన విషయం తెలుసుకుని అవాక్కయ్యారు. కానీ మిగతా సొమ్ము తన కు తెలియకుండానే రూ.21,500 నగదు ను పలుమార్లు ఏటీయం ద్వారా డ్రా చేశారని పేర్కొన్నారు. గత నెల 15 వ తేదిన 4,500, 18 న 5. వేలు, 23 న రూ. 10 వేలు, మరో మారు రూ.1 లను ఏటీయం వద్ద డ్రా చేశారు. ఈ డబ్బులు మెత్తం కూడ ఖమ్మం లోని ఓ ఏటీయం వద్ద డ్రా చేసినట్లు స్టేట్మెంట్ లో ఉంది. కానీ ఆ ఏటీయం ఎక్కడ ఉందో కూడ బాధితుడు కు తెలియదు. కేవలం కళాకారుల పెన్షన్ పై ఆధారపడి జీవిస్తున్న తమ ఖాతా నుంచి గుర్తు తెలియని దుండగులు మాయం చేశారని... సమగ్ర విచారణ చేసి రికవరి చేసి తమకు అప్పగించాలని సైబర్ క్రైమ్ పోలీసుల ను ఆశ్రయించారు.

## ఉచిత నృత్య శిక్షణ అందించడం అభినందనీయం



**ఇల్లందు, జూన్ 16 (ప్రజా జ్యోతి)** వేసవి కాలంలో చిన్నారులకు ఉచిత నృత్య శిక్షణ అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఇల్లందు పట్టణంలోని బ్లూ మూన్స్ డాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకలు మంగళవారం కళాసి బస్తిలో గల ఆర్యవైశ్య సత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్లూ మూన్స్ డాన్స్ స్టూడియో నిర్వాహకులు చిన్నారులకు శిక్షణ ఇవ్వడం గొప్ప విషయమని, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడం సంతోషకరమన్నారు. డాన్స్ వల్ల చిన్నారులకు ఏకాగ్రత పెరుగుతుందని, ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ మాట్లాడుతూ



క్రీడ, సాంస్కృతిక శిబిరాల వల్ల చిన్నారులలో ఉన్న ఉత్సాహాన్ని మరింత పెంచుతుందని తెలిపారు. చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో చిన్నారులు వారి ప్రతిభను ప్రదర్శించాలన్నారు. అనంతరం సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందిన చిన్నారులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ముద్రగడ వంశీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దొడ్డ డానియల్, జీవి భద్రం, విజయలక్ష్మి నగర్ పంచాయతీ సర్పంచ్ చందావత్ రమేష్ బాబు, తుడుం దెబ్బ రాష్ట్ర నాయకుడు ఈసం నరసింహారావు, నిర్వాహకులు పొదిల శ్యామ్, రవితేజ, శశి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఫెర్టిలైజర్ యూరియా యాప్ పై అవగాహన



**ఇల్లందు, జూన్ 16 (ప్రజా జ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్స్ యూరియా యాప్ పై రైతులకు మంగళవారం మండల పరిధిలోని చల్లసముద్రం రైతు వేదికలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు అవగాహన కల్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా రైతులు తమ ప్రాంతాల్లో యూరియా లభ్యత, స్టాక్ వివరాలు తెలుసుకోవడంతో పాటు అవసరమైన ఎరువులను సులభంగా పొందవచ్చని కోరారు. రైతులు ఎరువుల కోసం అనవసరంగా తిరగాల్సిన అవసరం తగ్గి సమయం, ఖర్చు ఆదా అవుతుందన్నారు. యాప్ అమలు వల్ల ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరిగి బ్లాక్ మార్కెట్ విక్రయాలను అరికట్టడంలో కూడా సహాయపడుతుందని తెలిపారు. రైతులకు అవసరమైన సమయంలో యూరియా అందుబాటులో ఉండేలా ప్రణాళిక బద్ధంగా సరఫరా చేయడంలో ఈ వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. వినూత్న కార్యక్రమాన్ని అమలు చేసి రైతులకు సాంకేతిక సేవలను రాష్ట్ర ప్రభుత్వం చేరువ చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ లాల్ చంద్, ఏఓ సతీష్, ఏఈఓ సందీప్, ఫెర్టిలైజర్ డీలర్లు సోమ సుందర్, జనార్ధన్, గణేష్, రామలింగ చారి, బాలకృష్ణ, రైతులు మోకాళ్ళ సతీష్ కుమార్, పోటు రవి, లకావత్ గోప, రాంబాబు, ఎల్లంపల్లి బుచ్చయ్య, పత్తి ఉప్పలయ్య, రెడ్యా, గుగులోతు వీరన్న, ముక్తి సమ్మయ్య, అజ్మత్ పాషా తదితరులు పాల్గొన్నారు.



# అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి ఎమ్మెల్యే రాగమయి

● త్వరలో రెవిన్యూ, ఫారెస్ట్ భూ సర్వే ● అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



**సత్తుపల్లి జూన్16(ప్రజా జ్యోతి)** అర్హుల అందరికీ కచ్చితంగా తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి అందించే సంక్షేమ పథకాలు వారికి కచ్చితంగా చేరాలని, సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మండల రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రజలకు ఎలా సేవలందిస్తున్నారు, ఏమేమి పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయి, ప్రజాదర్బార్ లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించినారా, జి పి ఓ లు , సెక్రటరీలు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారా, హౌసింగ్ ఏఈల పనితీరు ఎలా ఉంది ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు ఏమైనా పెండింగ్ బిల్లులు ఉన్నాయా అని ప్రతి ఒక్కరి తోటి రివ్యూ సమావేశాన్ని ఏర్పాటు చేసి,అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల జరిగిన ప్రజా దర్బార్ లో ప్రజలు పెట్టుకున్న దరఖాస్తు వివరాలు పూర్తిగా పరిష్కరించాలని, గ్రామాల్లో రేషన్ కార్డు కోసం దరఖాస్తుదారులు ఇంకా ఉంటే ఎటువంటి ఆలస్యం చేయకుండా వెంటనే వారికి రేషన్ కార్డు అందజేయాలని, అతి త్వరలో రెవిన్యూ,ఫారెస్ట్ జాయింట్ సర్వే జరుగుతుందని అధికారులంతా రెడీగా ఉండాలని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం సంక్షేమ పథకాలు అర్హులకు చేరాలని, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క,మంత్రి తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు అర్హుల గల ప్రజలకు చేరే విధంగా అందరు కృషి చేయాలని అన్నారు. ప్రతి అధికారి ప్రజలకు అందుబాటులో ఉండాలని,ప్రజా సమస్యల పెండింగ్లో ఉంచవద్దని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ లు, జిపిఓ లు,సెక్రటరీలు, మండల పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు తదితరులు ఉన్నారు.

# టేకులపల్లిలో ప్రైవేట్ పాఠశాలల అక్రమ ఫీజులపై చర్యలు తీసుకోవాలి

● ప్రైవేట్ బుక్‌స్టాల్‌తో ఒప్పందం.. వారు చెప్పిన రేటుకే పుస్తకాలు కొనాల్సిందే ● లంబాడా హక్కుల పోరాట సమితి డిమాండ్

**టేకులపల్లి, జూన్15 ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల కేంద్రంలోని ప్రైవేట్ విద్యాసంస్థలు, ముఖ్యంగా మాంటిసోరి స్కూల్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు, డొనేషన్లు, పుస్తకాల పేరుతో వివిధ రకాల అదనపు చార్జీలు వసూలు చేస్తూ అమాయక ఆదివాసీ, గిరిజన తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని లంబాడా హక్కుల పోరాట సమితి (నంగారా భేరి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆరోపించింది. ఈ మేరకు జిల్లా కమిటీ అధ్యక్షుడు భూక్య లాలు నాయక్, మండల అధ్యక్షుడు మూడ్ హుస్సేన్ నాయక్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ పూర్తి ఏజెన్సీ ప్రాంతమైన టేకులపల్లి మండలంలో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మండల కేంద్రంలోని మాంటిసోరి స్కూల్ యాజమాన్యం అక్రమ వసూళ్లకు పాల్పడుతోందని ఆరోపించారు. అంతేకాకుండా, కొన్ని ప్రైవేట్ బుక్‌స్టాళ్లతో పాఠశాల యాజమాన్యాలు ఒప్పందాలు చేసుకుని, తల్లిదండ్రులు ఇతర చోట్ల పుస్తకాలు కొనుగోలు చేయకుండా నిర్బంధిస్తున్నారని పేర్కొన్నారు. యాజమాన్యం సూచించిన బుక్‌స్టాల్‌లోనే, వారు నిర్ణయించిన అధిక ధరలకు పుస్తకాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. దీంతో పేద, మధ్యతరగతి, గిరిజన కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని తెలిపారు. జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల వ్యవహారంపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి విచారణ చేపట్టాలని, అక్రమ ఫీజులు, డొనేషన్లు, బలవంతపు పుస్తకాల విక్రయాలను అరికట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆదివాసీ, గిరిజన కుటుంబాల తరఫున పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



## భూభారతి చట్టం వచ్చిన
# "రైతులకు మోక్షం కరువాయే"

● దిక్కుతోచని స్థితిలో రైతులు ● అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

**అశ్వాపురం, జూన్ 16, ప్రజా జ్యోతి** ధరణి స్థానంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి =– 2025 చట్టం రైతుల సమస్యలు తీర్చకపోగా కొత్త చిక్కులు తెచ్చిపెడుతోందని అశ్వాపురం మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్నట్లుగా మారిందని వాపోతున్నారు.



**ధరణి తప్పులు అలాగే.**

గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌లో జరిగిన తప్పులు, వివాదాలు, పట్టా సమస్యలు ఇప్పుడు కొత్త భూభారతి పోర్టల్‌లోనూ అలాగే కొనసాగుతున్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే వెసులుబాటు కల్పించినా, క్షేత్రస్థాయిలో అధికారుల చొరవ కరువైంది. మండల స్థాయిలో దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లోనే ఉండిపోతున్నాయి.

**రైతుల ఇక్కట్లు ఇవీ:**

అధికారుల జాప్యం ఆన్‌లైన్‌లో దరఖాస్తు పెట్టినా రెవెన్యూ అధికారులు పరిష్కారం చూపకుండా రైతులను ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటున్నారు. నిర్లక్ష్యమా లేక సిబ్బంది కొరతా అర్థం కాని పరిస్థితి ఏర్పడింది..వారసత్వం, కుటుంబ పంపకాల పేరిట భూభారతిలో కొత్త వివాదాలు పుట్టుకొస్తున్నాయి. దీంతో రైతులు కోర్టుల చుట్టూ, రెవెన్యూ ఆఫీసుల చుట్టూ తిరిగి సతమతమవుతున్నారు..అసలు యజమానులకు తెలియకుండా పాత తేదీలతో సాదా బైనామా పేరిట భూములు ఇతరుల పేర్లకు బదిలీ అవుతున్నాయి. ఇది పెద్ద సమస్యగా మారింది 5 ఎకరాలు ఉన్న రైతుకు 3 ఎకరాలకే పట్టా ఉండి, మిగిలిన 2 ఎకరాలకు పట్టా కోసం నెలల తరబడి దరఖాస్తులు పెట్టినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు... భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా భూభారతి పోర్టల్‌ను తెచ్చినా, అశ్వాపురం రెవెన్యూ ఆఫీస్‌లో మాత్రం అధికారుల చొరవ కరువైందని రైతులు ఆరోపిస్తున్నారు. సాంకేతిక లోపాలు, అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతు సమస్యలకు మోక్షం ఎప్పుడు వస్తుందోనని ప్రశ్నిస్తున్నారు..రైతుల సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, అశ్వాపురం రెవెన్యూ కార్యాలయంలో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని అశ్వాపురం మండల రైతులు డిమాండ్ చేస్తున్నారు...

## కొణిజర్ల అభివృద్దే నా ధ్యేయం: సర్పంచ్ పుష్పావతి

**వైరా – కొణిజర్ల జూన్ 16 ప్రజా జ్యోతి** కొణిజర్ల గ్రామపంచాయతీ అభివృద్దే తన దేయమని పంచాయతీని అన్ని విధాల అభివృద్ధి చేసి తీరుతానని సర్పంచ్ గూదే పుష్పావతి ఉపేందర్ అన్నారు. మండల కేంద్రమైన కొణిజర్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా గత ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించిన ఆమె మంగళవారం ప్రజాజ్యోతితో మాట్లాడారు. గ్రామ అభివృద్ధి తీరుని వివరించారు. తాను ఎన్నికైన కొద్దికాలంలోనే ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న సిసి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేశామని చెప్పారు. తాగునీటి సమస్య లేకుండా, నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో బోర్లు వేయించామని, డ్రైనేజీల్లో పేరుకుపోయిన మురికిని క్లీన్ చేయించడంతోపాటు, కొత్త డ్రైన్ లు నిర్మిస్తున్నామని చెప్పారు. వీధి కుక్కల బెడదని నివారించామని తెలిపారు. గతంలో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉండటంతో కుక్కలను పట్టించి బయటికి తరలించమన్నారు పంచాయతీలో వీధులన్నీ, శానిటైజర్ శామని అన్నారు. అనేక రకాల మొక్కలతో నర్సరీని అద్భుతంగా అభివృద్ధి చేశామని, రాబోవుకాలంలో గ్రీన్ గ్రామపంచాయతీగా తీర్చు దిద్దుతానని, పచ్చదనతో నింపి గ్రీనరీ పంచాయతీగా పేరు సాధిస్తామని అన్నారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, రాజ్యసభ ఎంపీ గారపాటి రేణుక చౌదరి సహకారంతో పంచాయతీని మోడ్రన్ పంచాయతీగా తీర్చిదిద్దుతామని తెలిపారు. రాబోవు కాలంలో అధిక నిధులు తీసుకొచ్చి పంచాయతీని జిల్లాలో గొప్ప అభివృద్ధి పంచాయతీగా మలుస్తామన్నారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు వార్డు సభ్యులు ఉన్నారు.



## అంజన్నకు అభిషేకం..రామయ్యకు కల్యాణం..

**భద్రాచలం టౌన్ , జూన్ 16 , ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో మంగళవారం దాసాంజనేయస్వామి వారి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన అర్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.



## చిన్నారిని ఆశీర్వదించిన దాసరి



**సత్తుపల్లి జూన్16(ప్రజా జ్యోతి)** మండల పరిధిలోని గంగారం గ్రామానికి చెందిన నీలం హనుమంతరావు కుమారుడు అన్నప్రాసన వేడుక,బేతుపల్లి అంకమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ అన్నప్రాసన కార్యక్రమానికి గంగారం అభివృద్ధి ప్రదాత ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మాజీ వైస్ ఎంపీపీ దాసరి వెంకటరామిరెడ్డి(చిట్టి నాయన )హాజరై చిన్నారికి అక్షింతలు వేసి, ఆశీర్వదించినారు. చిన్నారిని ఆశీర్వదించిన వారిలో మధుబాబు యూత్ సభ్యులు ఉన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే రాగమయి



**సత్తుపల్లి జూన్16(ప్రజా జ్యోతి)** మున్సిపాలిటీ పరిధిలోని 19 వ వార్డు కౌన్సిలర్ కర్నాటి విజయ్ కుమారి, వెంకట నారాయణ రెడ్డి వారి మనవడు గ్రీష్మంత్ రెడ్డి మొదటి పుట్టినరోజు వేడుకలను సిద్ధారం రోడ్ లో గల ఎమ్మార్ గార్డెన్ లో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ హాజరై చిన్నారికి అక్షింతలు వేసి, ఆశీర్వదించినారు. ఆశీర్వదించిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్ పాషా, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, పట్టణ అధ్యక్షులు గాదె చెన్నారావు, కాంగ్రెస్ నాయకులు, మట్టా అభిమానులు ఉన్నారు.

## గుర్తింపు కార్డు అందుకున్న డబ్బు కళాకారులు మహంకాళి శ్రవణ్ కుమార్.

రంగారెడ్డి జూన్ 16 ( ప్రజా జ్యోతి)
సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అందజేసిన మొట్ట మొదటి ప్రభుత్వ



గుర్తింపు కార్డు ను మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా డప్పు కళాకారుడు మహంకాళి శ్రవణ్ కుమార్ అందుకున్నారు. గత 20 సంవత్సరాలు గా డప్పు కళాకారుడు గా ప్రభుత్వ,ప్రైవేట్ కార్యక్రమాలలో ఎన్నో ప్రదర్శనలు చేసినందుకు గాను నన్ను గుర్తించి మొట్ట మొదటగా నా కార్డ్ తోనే ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని శ్రవణ్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహ రెడ్డి,సాంస్కృతిక సారధి ఛైర్మన్ వెన్నెల, శ్రీనివాస్ ,నరసింహ పాల్గొన్నారు.

## రైతులకు ప్రజలకు ఆసౌకర్యం కలుగకుండా నిత్యం శుభ్రంగా ఉంచాలి

### చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి

రంగారెడ్డి జూన్ 16 (ప్రజా జ్యోతి)
ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్ యార్డును ప్రతిరోజు శుభ్రంగా ఉంచాలని , మార్కెట్ కు వచ్చే రైతులకు ,ప్రజలకు, వ్యాపారులకు



ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అధికారులకు సూచించారు. మార్కెట్ యార్డులో చెత్తాచెదారం పేరుకుపోయిందని రైతులు, వ్యాపారులు ఫిర్యాదు చేయడంతో తక్షణమే స్పందించి పూర్తిస్థాయిలో చెత్తాచెదారాన్ని శుభ్రపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో మరింత అప్రమత్తంగా ఉండాలని చెత్తను ఎప్పటికప్పుడు తీసివేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టడంతో పాటు, సమస్యలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. రైతులు, వ్యాపారులు ఏ చిన్న సమస్య ఉన్నా నిరభ్యంతరంగా మా దృష్టికి తీసుకురావాలి అని కోరారు.

## అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

రంగారెడ్డి జూన్ 16 (ప్రజా జ్యోతి)
ఎన్టీఆర్ నగర్ ఫేజ్ 3 లో మంగళవారం అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూపర్ వైజర్ నారాయణమ్మ విజ్ఞప్తి



చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం తో పాటు శిశువులకు పౌష్టికాహారం, ఆరోగ్య సలహాలు సూచనలు కూడా ఉంటాయని ఆమె వివరించారు. అదే విధంగా కిషోర్ బాలికలకు కూడా ఆరోగ్యపరమైన అంశాలు తెలుసుకోవడానికి అంగన్వాడీ టీచర్లు కృషి చేస్తున్నారు అని ఆమె అన్నారు. బాలింతలు, గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య సలహాలతో పాటు పౌష్టికాహారం కూడా ఉంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పుష్పలత, గంగా, సునీత, ఆశా వర్కర్లు హేమలత వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్

మొదటిపేజీ తరువాయి..
రూపుదిద్దుకుంటుంది'.. అన్నది ఇకపై ఒక నినాదం మాత్రమే కాదు.. కళ్ల ముందు కనిపించే నిజం. ఆ నిజానికి సాక్ష్యం ఆరుట్లలోని 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'. మేధావుల సలహాలు, విజ్ఞుల సూచనలతో తెలంగాణ విద్యా వ్యవస్థ చరిత్రను విప్లవాత్మక సంస్కరణలతో తిరిగి రాయాలన్న నా సంకల్పానికి



రూపం 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' అని పేర్కొన్నారు. చరిత్ర పుటల్లో కలిసిపోతున్న సర్కారు బడి ప్రజా పాలనలో నేడు మళ్లీ పూర్వ వైభవాన్ని మించిన వైభవంతో, సకల సౌకర్యాలతో, ఆధునిక వసతులతో, పిల్లల మేధో వికాస్ క్షేత్రంగా నిలవబోతోంది. తెలంగాణ బిడ్డల పాలిట సరస్వతీ కటాక్ష ఆలయంగా రూపుదిద్దుకున్నది. ఆకలి తీర్చి, అక్షరాలు నేర్పి, ఆటను ప్రోత్సహించి పిల్లల్లో మనోవికాసం వికసించేలా, మట్టిలో మాణిక్యాలను తీర్చిదిద్దే సకల హంగులతో రూపుదిద్దుకున్న నా మానస పుత్రిక ఈ పాఠశాల. 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'కు రూపం ఇచ్చే కార్యంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. విద్యార్థులకు అభినందనలు. ఆరుట్లలో ఆవిష్కృతమవుతున్న నేటి ఈ 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' ఆరంభం మాత్రమే. తెలంగాణ వ్యాప్తంగా భవిష్యత్‌లో వంద తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను నెలకొల్పడం తదుపరి మా కర్తవ్యం' అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## నీట్ పరీక్షపై ఇంతగా హంగామా ఎందుకు?

### బిజెపి మాజీ అధ్యక్షుడు అన్నామలై సూటి ప్రశ్న

చెన్నై,జూన్16(ప్రజాజ్యోతి): నీట్-యూజీ రీ-ఎగ్జామినేషన్ కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భారీ భద్రతా ఏర్పాట్లపై తమిళనాడు బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రశ్నలు లేవనెత్తారు. ఇటీవల జరిగిన పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో రీ-ఎగ్జామ్ నిర్వహించేందుకు అధికారులు కఠిన చర్యలు చేపడుతున్నారు. అయితే ఒక పరీక్ష నిర్వహణ కోసం అంత పటిష్ఠ భద్రత ఎందుకని అన్నామలై ప్రశ్నించారు.'ఐఏఎఫ్ విమానాలతో కూడిన సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్ భద్రత.. ఏఐ నిఘాతో కూడిన సీసీటీవీల పర్యవేక్షణ.. ప్రవేశానికి ముందు బయోమెట్రిక్, ఫేస్ ఐడీ.. పలు అంచెల తనిఖీలు.. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ప్రత్యక్ష పర్యవేక్షణ..ఇవన్నీ ఎందుకని ప్రశ్నించారు. జూన్ 21న జరగనున్న నీట్ రీటెస్ట్ కోసం విద్యా మంత్రిత్వ శాఖ చేసిన ఏర్పాట్లు' అని ట్వీట్ చేశారు .లీకేజీలను అరికట్టడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఒక కీలక పరీక్ష సమయంలో యువ విద్యార్థిపై అదనపు భారాన్ని మోపుతాయనే విషయాన్ని మరచిపోతున్నారు. ఇది మన పరీక్షా వ్యవస్థ మొత్తం ఉద్దేశ్యాన్ని, పరీక్ష ఒత్తిడిని తగ్గించాలనే ఎన్ఈపీ 2020 లక్ష్యాన్ని నీరుగారుస్తోంది. కేంద్రం తీసుకున్న ఈ చర్యలు సమస్యను పరిష్కరించకపోగా, మరిన్ని ఇబ్బందులు సృష్టించవచ్చుని అన్నామలై పేర్కొన్నారు.

## దేశం కోసం యువతరం కదలాలి: సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ

**మోదీ ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం**
**మనపై ఆంక్షలు విధిస్తున్న ట్రంప్ పేరును హైదరాబాద్ లోని ఒక రోడ్డుకు పెట్టడం సిగ్గుచేటు**
**సీపీఎం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బీవీ రాఘవులు**
**దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరిగింది**
**రాజ్యసభ సభ్యుడు రహీం**
**సీపీఎం రాష్ట్ర యువ కమ్యూనిస్టుల సమ్మేళనం**

రంగారెడ్డి జూన్ 16 (ప్రజా జ్యోతి)
యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని, పెట్టుబడిదారుల నుంచి దేశాన్ని విముక్తి చేయడానికి యువతరం కదిలాలని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ సిగ్గుచేటు అని విమర్శించారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు మోదీ ఎదుట మోకరిల్లుతున్నాయని ధ్వజమెత్తారు. దేశాభివృద్ధి కోసం యువతరం కదిలాలని బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యుడు రహీం మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వంలో దేశ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అయిందన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం భారీగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశ ఉత్పత్తులపై భారీ ఆంక్షలు విధిస్తున్నా, మన దేశ నౌకలపై దాడులు చేస్తున్నా అమెరికాను నిలదీసే ధైర్యం ప్రధాని మోదీకి లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు యువతరం ముందుకు రావాలని ఆయన కోరారు. సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ సీపీఎం పార్టీ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీస్తూ పేదలకు




పిలుపునిచ్చారు..
మోదీ ప్రభుత్వం దేశ భవిష్యత్తును అమెరికాకు తాకట్టు పెట్టారని, ఆర్థిక వ్యవస్థ పెట్టుబడిదారుల చేతుల్లో ఉందని రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. కొత్తపేటలోని బీజేఆర్ భవన్ మంగళవారం యువ కమ్యూనిస్టుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జెండాను రాష్ట్ర, జాతీయ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం సమ్మేళనంలో బీవీ రాఘవులు మాట్లాడుతూ అమెరికా చేతిలో ప్రధాని మోదీ కీలుబొమ్మగా మారాడని, మన నావికులను చంపినా అడిగే ధైర్యం మోదీకి లేదన్నారు. అమెరికా ఇరాన్ పై చేస్తున్న యుద్ధానికి మోదీ మద్దతు ఇస్తారని ఆరోపించారు. దేశానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రధాన శత్రువులని మండిపడ్డారు. మన దేశంపై ఆర్థిక ఆంక్షలు విధిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేరును హైదరాబాద్ నగరంలో ఒక రోడ్డుకు పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలో అన్ని విధాలుగా విఫలమైందని, ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో రైతు బంధు ఇవ్వలేదని, ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సీపీఎం పార్టీ బలోపేతానికి యువజన నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటి యువతరం రాజకీయాల్లోకి వచ్చి సమసమాజం స్థాపనకు ఉద్యమించాలని జాన్ వెస్లీ కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, నాయకులు వీరయ్య, వెంకన్న, తొట రమేశ్, పగడాల యాదయ్య, నర్సింహ, గోపి నాయక్, కట్ట శ్రీనివాస్, ఆలేటి ఎల్లయ్య, కీసరి నర్సిరెడ్డి తోపాటు డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

## ఒడిషాలో ఘోర రోడ్డు ప్రమాదం

భువనేశ్వర్,జూన్16(ప్రజాజ్యోతి): ఒడిశాలో దారుణం జరిగింది. రెండు ట్రక్కులు ఢీకొన్న ఘటనలో వాటిలోని ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనమయ్యారు. ఈ ఘటన మంగళవారం ఉదయం ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లా, భస్మా పోలీస్ స్టేషన్ పరిధిలో కైంత్రా వద్ద, పదో నెంబర్ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైవేపై ఝూర్సుగూడ నుంచి సుందర్‌గఢ్ వెళు_న్న ట్రక్కు అతివేగం కారణంగా అదుపుతప్పింది. వేగాన్ని డ్రైవర్ నియంత్రించలేకపోవడంతో డివైడర్‌ను దాటిన ట్రక్కు ఒకవైపు నుంచి మరోవైపు రోడ్డు మీదికి వెళ్లిపోయింది. దీంతో అటువైపు నుంచి వస్తున్న ట్రక్కును ఢీకొంది. ఇలా రెండు ట్రక్కులు ఢీకొనడంతో వెంటనే మంటలు చెలరేగాయి. అవి పెద్ద ఎత్తున వ్యాపించి, పూర్తిగా అంటుకున్నాయి. ఈ ఘటనలో రెండు ట్రక్కుల్లోని డ్రైవర్లు మంటల్లో సజీవదహనమయ్యారు. వాహనాలు ఢీకొన్న సమయంలో డీజిల్ ట్యాంకర్ పగలడం వల్ల ఒక్కసారిగా మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. రెండు ట్రక్కులకు పూర్తిగా మంటలు అంటుకున్నాయి. డ్రైవర్లు బయటపడే అవకాశమే లేకపోయింది.

## సన్నరకం వరి విత్తనాలు సిద్ధం చేయండి

మొదటిపేజీ తరువాయి..
మండలంలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్ట్‌ను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింతగా పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఏఐని మరింతగా వినియోగించాలని నిర్దేశిరచారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. సీడ్స్ నుంచి కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలు చేయాలని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్‌ను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. అన్ని వ్యవసాయ మందులకు సంబంధించి ఓ యాప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బుక్ చేసుకునే యూరియాను రైతు వేదిక ద్వారా పంపిణీ చేయాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు యూరియా పంపిణీ బాధ్యతను అప్పగించాలని ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడూ కేంద్రప్రభుత్వానికి లేఖలు రాయాలని ఆదేశించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయిన ఎరువులు మొత్తం తెలంగాణకే ఇచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎరువుల పరిస్థితిపైన అన్ని పార్టీల ఎంపీలతో ఓ సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరించాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.















Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967